# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

**శుక్రవారం, జనవరి 24, 2014**

**13 వ శా. స. XII – III సమావేశం, వాల్యూం -- VIII నంబరు -- 1**

**శక సంవత్సరం – 1935, మాఘం – 4**

## FRIDAY, THE 24th JANUARY, 2014

**13 L.A. XII - III SESSION, VOL— VIII No. - 1**

**4 - Magha, 1935 - S.E.**

#


శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి<br>శ్రీమతి ఆర్. వనితా రాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా.( శ్రీమతి) వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవ రావు<br>శ్రీ కె. వెంటేశ్వర రావు<br>శ్రీ డి. జగన్ మోహన్ రావు<br>శ్రీ బి. ప్రభాకర రావు<br>శ్రీమతి కె. భారతి<br>శ్రీమతి డి. విజయ కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

-------------

**ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు**

**అధికార నివేదిక**

**( 13వ శాసన సభ )**

**(12వ సమావేశపు మూడవ సమావేశము : ఇరవైయ్యవ రోజు)**

**శుక్రవారము, జనవరి 24, 2014**

**సభ ఉ. గం.9.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

## విషయ సూచిక

1. సభా కార్యక్రమము
వాయిదా తీర్మానాల అనుమతి గురించి
2. భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (కొనసాగింపు)

-------

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ**

**శుక్రవారం, జనవరి 24, 2014**

* * *

(ఉదయం 9.00 గంటలకు సభ సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

(సభ ప్రారంభమైన వెంటనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు కొందరు తమ స్థానాలను విడిచి పోడియం వద్దకు చేరుకుని, 'జై సమైక్యాంధ్ర' అంటూ నినాదాలు చేయసాగారు.)

MR. SPEAKER: Again you are coming into the well of the House. బిఏసీలో పాల్గొన్న సభ్యుల్ని మీరు అడగండి. మీ పార్టీ నుండి సభ్యురాలు శోభా నాగిరెడ్డి గారు, విజయమ్మ గార్లు సమావేశంలో ఉన్నారు. బిఏసీలో ఏం చర్చించామనేది వారిని అడగండి. ఈ విధంగా రోజు సభను అడ్డుకోవడం సబబుగా లేదు. వాయిదా తీర్మానాలు.

"సమైక్యాంధ్ర, తెలంగాణా ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై చర్చను కోరుతూ శ్రీ చందనా రమేష్‌గారిచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది."

(పోడియం వద్ద నున్న వైఎస్సాఆర్ సీపీ సభ్యులచే అంతరాయం)

Then why you are having a doubt? You yourself are asking a question and also giving the answer. రెండూ మీరే చెబుతున్నారు. అటువంటప్పుడు మీకు అనుమానం ఎందుకు? దయచేసి కూర్చోండి. సభ్యులకున్న హక్కుల్ని.. లేదా, మీకున్న అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి మీరు కనీసం కూర్చుని చర్చల్లో పాల్గొనాలి కదా? దయచేసి కూర్చోండి.

"రాష్ట్ర విభజన బిల్లుపై సభ్యుల అభిప్రాయాన్ని తెలుపుతూ ఓటింగ్ నిర్వహించుట గురించి శ్రీమతి వై.ఎస్.విజయమ్మ గారిచ్చిన వాయిదా తీర్మానం కూడా తిరస్కరించడమయినది."

(పోడియం వద్ద నున్న వైఎస్సాఆర్ సీపీ సభ్యులు ' ఓటింగ్‌పై స్పష్టత ఇవ్వాలి ', ' జై సమైక్యాంధ్ర ', 'We want Voting' అంటూ నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కలిగించసాగారు)

ప్రతిరోజూ మీరు ఈ విధంగా చేయడం ఏ మాత్రం సబబుగా లేదండి. The note has been circulated to all the Members. Please understand the procedures of the House. What is this? ప్రతిరోజూ మీరు ఈ విధంగా అడ్డుకోవడమంటే... Yes, Chief Whip garu…

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి (ప్రభుత్వ ప్రధాన సచేతక్)ః అధ్యక్షా, నిన్ననే బిఏసీ సమావేశం జరిగింది. అందులో గౌరవ సభ్యురాలు శ్రీమతి వై.ఎస్.విజయమ్మ గారు, శోభానాగిరెడ్డి గారు కూడా పాల్గొన్నారు. నిన్ననే మనమంతా దాదాపు 2 గంటల పాటు కూర్చుని సభను సజావుగా నడపడానికి నిర్ణయం తీసుకున్నాము. ఓటింగ్‌పైన వారు అడిగిన దానికి మేము అక్కడే సమాధానం చెప్పడం జరిగింది. భారత రాష్ట్రపతి గారు అదనంగా వారం రోజుల సమయమిచ్చారు. కాబట్టి, ఈ సమయాన్నైనా సద్వినియోగం చేసుకోవడానికి, సభ్యులందరూ మాట్లాడటానికి ఆసక్తితో ఉన్నారు. చాలా మంది చర్చలో పాల్గొనాలని ఉన్నారు. కాబట్టి, యువజన, శ్రామిక, రైతు పార్టీలకు చెందిన మా సోదర సోదరీమణులందర్నీ కూడా సభను సజావుగా జరగడానికి దయచేసి సహకరించమని మీ ద్వారా కోరుతున్నాను.

MR.SPEAKER: Extension of time has been given to all the Members to use but not to obstruct the proceedings like this. మీరు కోరిన విధంగా రాష్ట్రపతి గారు అదనపు సమయం ఇచ్చింది ఇక్కడ చర్చించుకోవడానికి.

(తిరిగి 'ఓటింగ్‌పై స్పష్టత ఇవ్వాలి' అంటూ వైఎస్సార్ సీపీ సభ్యులచే నినాదాలు కొనసాగాయి)

What is this?

( తిరిగి 'We want Voting' అంటూ వైఎస్సార్ సీపీ సభ్యులచే నినాదాలు కొనసాగాయి)

The House is adjourned for 15 minutes.

(Then the House adjourned at 09.05 a.m.)

ఉ.9.30 RSS/MAR

(విరామనంతరం సభ తిరిగి ఉ.గం 09.37 లకు సమావేశమైనది
గౌరవ సభాపతి అధ్యక్ష స్థానలంలో ఉన్నారు)

**భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (కొనసాగింపు)**

మిస్టర్ స్పీకర్ : నిన్న జరిగిన బీఏసీలో చర్చించిన విధంగా కొంత మంది సభ్యులకు కూడా ఈ రోజు అవకాశం ఇద్దామనుకున్నాం. కాబట్టి దయచేసి అందరు కూడా సహకరించండి. ముందుగా డా.అబ్రహాము గారు..

డా.వి.ఎం.అబ్రహాము (అలంపూర్): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు పైన మాట్లాడటానికి అవకాశమిచ్చిన మీకు, నన్ను గెలిపించి ఈ 13వ శాసనసభకు పంపించిన అలంపూర్ నియోజకవర్గం ప్రజలందరికీ ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. గౌరవ రాష్ట్రపతి గారి ద్వారా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు రావడం జరిగింది, ఆ బిల్లును పూర్తిగా స్వాగతిస్తూ మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. ఈ ముసాయిదా బిల్లు ఎందుకు వచ్చింది? కారణమేమిటి? ఇది తొందరపాటు నిర్ణయమా? కాదు, కాదు దాదాపు 57 సంవత్సరాల నుండి తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజల సుదీర్ఘ పోరాటం, 1200 మంది విద్యార్థుల బలిదానాల కారణంగా ఈ బిల్లు వచ్చింది. అదేవిధంగా నీరు, నిధులు, ఉపాధి, ఉద్యోగాల్లో అవకతవకలు, తెలంగాణాకు చాలా వరకు అన్యాయం జరగడం పైన తెలంగాణ ప్రజల యొక్క పోరాటాన్ని గమనించిన యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ గారు, అదే విధంగా ప్రధానమంత్రి డా.మన్మోహన్ సింగ్ గారు సిడబ్ల్యుసి సమావేశం ద్వారా తెలంగాణా బిల్లును పంపించడం జరిగింది. ఈ బిల్లును పూర్తిగా సమర్థిస్తున్నాను.

ముఖ్యంగా ఈ తెలంగాణా సమస్య ఎక్కువ శాతం కేంద్రీకృతమైనది ఆర్‌డిఎస్ గురించి, ఆర్‌డిఎస్ ద్వారా దాదాపు 87500 ఎకరాలకు నీళ్లు రావాలి కానీ రావడం లేదు. అదే విధంగా టిడిపి, టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వారు కూడా చాలా వరకు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అయినా ఈ సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమస్య తెలంగాణా రాయలసీమ ప్రజల మధ్య ఉన్న సమస్య. కాబోయే రెండు రాష్ట్రాల్లో ఈ రెండు ప్రాంతాల ప్రజల మధ్య యుద్ధ వాతావరణం లేకుండా, బేదాభిప్రాయాలు లేకుండా, ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండగా ఈ ఆర్‌డిఎస్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

అదే విధంగా దాదాపు పది నుండి పదిహేను వేల మంది సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజలు, దాదాపు 20 వేల మంది తెలంగాణాకు చెందిన ప్రజలు నా నియోజకవర్గంలో ఉన్నారు. మీరు ఎలాంటి అపోహలకు గురికాకూడదు, మీకు పూర్తి రక్షణను మా తెలంగాణాలో ఇస్తున్నామని,

అదేవిధంగా రాయలసీమలో ఉన్న వారికి కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలియజేస్తున్నాను. దాదాపు అన్ని పార్టీలు, టిడిపి, వైఎస్‌ఆర్‌సిపి, సిపిఐ అన్ని పార్టీలు ఆమోదించాయి మరి ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఇది తెలంగాణా ప్రజల యొక్క ఆకాంక్ష, అభిప్రాయం కాబట్టి దానిని గౌరవించి సహకరించాలని మనవి చేస్తున్నాను.

నేను 1969వ సంవత్సరంలో తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్నాను. తెలంగాణ ప్రజల యొక్క ఆకాంక్ష అభిప్రాయం నాకు బాగా తెలుసు. కాబట్టి దయచేసి అన్నదమ్ముల్లాగా విడిపోదాము ఆత్మీయుల్లాగా కలిసుందామని తెలియజేసుకుంటూ ఈ బిల్లును పూర్తిగా సమర్థిస్తున్నాను. మీరందరూ కూడా సహకరించి రెండు రాష్ట్రాలుగా ఏర్పడి రెండు రాష్ట్రాలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలని, దేశంలో ప్రథమ ద్వితీయ స్థానాల్లో ఉండేటట్లు మనం కృషి చేయాలి, కృషి చేసినట్లయితే తప్పకుండగా మనకు మంచి భవిష్యత్తు ఉంటుది. రాజధాని విషయంలో గానీ మరి ఏ విషయంలో అయినా గానీ మీకేవైనా ఆపోహాలు ఉన్నట్లయితే ఆర్టికల్-3 ప్రకారం మన అభిప్రాయాలను తెలియజేసినట్లయితే తప్పకుండగా కేంద్రప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని తెలియజేసుకుంటూ ఈ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవుతీసుకుంటున్నాను. జైహింద్.

MR.SPEAKER: Members can also give their speeches in writing and those speeches will form part of the proceedings.

శ్రీమతి బి.సత్యవతి (ఆముదాలవలస) : అధ్యక్షా, 2013 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా నా ఆవేదనను అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ద్వారా పంపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013ను సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్ఫూర్తికి కట్టుబడిన వ్యక్తిగా ఈ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తున్నాను. రెండు కళ్లలో ఏ కన్ను ముఖ్యమంటే సమాధానం చెప్పలేము. ఒక వైపు నేను ఎంతో అభిమానించి గౌరవించే కాంగ్రెస్ ప్రభుత్వం, మరోవైపు సమైక్యాంధ్ర రాష్ట్రాన్ని కోరుకుంటూ నన్ను గెలిపించి పవిత్రమైన శాసనసభకు పంపిన నాయొక్క ప్రజల మనోభావాలు మరోవైపు విచిత్రమైన మానసికక్షోభలో ఉన్నాము. 1956 భాషాప్రయుక్త రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు కర్నూలును రాజధానిగా కోరుకోవడం జరిగింది. కానీ హైదరాబాద్‌ను రాష్ట్ర రాజధానిగా ఎంపిక చేసినప్పుడు సీమాంధ్రులు మనస్ఫూర్తిగా అంగీకరించడం జరిగింది. మరలా సీమాంధ్రులు 1972వ సంవత్సరంలో జై ఆంధ్ర ఉద్యమాన్ని నిర్వహించినప్పుడు, ఆంధ్రాను ప్రత్యేక రాష్ట్రంగా చేయమని డిమాండ్ చేయడం జరిగింది. అప్పటి మన భారత ప్రధాని గౌరవనీయులు శ్రీమతి ఇందిరాగాంధీ గారు దేశసమగ్రతను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ సవరణను చేసి 371-డి ని చేర్చడం జరిగింది. తద్వారా భవిష్యత్తులో సైతం ఆంధ్రప్రదేశ్‌ను విభజించడానికి వీలులేని పరిస్థితిని కల్పించారు.

ఉ.9.40 KV/RSS

కనుకనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు, వివిధ పార్టీల ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ప్రపంచ దేశాలతో మన రాష్ట్ర రాజధాని ఉండాలని ఎంతో సుందరంగా వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య రంగాలలో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాదును అభివృద్ధి చేశారు. హైదరాబాదుతో ఒక ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నాం. రాజ్యాంగ సవరణ చేయకుండా, ప్రజామోదం లేకుండా ఏకపక్షంగా హైదరాబాదుతో కలిపి పది జిల్లాలను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు విడదీయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరినీ తీవ్రంగా ఆవేదనకు, మనస్తాపానికి గురిచేసింది. దీనిని ఆసరాగా తీసుకొని ఆయా పార్టీల సభ్యులు వారి నియోజకవర్గాలలో వారే పోరాడుతున్నామనే విధంగా వారి వారి మనుగడ కోసం పాకులాడుతున్నారు.

రాష్ట్ర విభజన అంశం కేవలం రాష్ట్రానికి సంబంధించినది మాత్రమే కాదు. జాతీయ స్థాయిలో విభజన పర్యవసానం చాలా తీవ్రస్థాయిలో ఉండే ప్రమాదం ఉన్నది. మన దేశ అనిశ్చితిని ఆసరాగా తీసుకొని పొరుగుదేశాల వారు విజృంభించి మన దేశ సరిహద్దులను దాటి వచ్చే ప్రమాదం కూడా ఉన్నది. మన ప్రాంతం, మన భావం మనకు అవసరమే, ఇది మన వ్యక్తిగత మనుగడకు కూడా అవసరమే. అన్నింటికన్నా ముందు మన దేశ రక్షణ, సమగ్రత అనే విషయాలను కూడా మనం ఆలోచించుకోవాలి.

రత్నగర్భగా అన్యోన్య ఆత్మీయతలతో సస్యశ్యామలంగా ఉన్న మన భారతదేశం ఏ కారణాల వల్ల స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది, మన దేశానికి మళ్లీ స్వాతంత్ర్యం రావడానికి ఎన్ని సంవత్సరాలు పట్టింది, ఎంత మంది త్యాగఫలం మనం అనుసభవిస్తున్న ఈ స్వతంత్ర్య భారతదేశం అన్నది కూడా మనం గుర్తుంచుకోవాలి. అందువల్లనే 2013 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లులో అనేక అంశాలపై స్పష్టత లేని కారణంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నే కొనసాగించాలని కోరుతూ సమైక్య ఆంధ్రప్రదేశ్‌కి కట్టుబడి ఉంటూ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను.

MR.SPEAKER: Yes, Dronam Raju Srinivas Garu.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు (విశాఖపట్నం సౌత్): అధ్యక్షా, 2013 రాష్ట్ర విభజన పునర్వ్యవస్థీకరణ బిల్లుకు సంబంధించినంతవరకు సీమాంధ్రకు చెందిన రాయలసీమ, కోస్తాంధ్రకు చెందిన మా గౌరవసభ్యులందరం రాతపూర్వకంగా మా అభిప్రాయాలను మీకు సమర్పిద్దామనుకుంటున్నాం. దాని గురించి మాకు సదవకాశం కల్పించాల్సిందిగా కోరుతున్నాను.

MR.SPEAKER: Yes, Members can please lay their speeches on the table and they will form past of the proceedings., that will go on official records. Yes, Srinivas Garu.

శ్రీ వెల్లంపల్లి శ్రీనివాసరావు (విజయవాడ వెస్ట్): అధ్యక్షా, గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ద్వారా పంపబడిన 2013 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లును గౌరవ

సభాపతి గారు సభ ముందుంచిన నేపథ్యంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తికి కట్టుబడి ఉన్న వ్యక్తిగా ఈ బిల్లును నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. మా ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగానూ, నా వ్యక్తిగతంగానూ ఈ విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. 13వ శాసనసభలో నేను సభ్యుడిగా ఉన్న సమయంలో ఇటువంటి ముసాయిదా బిల్లు రావడం చాలా బాధాకరం, దురదృష్టకరమని నేను భావిస్తున్నాను. ఈ బిల్లు రాష్ట్ర మనుగడకు అభివృద్ధికి ఆటంకం కలిగించే అంశాలున్న నేపథ్యంలో దీనిని ఎంత మాత్రం సమర్థించడం లేదు.

పొట్టి శ్రీరాములు గారు తెలుగు ప్రజలంతా కలిసుండాలని ఆయన ఆత్మబలిదానం చేసుకొని ఆంధ్రప్రదేశ్ అవతరణకు ఎంతో తోడ్పడిన వ్యక్తి. ఈ రోజు రాష్ట్ర విభజన పేరుతో తెలుగు ప్రజలను విడదీసే విధంగా ఈ బిల్లు మీద మాట్లాడవలసి రావడం చాలా దురదృష్టకరం. అదే విధంగా విజయవాడ నగరం రాష్ట్ర నడిబొడ్డులో ఉండి అభివృద్ధికి అనేక రకాల అవకాశాలున్నా కూడా ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాదు రాజధానిగా ఉండటం వల్ల మా ప్రాంత ప్రజలంతా హైదరాబాదుకొచ్చి హైదరాబాదు అభివృద్ధికి పాటుపడ్డారు. విజయవాడలో అన్ని రకాల సౌకర్యాలున్నప్పటికీ అభివృద్ధికి నోచుకోకపోవడానికి కారణం హైదరాబాదును ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఎన్నుకున్నారు కాబట్టి అభివృద్ధంతా హైదరాబాదుతో ముడిపడి ఉన్నా యి.

అదే విధంగా కాంగ్రెస్, బి.జె.పిలు జాతీయ పార్టీలు కాబట్టి వారికి ఉన్న రాష్ట్రంతోబాటు ఇంకొక రాష్ట్రం ఉన్నా ఇబ్బంది లేదనే ఉద్దేశంతో వారు రాష్ట్రాలను ప్రతిపాదిస్తుంటే మన తెలుగు ప్రజల కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీలు కూడా రాష్ట్ర విభజనకు సహకరించడం దురదృష్టకరం, బాధాకరం. అదే విధంగా మా ప్రాంత ప్రజల మనోభావాల ప్రకారం తెలుగు ప్రజలంతా కలిసుండాలనే ఒక మంచి ఉద్దేశంతో నిన్న ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా రాష్ట్ర విభజన జరిగితే రాష్ట్రానికి ముప్పు, అదే విధంగా తెలంగాణ ప్రాంతానికి కూడా చాలా ఇబ్బందులున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి గారు ఆవేదనతో చెప్పిన సందేశాన్ని కూడా మనం గమనించి వారి మార్గంలోనే రాష్ట్ర సమైక్యతకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని తెలియజేస్తున్నాను.

విజయవాడలోని ప్రతి ఒక్క విద్యార్థి చదువు పూర్తయిన తరువాత హైదరాబాదు నగరానికే వస్తారు. ఇప్పుడు హైదరాబాదు సీమాంధ్రులకు లేదంటే ఎవరూ తట్టుకోలేని పరిస్థితులలో ఉన్నారు. ఉన్నత చదువులు చదువుకోవాలన్నా ప్రతి ఒక్కరూ హైదరాబాదుకు రావలసిందే తప్ప ఇంకొక మార్గం లేదు.

గతంలో తెలంగాణ ప్రాంతం వెనుకబడిందనే ఉద్దేశంతో అప్పుడు తెలంగాణ నినాదం లేవనెత్తడం జరిగింది. అలాంటి వారే ఇప్పుడు అది మా ఆత్మ గౌరవమని చెప్పడం వారి మార్పుకు నిదర్శనం. రాష్ట్ర విభజన జరగకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కొనసాగుతూ సమైక్యాంధ్రప్రదేశ్‌కి కట్టుబడి ఉంటూ ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. ఈ ముసాయిదా బిల్లుపై నా

అభిప్రాయాలను గౌరవనీయులైన సభాపతి గారికి రాతపూర్వకంగా కూడా అందజేస్తున్నాను. వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Yes, Rama Kotaiah Garu.

శ్రీ చిన్నం రామకోటయ్య,(నూజివీడు): అధ్యక్షా, ఇప్పుడు మనం చర్చించుకునే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును మా ప్రాంత ప్రజలకు పూర్తిగా ప్రజా వ్యతిరేకమని భావిస్తున్నాను. 16, డిసెంబర్,2013న ఈ సభలో ప్రవేశపెట్టిన బిల్లులోని లక్ష్యాలు, ఆ బిల్లును పెట్టడానికి సంబంధించిన కారణాలను పొందుపర్చలేదు కానీ బిల్లుతోబాటు భారత రాష్ట్రపతి గారు పంపిన లేఖను మాత్రం జతపర్చారు. ఆ లేఖలో ఉన్న సారాంశమేమిటంటే భాగస్వాములందరితో విస్తృతంగా సంప్రదించి అన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకొని ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిపాదించిందని చెప్పారు. ఇక్కడే ఒక అర్థం కాని విషయం కనిపిస్తున్నది. భాగస్వాములంటే శాసనసభ్యులను భాగస్వాములుగా భావించలేదా, భాగస్వాములతో ఎప్పుడైనా చర్చించారా అని అడుగుతున్నాను. నాకు తెలిసి ఇప్పుడు ఈ సభలో ఈ బిల్లుపైన చర్చించడం తప్ప ఎప్పుడూ కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సంప్రదింపులు జరుపలేదు. శాసనసభ్యుల భాగస్వామ్యం లేకుండా సంప్రదింపులు జరపడం ఏ విధంగా ప్రజాస్వామ్యబద్ధం అవుతుంది?

అంతే కాకుండా ఈ బిల్లులో అనేక వివక్షలున్నాయి. దాంట్లో కేవలం రెండు, మూడు విషయాలను మచ్చుకు తెలియజేస్తాను. 1956కు ముందు ఆంధ్ర భూభాగంలో ఉన్న భద్రాచలం డివిజన్‌ను తెలంగాణ ప్రాంతానికి ఇస్తామనడం ఆంధ్ర ప్రాంతానికి అన్యాయం చేయడం కాదా అని ప్రశ్నిస్తున్నాను. ఇంకొక అంశం కొత్త రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేయాలనే దాని గురించి కమిటీని వేసి ఆ కమిటీ 45 రోజులలో నివేదికను ఇస్తుందని చెప్పారు. తెలంగాణవాదులు ఆశించినట్లుగానే ఒకవేళ ఫిబ్రవరి ఆఖరిలోగా ఈ బిల్లు పాస్ అవుతుందనుకుంటే ఆ తరువాత కమిటీ వేస్తే ఏప్రిల్ 15 వరకు నివేదిక వస్తుందని అనుకుందాం.

ఫిబ్రవరి మాసంలో ఎప్పుడైనా ఎలక్షన్ నోటిఫికేషన్ రావచ్చు. ఏప్రిల్‌లో దేశమంతా ఎన్నికల హడావిడిలో మునిగిపోతుంది. కొత్త ప్రభుత్వం మొదటి వారంలో ఏర్పడుతుంది. ఇటువవంటి పరిస్థితులలో కొత్త రాజధాని కోసం నిపుణులిచ్చిన నివేదిక మీద నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుందా, అసలు ప్రభుత్వానికి శ్రద్ధ ఉంటుందా? రాబోయే ఎన్నికలలో గెలుస్తామో, ఓడుతామో తెలియని పరిస్థితులలో ఎట్టి పరిస్థితులలో ఈ నిర్ణయం తీసుకోలేరు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొత్త రాజధానికి ప్రాధాన్యతనిస్తుందని నమ్మకమేంటి? కొత్త ప్రభుత్వం తన ఆలోచనలకు అనుగుణంగా కొత్త రాజధానిని ఏర్పాటు చేయడానికి మళ్లీ కొత్త కమిటీలు వేయరని నమ్మకమేంటి? కొత్త రాజధానికి కావలసిన నిధులు ఎవరు సమకూరుస్తారు? రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం వస్తుందని నమ్మకమేంటి? ఇన్ని అనుమానాలకు తావిస్తున్న రాజధాని గురించి సీమాంధ్ర ప్రజలను కేరాఫ్ అడ్రస్ లేకుండా ఇక్కట్లకు గురిచేసే కుట్రలో భాగంగా భావించాల్సి వస్తుంది. ఇది ఆంధ్ర

ప్రాంతానికి జరుగుతున్న అన్యాయం కాదా అని అడుగుతున్నాను. అలాగే కొత్త రాజధాని ఏర్పడేవరకు హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది సంవత్సరాలు ఉమ్మడి రాజధాని అన్నారు. మా తెలంగాణ సోదరులేమో ఒక సంవత్సరంలో కట్టుకోవచ్చని కొందరు, మూడు సంవత్సరాలు మించి ఉమ్మడి రాజధాని ఉండొద్దని మరికొందరు అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. పాఠశాలలో లక్ష రూపాయలతో నిర్మించే వంట షెడ్లను కూడా పూర్తి చేయలేకపోతున్నాం. మన ప్రభుత్వాల సామర్థ్యం ఈ విధంగా ఉంటే, ఇటువంటి పరిస్థితులలో కొత్త రాజధానిని ఏర్పాటు చేయడం సాధ్యమా అని అడుగుతున్నాను. ఇటువంటి పద్ధతులు సీమాంధ్రులను హేళన చేయడం, అవమానించడం కాదా అని ప్రశ్నిస్తున్నాను. అలాగే తెలంగాణ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం రాజ్యాంగం వారికిచ్చిన హక్కు. అలాగే సీమాంధ్రులు సమైక్య రాష్ట్రం కోరుకోవడం రాజ్యాంగం వారికిచ్చిన హక్కు.

ఉ. 9.50 mms/rss

అలాగే తెలంగాణ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకోవడం రాజ్యాంగం వారికిచ్చిన హక్కు. సీమాంధ్రులు సమైక్యాంధ్రను కోరుకోవడం కూడా రాజ్యాంగం వారికిచ్చిన హక్కు. ఈ రెండు భిన్నమైన డిమాండ్లు ఉన్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపించినప్పుడు సీమాంధ్ర ప్రజలకు నచ్చజెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి లేదా? సీమాంధ్రులకు ఏ విధమైన నష్టం జరగదనే నమ్మకం కల్పించే బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానికి లేదా? సీమాంధ్రులను తృప్తి పర్చి ప్రజానీకంలో ఉన్న భయాందోళనలను తొలగించాల్సిన బాధ్యత లేదా? పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాలు అంటే విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు రోడ్లెక్కి ఐదు మాసాలుగా ఆందోళనలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడాన్ని మేం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? మేం భారత పౌరులం కాదా అనే అనుమానం వస్తోంది. కనీస మర్యాదలు కూడా పాటించనప్పుడు మనం అసలు భారతదేశంలో భాగస్వామ్యులుగా ఎందుకు ఉండాలని మా ప్రాంత యువకులు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. ఆ విషయంలో వారికి ఏం సమాధానం చెప్పమంటారు? ఈ విభజన భవిష్యత్తులో దేశ సమగ్రతకు విఘాతం కల్గించకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. 2009వ సంవత్సరం డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రాన్ని విభజించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అప్పుడే మా అందరి ఆమరణ నిరాహారదీక్షల దృష్ట్యా, ఆందోళన దృష్ట్యా ఆ ప్రతిపాదనలను నిలిపివేశారు. అప్పటి నుంచే కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించాలనే ఉద్దేశం ఉన్నప్పుడు గత నాలుగు సంవత్సరాలుగా కొత్త రాజధానికి కావల్సిన ఏర్పాట్లను చేసి ఉండొచ్చు. సీమాంధ్ర ప్రాంతంలో విద్యాలయాలు, పరిశ్రమలు ఇతర మౌళిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చి ఉండాల్సింది. అప్పుడు అవన్నీ చేసిన తరువాత విభజన ప్రతిపాదనను తెర మీదకు తెచ్చి ఉంటే సీమాంధ్రులు ఇంత ఆందోళనకు గురై ఉండే వాళ్లు కారేమో. ఇంత అవమానానికి గురయ్యేవాళ్లు కాదేమో. అలా చేయకపోగా, రాబోయే నాలుగు మాసాల్లో సాధారణ ఎన్నికలు పెట్టుకొని రాజకీయ లబ్ధి కోసం సీమాంధ్రుల భవిష్యత్తును తాకట్టు

పెట్టి, ఈ విభజన బిల్లును ప్రతిపాదించడాన్ని కేంద్ర ప్రభుత్వ దుర్నీతిగా అందరూ భావించాల్సి వస్తుంది. ఉమ్మడి రాజధానిలో సీమంధ్రుల జీవితాలకు, హక్కులకు, స్వేచ్ఛకు, ఆస్తులకు నష్టం, భంగం కల్గించకుండా గవర్నర్ గారికి అధికారాలిస్తామని ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. ఇవాళ సీమాంధ్రుల భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఆ అనుమానాలున్నట్టుగా ముసాయిదా బిల్లులోని ప్రతిపాదనల ద్వారా స్పష్టమౌతోంది. పది సంవత్సరాలపాటు ఉమ్మడి రాజధానిలో ఉండే సీమాంధ్రులు తమ ఓటు హక్కును ఉమ్మడి రాజధానిలోనే వినియోగించుకుంటారు. తద్వారా సీమాంధ్రులు తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యేలకే ఓటు వేయాల్సి వస్తుంది. మరి ఎమ్మెల్యేలకు ఓటు వేయడమంటే ఏమిటి? తమ ప్రజాస్వామ్య హక్కులను కాపాడతారని, తమ ఆస్థులకు, ప్రాణాలకు ముప్పు రాకుండా చూస్తారని సంబంధిత శాసనసభ్యులను ఎన్నుకుంటారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభకు పంపించే ప్రజాప్రతినిధులకు ఓటు వేసి, తమ భద్రత కొరకు గవర్నర్ దగ్గరకు పొమ్మంటున్నారు. ఇదేమి విడ్డూరమో అర్థం కావడం లేదు. ఇది ఏ విధంగా ప్రజాస్వామ్యానికి అద్దం పడుతుంది? అలా కాకుండా ఉమ్మడి రాజధానిలోని శాసనసభ నియోజకవర్గాలను "ద్విసభ్య నియోజకవర్గాలుగా" ఏర్పాటు చేస్తే, ప్రజలు నమ్ముకున్న ప్రభుత్వానికి, వారి ప్రతినిధులను పంపించుకునే అవకాశం కల్గుతుంది. ద్విసభ్య నియోజకవర్గాలు గతంలో కూడా ఉండేవి. లేని పక్షంలో ఇది రంగు, రుచి, వాసన లేని ప్రజాస్వామ్యంగానే మిగిలిపోతుంది. మా నూజివీడు నియోజకవర్గం నాగార్జున సాగర్ ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ క్రింద మూడవ జోన్‌లో ఉంది. సమైక్యాంధ్రలో మా నియోజకవర్గానికి నీళ్లు రావాలంటే, ప్రతిసారి పోరాటం చేయాలి. అదే రాష్ట్రం విడిపోతే మా ప్రాంతం ఎడారి అయ్యే ప్రమాదం ఉంది.

MR.SPEAKER: Yes, Ramakotaiah Garu..... You can give it in writing.

శ్రీ చిన్నం రామకోటయ్య: అధ్యక్షా, ప్రసంగాన్ని ముగిస్తాను. సీమాంధ్ర పాలకులు తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేశారని తెలంగాణ ప్రాంత నాయకులంటున్నారు. అసలు సీమాంధ్ర ప్రాంతానికి కూడా ఏ న్యాయం చేయలేదనేదే గత యాభై ఏడు సంవత్సరాల్లో మన కళ్ల ముందున్న చరిత్ర. అలాంటప్పుడు సీమాంధ్రులు ఏ విధమైన విభజన కోరుకోవాలి? ఎవరిని బాధ్యులుగా చేయాలి? ఇంత వివక్షత, ఇన్ని ౙౙ• కూడిన ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ ముసాయిదా బిల్లును ఏ కోణంలో నేను సమర్ధించలేను. ప్రసంగించే అవకాశం కల్పించిన మీకు నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను. థ్యాంక్యూ సార్.

శ్రీమతి దిరిశం పద్మజ్యోతి(తిరువూరు): Thank you Speaker Sir for giving me this opportunity.

• Expunged as ordered by the Chair

గౌరవనీయులైన భారత రాష్ట్రపతి గారి ద్వారా పంపించినటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013ను సమైక్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్ఫూర్తికి కట్టుబడి ఉన్న వ్యక్తిగా ఈ ముసాయిదా బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. మా తిరువూరు నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగాను, నా వ్యక్తిగతంగాను రాష్ట్ర విభజన ముసాయిదా బిల్లును నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను.

అధ్యక్షా, ఈ పదమూడవ శాసనసభలో సభ్యురాలిగా వచ్చిన తరువాత ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ బిల్లుపైన మాట్లాడే అవకాశం కల్గినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. అలాగే బాలికలకు, మహిళలకు ఉపయోగపడే "బంగారు తల్లి" చట్టం పైన మాట్లాడినందుకు చాలా ఆనందంగా ఉంది గానీ ఈరోజు రాష్ట్ర విభజన ముసాయిదా బిల్లుపైన మాట్లాడటం మాత్రం చాలా బాధగా ఉంది.

అధ్యక్షా, ముఖ్యంగా మా తిరువూరు నియోజకవర్గం తెలంగాణ ఆంధ్ర బార్డర్‌లో ఉంది. అంటే ఖమ్మం జిల్లాకు పక్కన కృష్ణా జిల్లాకు చివరిగా మా నియోజకవర్గం ఉంటుంది. ఈ కారణంతో నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంతో ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికీ మా నియోజకవర్గం తాగునీటి కోసం "లంకాసాగర్" పైన ఆధారపడాల్సి వస్తోంది. "లంకాసాగర్" తెలంగాణ ప్రాంతంలోని ఖమ్మం జిల్లాలో ఉంది. మా నియోజకవర్గానికి అక్కడి నుంచే తాగునీరు వస్తుంది. రేపొద్దున రాష్ట్రం విడిపోతే, ప్రజలకు తాగు నీరు కూడా రానటువంటి పరిస్థితి నెలకొంటుంది. అలాగే సాగునీరు కూడా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి మా ప్రాంతంలోని భూములకు ప్రవహిస్తోంది. సమైక్యంగా రాష్ట్రం ఉన్నప్పుడే చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. రాష్ట్రం విడిపోతే మా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారు. మా ప్రాంతంలో మెరుగైన వైద్య సదుపాయాలు కూడా లేవు. ప్రజలకు ఏ జబ్బు వచ్చిన హైదరాబాద్‌కు గానీ, పక్కనే ఉన్న ఖమ్మం పట్టణానికి వెళ్లడం జరుగుతుంది. ఖమ్మం జిల్లా కూడా తెలంగాణ ప్రాంతంలో ఉంది. రేపొద్దున రాష్ట్రం విడిపోయినప్పుడు ఎన్నో ఆంక్షల మధ్యన మా ప్రాంత ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి, మెరుగైన వైద్యం లభించని పరిస్థితి ఎదురౌతుంది. అలాగే మా ప్రాంతంలో మంచి పాఠశాలలు, కళాశాలలు ముఖ్యంగా టెక్నికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం లేదు. మెరుగైన విద్యావకాశాల కొరకు మాప్రాంత విద్యార్థులు హైదరాబాద్ నగరానికి రావల్సివస్తుంది. పూర్తిగా ఎటుచూసినా కూడా తిరువూరు నియోజకవర్గ ప్రజలకు రాష్ట్రం విడిపోతే తీరని నష్టం, అన్యాయం జరుగుతుంది. ఈ కారణాలన్నింటితో నేను ఈ రాష్ట్ర విభజన బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఈ ముసాయిదా బిల్లులో రాష్ట్ర ప్రజల మనుగడకు, రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్గించే అంశాలు ఉన్నాయి కాబట్టి ఈ బిల్లును ఏ మాత్రం సమర్థించుకోలేనని తెలియజేస్తూ, ప్రసంగించే అవకాశం ఇచ్చిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి బోళెం ముత్యాల పాప, (నర్సీపట్నం): అధ్యక్షా, గౌరవనీయులైన భారత రాష్ట్రపతి గారి ద్వారా పంపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ 2013 చట్టానికి సంబంధించిన

ముసాయిదా బిల్లును గౌరవనీయులైన మన సభాపతి గారు సభ ముందు ఉంచిన నేపథ్యంలో సమైక్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర స్ఫూర్తికి నేను కట్టుబడిన వ్యక్తిగా ఈ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తున్నాను.

అధ్యక్షా, మా నర్సీపట్నం నియోజకవర్గ ప్రజల మనోభావాలకనుగుణంగా, నా వ్యక్తిగతంగాను రాష్ట్ర విభజన ముసాయిదా బిల్లును పూర్తిగా నేను వ్యతిరేకిస్తున్నాను. పదమూడవ శాసనసభలో సభ్యురాలిగా నేను ఉన్న సమయంలో ఇటువంటి ముసాయిదా బిల్లు చర్చకు రావడం చాలా బాధాకరం. ఈ బిల్లులో రాష్ట్ర ప్రజల మనుగడకు, రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కల్గించే అంశాలు ఉన్న నేపథ్యంలో ఈ బిల్లును నేను ఎంత మాత్రం అంగీకరించలేను.

అధ్యక్షా, మా ఉత్తరాంధ్ర జిల్లాలు కూడా వెనుకబడిన జిల్లాలే. విశాఖపట్టణం జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారం. స్వాతంత్ర్యం సిద్ధించి అరవై సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా తాగునీరు, విద్య, ఆరోగ్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనలో మా నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉంది. ఉదాహరణకు ఒక గర్భిణీ స్త్రీని ప్రసవం కొరకు ఆసుపత్రికి తీసుకువెళ్లాలంటే డోలిలో నలుగురు మోసుకొని వెళ్లాల్సివస్తుంది. అలా తీసుకువచ్చినప్పుడు ఆ గర్భిణీ స్త్రీకి సరైన వైద్యం సకాలంలో అందకపోవడం వల్ల గర్భిణీ గానీ, శిశువు గానీ మరణించిన సంఘటనలున్నాయి.

అధ్యక్షా, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ఇప్పుడిప్పుడే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఆశతో ప్రజానీకం ఉన్న ఈ సమయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని విడదీసి ఇంకా మా ప్రాంతాన్ని వెనక్కు తీసుకు వెళ్లొద్దని మీ ద్వారా సభలో ఉన్న సభ్యులందరినీ చేతులెత్తి నమస్కరిస్తున్నాను. మా ప్రాంత అభివృద్ధి అంతా హైదరాబాద్‌తో ముడిపడి ఉంది. రాష్ట్ర విభజన జరిగినట్లైతే మా ప్రాంత ప్రజలు వారి పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొరకు చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందనే ఆందోళనలో ఉన్నారు.

అధ్యక్షా, నన్ను ఎన్నుకున్న నా నియోజక వర్గ ప్రజల అభిప్రాయం మేరకు, ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్నే కొనసాగించాలని కోరుతూ సమైక్యాంధ్రప్రదేశ్‌కు కట్టుబడి ఉంటూ ఈ ముసాయిదా బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తూ, ఈ అవకాశం కల్పించిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ నేను శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చిరుమర్తి లింగయ్య (నక్రేకల్): అధ్యక్షా, ముసాయిదా బిల్లుపైన మాట్లాడే అవకాశం కల్పించిన మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు 2013 పదమూడవ శాసనసభ ద్వారా చర్చకు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ముసాయిదా బిల్లుకు సంపూర్ణమైన మద్ధతును తెలియజేస్తున్నాను. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి ఇప్పటికి అరవై ఆరు సంవత్సరాలు గడిచింది. అందులో సుమారు 42 సంవత్సరాలు ఆంధ్ర

ప్రదేశ్ రాష్ట్రాన్ని సీమాంధ్ర ప్రాంత నాయకులే పాలించారు. అతి కొద్ది కాలం తెలంగాణ ప్రాంతానికి చెందిన నాయకులకు రాష్ట్రాన్ని పాలించే అవకాశం దక్కింది. అతి కొద్ది కాలం మాత్రమే తెలంగాణ ప్రాంత నాయకులకు రాష్ట్రాన్ని పాలించే అవకాశం దక్కింది. పెద్ద మనుషుల ఒప్పందం మేరకు ముఖ్యమంత్రి పదవిని రెండు ప్రాంతాలకు ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ నామమాత్రంగానే ఆ నిబంధన మిగిలిపోయింది. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులే ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి పదవులు పొందిన ఉదంతాలున్నాయి. ఆ విషయాల్లోకి నేను పోదలచుకోలేదు.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రస్తుతం సీమాంధ్ర ప్రాంతానికే ఎక్కువ నిధులనిస్తూ, తెలంగాణ ప్రాంతాన్ని వివక్షతకు గురిచేయడం జరుగుతోంది. మా నల్లగొండ జిల్లాలో నేను ఒక దళిత శాసనసభ్యుడిగా ఈ సభలో అడుగుపెట్టడం జరిగింది.

ఉ.10.00 KU / KKR.

అధ్యక్షా, గడచిన 45సంవత్సరాల తరువాత ఒక దళితునిగా చిన్న వయస్సులో శాసనసభ్యునిగా పనిచేసేందుకు మా నియోజకవర్గ ప్రజలు నాకు ఈనాడు అవకాశం కల్పించారు. నా నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని అనుకున్నప్పటికీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నాను. ఎందువలన అంటే మా పట్ల వివక్షతతోనూ, మా జిల్లాలో ఉన్న ఫ్లోరైడ్ జలాల వలన అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నాం. 2003వ సంవత్సరంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డిగారు నిరాహార దీక్ష ఫలితంగా కొంతమేరకు సదుపాయాల్ని కల్పించుకోగలిగాం. ఇప్పటికీ ఫ్లోరైడ్ వాటర్ సమస్యతో మా జిల్లా ప్రజలు సతమతమవుతున్న విషయం తమరికి తెలుసు అధ్యక్షా. మా జిల్లానుండి ఎన్నిక అయిన పెద్దలు, శ్రీ కె.జానారెడ్డి గారు మంత్రిగా ఉన్నందున, తమరు కూడా మా నల్గొండ జిల్లా పర్యటనలు చేపట్టిన సందర్భంలో అక్కడ ఉన్న జిల్లా అధికారులతో జిల్లా సమస్యలుపై సమీక్షలు చేపట్టిన దరిమిలా కొంతవరకు మెరుగైన సదుపాయాలు సాధించుకోగలిగాము అధ్యక్షా. మేము ఫ్లోరైడ్ వాటర్ సమస్యతో సతమతమవుతుంటే నిధుల కేటాయింపు విషయంలో వివక్ష చూపడం చాలా అన్యాయం. గత 60 సంవత్సరాలుగా అణిగిమనిగి ఉంటున్నాం. జరుగుతున్న అన్యాయాలపై అనేక ఉద్యమాలు వచ్చాయి. అయినప్పటికీ రాజకీయపరంగా నేటికి కూడా వివక్షకు గురి అవుతున్నాం.

అధ్యక్షా, ఈరోజు ఎస్.సి. శాసనసభ్యునిగా తెలియజేస్తున్నాను సభలో గానీ, నిధుల విడుదల విషయంలో గానీ మా పట్ల పూర్తి వివక్ష జరుగుతుంది. మా ప్రాంతంలో దాదాపు ఆరు, ఏడు మండలాల పరిధికి సంబంధించిన ఏరియా ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా మార్చే విషయమై అవసరమైన నిధుల మంజూరు విషయంలో కూడా వివక్ష జరుగుతోంది అధ్యక్షా.

(బెల్ )

మిస్టర్‌స్పీకర్ : బిల్లుపైన మాట్లాడండి.

శ్రీ చిరుమర్తి లింగయ్య : ఈ విధంగా కుట్రపూరితంగా వివక్ష జరిగింది కాబట్టి ఈ తెలంగాణా ముసాయిదా బిల్లుకు పూర్తిస్థాయిలో మేము మద్దతు తెలుపుతున్నాం. అనేకమంది విద్యార్థులు, ఉద్యోగులు, పోరాట ఫలితంగా ఆ మహానాయకురాలు నిర్ణయం తీసుకున్నందుకు శ్రీమతి సోనియాగాంధీ గారికి, రాహుల్‌గాంధీ గారికి మరియు రాష్ట్రపతి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. జై, జై కాంగ్రెస్.

MR.SPEAKER : Yes, Sridhar garu..

శ్రీ కొండేటి శ్రీధర్ (వర్ధన్నపేట) : అధ్యక్షా, 13వ శాసన సభకు గౌరవ రాష్ట్రపతిగారు పంపిన తెలంగాణా ముసాయిదా బిల్లు ద్వారా 60సంవత్సరాలుగా ఉన్న మా కలను సాకారం చేస్తున్న ఈ బిల్లుకు నా పూర్తి మద్దతును తెలుపుతున్నాను. తెలంగాణా ముసాయిదా బిల్లుపై జరుగుతున్న చర్చలో పాల్గొనే అవకాశం కల్పించిన నా వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ నాడు చిన్న రాష్ట్రాలతోనే బడుగులకు రాజ్యాధికారం దక్కుతుందని అంబేద్కర్ గారి నమ్మకం. అనుకోకుండా మన అసెంబ్లీ ప్రాంగణంలో మహానేత అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు జరిగిన సందర్భంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లుపై చర్చ జరగడం విశేషం. 1969వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు ప్రాణాలు అర్పించిన తెలంగాణా విద్యార్థి అమర వీరులకు తెలంగాణ ఉద్యమాభినందనలు. ఆ అమరవీరులకు ఆత్మశాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. అమరవీరుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

సమైక్యరాష్ట్రంలో నీరు, నిధులు, ఉద్యోగాలు ఞఞ* జరిగాయి. ఈ విధంగా ఞఞ గురి అవుతూ 60సంవత్సరాలుగా జరిపిన మా పోరాటాన్ని మన్నించి, ప్రజల ఆకాంక్షను గుర్తించి మా అధినేత్రి శ్రీమతి సోనియాగాంధీ గారు మేము కోరుకున్న తెలంగాణ ఇవ్వడానికి అంగీకరించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయాలని తీర్మానం చేసింది. మంత్రుల కమిటీ అందుకు ఆమోదం తెలిపింది. యూపీఏ ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలను కూడా సోనియాగాంధీ గారు ఒప్పించారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు మన 13వ శాసన సభకు వచ్చింది. 60సంవత్సరాల పోరాటం, ఎందరో త్యాగాల ఫలితం, 4.5 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఈ బిల్లు. ఈ బిల్లు నాకు దైవంతో సమానం. సంపూర్ణంగా ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నాను.

(బెల్)

---

* Expunged as ordered by the Chair

హైదరాబాదు రాజధానిగా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాల్సిందగా మీ ద్వారా కోరుతున్నాను. నన్ను గెలిపించిన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు కోరుకున్నంతగా నేను అభివృద్ధిపరచలేకపోయానని బాధపడుతున్నాను. వర్ధన్నపేట మండల కేంద్రంలో....

(బెల్)

మేము కొత్త ఎంఎల్ఏలుగా గత నాలుగున్నర సంవత్సరాల క్రితమే ఎన్నికైనా మాట్లాడే అవకాశం మాకు ఇప్పుడే వచ్చింది. కాబట్టి మరో రెండు నిమిషాలపాటు మాట్లాడేందుకు అవకాశం కల్పించండి అధ్యక్షా. గడచిన నాలుగు సంవత్సరాల కాలంగా మండల కేంద్రమైన వర్ధన్నపేటలో ఒక డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేయాల్సిందిగా కోరుతున్నాను. పర్వతగిరిలో ఒక ఐ.టీ.ఐ కళాశాల, హసన్‌పర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, మరియు మామ్నూ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ ఏర్పాటుచేయాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా శాసనసభ్యులు మా దయాకర్ రావు గారు ఆనాడు మా మండలం కట్యాలలో ఫ్లోరైడ్ రహితంగా మార్చేందుకు పూనుకొని ప్రారంభించిన పనులు నేటికీ పూర్తికాలేదు. అదే విధంగా నా నియోజకవర్గంలో నూతనంగా విలీనం అయిన గ్రామాలులో తాగునీరు, డ్రైనేజ్, రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకుగాను నేను అనుకున్న మేరకు పనుల చేయలేకపోయాను.

నా నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష నెరవేరలేకపోతున్నందుకు బాధపడుతున్నాను. అభివృద్ధి కంటే ప్రత్యేక తెలంగాణా సాధనే ముఖ్యమని నేను కోరుకుంటున్నాను. నేను నా ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేస్తున్నాను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తరువాత నా నియోజకవర్గం అభివృద్ధికి మనసా, వాచా, కర్మణా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు పోరాడుతాను. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చి ప్రజల ఆకాంక్షను వారికి తెలియజేస్తాను. ఆ పోరాటానికి ఫలితం దక్కుతుందని అనుకుంటున్నాను. 60సంవత్సరాల పోరాటం సఫలీకృతం అవుతున్న ఈ కీలక సందర్భంలో శాసనసభలో సభ్యునిగా ఉన్నందుకు, తెలంగాణా బిల్లుపై చర్చలో పాల్గొన్నందుకు నా జన్మ ధన్యం అయింది అధ్యక్షా. రానున్న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజల కోసం నిరంతరం పోరాడుతాను. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుచేస్తున్నందుకు మరోసారి శ్రీమతి సోనియా గాంధీ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా నియోజక వర్గ ప్రజల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని మీద్వారా విన్నవించుకుంటున్నాను.

(బెల్)

MR.SPEAKER: Yes please give it in writing.

శ్రీ కొండేటి శ్రీధర్ : నా నియోజకవర్గం ప్రక్క గ్రామం విద్యార్థులు రాజు, కరుణాకర్, శ్రీకాంత్, భరద్వాజ్‌తోబాటు మా తెలంగాణా జిల్లాలలో 1200మంది విద్యార్థులు చనిపోవడం జరిగింది. నా నియోజకవర్గంలో ప్రజలకు చాలా అభివృద్ధిచేయాలని అనుకున్నాను. కొంతమంది సీమాంధ్ర నాయకులు...

(బెల్)

(ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

MR.SPEAKER : Please give it in writing. రికార్డ్స్‌లోకి వెళుతుంది.

శ్రీ కొందేటి శ్రీధర్ ః 125 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో అటు ఉన్నవాళ్లు ఇటు వచ్చి, ఇటు ఉన్న వాళ్లు అటు వెళ్లారు. ఈ పార్టీలో ఉన్నత స్థాయికి ఎదిగి ఇదే పార్టీని నిందించడం చాలా దురదృష్టకరం. జాతిపిత మహాత్మాగాంధీ గారి నుండి మొదలుపెడితే శ్రీమతి ఇందిరా గాంధీ గారు కానీ, రాజీవ్ గాంధీ గారు గానీ, ఇప్పుడున్న శ్రీమతి సోనియా గాంధీ గారు కానీ ప్రత్యేకంగా ఎన్నో చట్టాలు తెచ్చి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కొరకు కృషి చేస్తుంటే శ్రీమతి సోనియాగాంధీ గారిని ఇటలీ రాణి అంటున్నారు సార్. మేము ఆమెను మా తెలంగాణా తల్లిగా భావిస్తున్నాం.

MR.SPEAKER : Please leave it at that. Please sit down.

ఉ. 10.10 ni/ku

మిస్టర్ స్పీకర్ః మీరు మీ స్పీచ్‌ను రైటింగ్‌లో ఉన్న దానిని ఇక్కడకు పంపించండి. It will go on record.

శ్రీ కె. శ్రీధర్ః సోనియాగాంధీగారిని ఇటలీ రాణి అని అంటున్నారు. స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు యువతకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పార్టీని బలోపేతం చేయాలని చూస్తే పది, పదిహేను సంవత్సరాలు కూడా కాకముందే ఆయనను వెన్నుపోటు పొడిచి ప్రక్కకు తప్పించారు. ఈ రోజు వారి కుటుంబాన్ని నందమూరి వంశాన్ని గురించి ఎవరైనా మాట్లాడుతున్నారా? స్వర్గీయ ఇందిరాగాంధీగారి కోడలు, స్వర్గీయ రాజీవ్ గాంధీగారి ఆశయాలను ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేస్తుంటే సోనియాగాంధీగారిని ఈ రోజు ఇటలీ రాణి అని అంటున్నారు.

©©శ్రీ పి. రాములు (అచ్చంపేట)ః అధ్యక్షా, 13వ శాసనసభలో నేను సభ్యునిగా ఉన్నటువంటి ఈ సమయంలో తెలంగాణా బిల్లుపై మాట్లాడడం చాలా సంతోషంగా ఉంది. అదే విధంగా నన్ను శాసనసభ్యునిగా ఎన్నుకున్న అచ్చంపేట నియోజక వర్గం నల్లమల ప్రాంతంగా పిలువబడే ప్రజలు కూడా నేను ఈ రోజు సభలో తెలంగాణా గురించి మాట్లాడడం ఎంతో సంతోషమైన రోజుగా భావిస్తున్నారు.

©© An asterisk before the name indicates confirmation by the Member

ఈ రోజు గౌరవ రాష్ట్రపతిగారు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు –2013ని శాసనసభకు పంపిన సందర్భంగా నేను ఈ బిల్లును స్వాగతిస్తున్నాను, మనస్ఫూర్తిగా ఆమోదిస్తున్నాను. ఎలాంటి హింస లేకుండా నిర్విరామంగా ఆరు దశాబ్దాల పాటు ఉద్యమాన్ని కొనసాగించి ఎన్నో అవాంతరాలు, అడ్డంకులను అధిగమించి నేడు శాసనసభలో ఈ బిల్లు రావడమనేది తెలంగాణా విజయంగా భావిస్తున్నాను. తెలంగాణా అమరవీరులకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాము. నాలుగున్నర కోట్ల తెలంగాణా ప్రజలు దశాబ్దాల పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం మేధావులు, కళాకారులు, విద్యార్థులు, న్యాయవాదులు, ఉద్యోగసంఘాలు, దళిత ఉద్యమకారుల మొదలైన వారి కృషి ఫలితంగా తెలంగాణా బిల్లు అసెంబ్లీకి వచ్చిందని తెలియచేస్తున్నాను. ఈ విజయంలో తెలంగాణా ప్రజలందరూ భాగస్వాములే. ఎన్నో అవాంతరాలను అధిగమించి అసెంబ్లీకి వచ్చిన రాష్ట్ర విభజన బిల్లు పార్లమెంట్‌కు వెళ్లే వరకు అందరూ విశాల దృక్పథంతో, పెద్ద మనసు చేసుకొని సహకరించాలని నేను కోరుతున్నాను.

తెలంగాణా ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి తెలంగాణా ప్రజలు చూపిన నిబ్బరం ఎంతో ప్రశంసనీయం . ఈ సుధీర్ఘ పోరాట క్రమంలో తెలంగాణా వాదులు అనుసరించిన సామరస్య వైఖరి, సామరస్య సంబంధాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని అనడంలో అనుమానం లేదు. భూమి కోసం, భుక్తి కోసం నిరంతర పోరాటం చేసిన ఘన చరిత్ర తెలంగాణా ప్రజలది. తెలంగాణా కోసం 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలకు పాల్పడ్డారు. ప్రపంచంలో ఎక్కడ పోరాటం జరిగినా అక్కడి ప్రజలు శక్తి వంచన లేకుండా పోరాటం చేసి నేలకొరిగారు తప్ప ఎవరూ నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలు చేసుకున్న చరిత్ర ఎక్కడా కనపడదు. ఒక్క తెలంగాణాలోనే యువతీ యువకులు అన్యాయానికి ఎదురు నిలిచి పోరాడి ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలియ చేస్తున్నాను. అందుకే ప్రపంచంలో తెలంగాణా ప్రాంతానికి చెందిన పోరాటానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణా పోరాట ం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. నా నియోజక వర్గంలో కూడా ఐదుగురు యువకులు ఆత్మబలిదానం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను. ప్రపంచములో నియంతల అన్యాయాలను ఎదుర్కోవడానికి ప్రజా ఉద్యమాలు జరుగుతుంటాయి. అందుకే ప్రత్యేక తెలంగాణా ఏర్పాటైతేనే న్యాయము జరుగుతుందని తెలంగాణా ప్రజలు పోరాటము చేస్తున్నారు. (ఈ దశలో మైక్ కట్ చేయబడింది. )

అధ్యక్షా, మీ గురించి కూడా చెప్పాలి. చెంచు తండాలను స్వయంగా సందర్శించిన మొదటి స్పీకర్‌గా ఘనత మీకే దక్కింది. దయచేసి రెండు మూడు నిమిషాలు సమయం ఇవ్వండి అధ్యక్షా. స్పీకర్‌గారు మా నియోజక వర్గానికి వచ్చారు. మా నియోజక వర్గంలో నల్లమల చెంచుతండాలలో రాతి యుగంలో ఉన్న పరిస్థితులు ఉన్నాయంటే దానికి కారణం పాలకులే అధ్యక్షా. మా మహబూబ్‌నగర్ జిల్లా లేబర్ జిల్లాగా, పాలమూరు జిల్లాగా ప్రపంచంలోనే పేరెన్నికగన్నది. స్వాతంత్ర్యం వచ్చి 66 సంవత్సరాలు అయిన తరువాత ఇంకా వెనుకబడిన ప్రాంతాలున్నాయంటే మనందరం ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడితేనే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రజలందరూ తలంపుతో ఉన్నారు. మా జిల్లా

కృష్ణమ్మకు స్వాగతం పలికే మొదటి జిల్లా. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలకు నీరు అందించే జిల్లా. అయినప్పటికీ మేము మిగులు జలాల పైనే ఆధారపడి ఉన్నాము. మా జిల్లాలో కల్వకుర్తి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా మొదలైన ప్రాజెక్టు ఉన్నాయి. మేము మిగులు జలాలపై ఆధారపడి లిఫ్ట్ ఏర్పాటు చేసుకున్నాము. వాటికి కరెంటు ఎక్కడి నుండి వస్తుంది? శ్రీశైలం ప్రాజెక్టు నుండి ఉత్పత్తి అయ్యే కరెంటుపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధారపడి ఉన్నాయి. భవిష్యత్తులో ఆ లిఫ్ట్‌కు కావలసిన కరెంటు కేటాయింపులు సక్రమంగా జరిగేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి 56 గ్రామాలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. అటువంటి నిర్వాసితులకు కావలసిన సౌకర్యాలు, అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం విఫలం అయింది. దానికి కారణం తెలంగాణా రాష్ట్రం ఒకటే పరిష్కారమని మా జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

ఇప్పటికీ కొన్ని నియోజక వర్గాలలో చాలా అన్యాయం జరుగుతోంది. కొన్ని నియోజక వర్గాలలో నిధుల కేటాయింపులో అన్యాయం జరుగుతున్న చోట సరిచేయవలసిన అవసరం ఉంది. అంతేకాక పాలమూరు జిల్లాను వలసల జిల్లాగా పేరొందింది. భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్క ప్రాజెక్టుకు మా శ్రమ, మా రక్తం, మా కృషి ఉన్న సంగతి తెలుసుకోవాలి. అటువంటి జిల్లా మీద ఎందుకు వివక్ష చూపిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇన్ని రోజులూ అందరం కలిసి ఉన్నాము. అన్నదమ్ములుగా విడిపోయి తెలుగు ప్రజలుగా కలిసి ఉంటే నష్టం లేదు. రాజకీయ పార్టీలు అన్నీ కూడా తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తున్నాయి. వారంతా తెలుగు దేశం పార్టీని ఎందుకు టార్గెట్ చేస్తున్నాయి? తెలంగాణాలో జరిగిన సకల జనుల సమ్మె ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. మా నాయకుడు తెలంగాణాకు అనుకూలంగా లేఖ ఇచ్చిన సంగతి సత్యం కాదా?

ఉ. 10.20 కె.ఆర్.ఆర్./వై.ఎం.ఆర్.

తెలంగాణ ప్రజలందరూ దీనిని అర్థం చేసుకోవాలని నేను మనవి చేస్తున్నాను. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రాంతాలను సమానంగా చూసేవారు రెండు ప్రాంతాలకు సమన్యాయం చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా ఆయనపై ఉంది. అందుకే తెలుగుదేశం పార్టీ తెలంగాణకు వ్యతిరేకం కాదని మీ ద్వారా ప్రజలకు తెలియజేస్తు న్నాను. బడుగు, బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పుట్టింది. నాలాంటి వారు.. అయ్యా శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి గారూ... మీరు తెలంగాణకు ద్రోహా? లేక తెలంగాణకు అనుకులమా అని ఒక్క సారి అర్థం చేసుకోవాలని నేను మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: రాములు గారూ, do not use such words, those words will be expunged.

శ్రీ పి. రాములు: నేను ఈ శాసనసభలో సభ్యునిగా ఉన్నానంటే అది తెలుగుదేశం పార్టీ పెట్టిన భిక్ష. మా నాయకుడు నాకు ఈ అవకాశం ఇచ్చారని చెబుతున్నాను. నేను ఒక పసువుల

కాపరిగా ఉండి, విద్యను అభ్యసించి, ఈనాడు ఒక శాసనసభలో నేను సభ్యునిగా ఉన్నానూ అంటే తెలుగుదేశం పార్టీ నాకు ఇచ్చిన గౌరవం అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. తెలుగుదేశం పార్టీ బలహీన వర్గాలకు, పేదలకు, బి.సి.లకు న్యాయం కల్పించింది. ఆనాడు శ్రీ నందమూరి తారకరామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాతనే ఈ రాష్ట్రంలోని పేదలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

MR.SPEAKER: Please sit down. You can give your speech in writing.

(కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

I have already expunged those words. కూర్చోండి. చీఫ్ విప్ గారూ మాట్లాడండి. రాములుగారూ కూర్చోండి. దయచేసి కూర్చోండి.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డిః అధ్యక్షా, గౌరవనీయులు రాములుగారు అంటే నాకు చాలా గౌరవం. వారు మాట్లాడిన మాటల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అని అంటే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఇప్పుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు లేరని, ఆయన ప్రతిపక్ష నాయకుడు అనే విషయం చెప్పాను. అదే విధంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాకు అన్యాయం జరిగింది అనే మాటకు నేను చెప్పాల్సి వస్తుంది.. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నారు. వారు దత్తత తీసుకున్న జిల్లాల పరిస్థితి ఆ రకంగా ఉందని వారు చెబుతున్నప్పుడు, నేను ఒక పోజిటివ్ యాంగిల్‌లో చెబుతుంటే, వారు నెగిటివ్‌గా అర్థం చేసుకోవడం దురదృష్టకరం. నేను వారి స్పీచ్‌కు అంతరాయం కలిగించాలని కాదు, వారు ముఖ్యమంత్రి అన్న దానిని సరిచేసుకోమని చెప్పడానికి లేచాను. ఇప్పుడు ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి గారు అని చెబుతున్నాను.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి. రాములు గారు రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడతాను అని మైకు ఇవ్వమని కోరారు)

MR. SPEAKER: I have already advised the members. When a member wants to speak longer time, he has to take time from his party. ప్రస్తుతం బిల్లు గురించి ఎవరైతే క్లుప్తంగా మాట్లాడాలని అనుకొంటున్నారో వాళ్లకి అవకాశం ఇస్తున్నాము. సుదర్ఘీ మైన ప్రసంగాలు మీరు చేయాలనుకొంటే దయచేసి మీ పార్టీతో సంప్రదించుకుని వాళ్లదగ్గర నుంచి మీరు సమయం తీసుకోండి. సుచరిత గారూ మాట్లాడండి.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి. రాములు గారు రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడతాను అని మైకు ఇవ్వమని కోరారు)

మిస్టర్ స్పీకర్ః రాములు గారూ దయచేసి పూర్తి చేయండి.

శ్రీ పి. రాములుః సార్, మీ మాటను ఎప్పుడైనా కాదంటానా? చీఫ్ విప్ గారు శ్రీ గండ్ర వెంకటరమణ రెడ్డి మీద నాకు ఏ ఉద్దేశం లేదు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నాకు అవ కాశం ఇచ్చారని చెప్పాను తప్ప ఇంకొకటి కాదు అని చెప్పాను.

మిస్టర్ స్పీకర్ః రాములు గారూ దయచేసి పూర్తి చేయండి.

శ్రీ పి. రాములుః ఈ దేశ గౌరవ అధ్యక్షులు పంపినటువంటి ఈ బిల్లును మనస్ఫూర్తిగా నేను బలపరుస్తున్నాను. అందరం కూడా ఈ నెల 30వ తేదీ లోపల ఈ బిల్లును కేంద్రానికి పంపి, ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి, ఈ బిల్లును పాస్ చేసి తెలంగాణ ప్రజలకు న్యాయం చేయాలని మనవి చేసుకుంటూ, మీరు నాకు ఇచ్చిన ఈ అవకాశానికి మీకు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజే స్తున్నాను. నమస్కారం.

మిస్టర్ స్పీకర్ః సుచరిత గారూ మాట్లాడండి.

శ్రీమతి ఎం. సుచరిత, (ప్రత్తిపాడు)ః అధ్యక్షా, గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు అసెంబ్లీ నియో జక వర్గ, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యురాలిని అయిన నేను గౌరవ రాష్ట్రపతిగారిచే పంపబ డిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక అంశంగా ప్రకటించిన రాజ్యాంగ సంప్రదాయాలు, పద్ధతులకు భిన్నంగా సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా మొదలైన ఈ ప్రక్రియను నేను వ్యతిరేకిస్తున్నాను. సీమాంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలకు విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం చాలా అన్యాయమైనదిగా నేను భావిస్తు న్నాను. వాస్తవ ప్రాతిపదకపై చూస్తే, ఈ నిర్ణయం వల్ల విభజనకు గురయ్యే సీమాంధ్ర ప్రాంతం తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, ఇరు ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. రాష్ట్రాన్ని విభజించడం కోసం కేంద్రప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ద్వారా ప్రక్రియను ప్రారంభించడానికి ముందుగా ఏదైనా కమీషన్ లేదా కమిటీని నియమించి, దాని నివేదిక ప్రాతికప దిపైన గానీ, లేదా సంబంధిత అసెంబ్లీ నుండి విభజన కోరుతూ తీర్మానం చేస్తే దాని ప్రాతిపదికపైన గానీ, తదుపరి చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించి ఏర్పాటైన ఏకైక కమీషన్ శ్రీకృష్ణ కమిటి. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌ను సమై క్యంగా ఉంచడమే అన్ని మార్గాలకు ఉత్తమమైనదిగా పేర్కొంటూ 461 పేజీల నివేదికను కేంద్రానికి సమర్పించడం జరిగింది. శ్రీకృష్ణ కమిటి నివేదికలోని కొన్ని భాగాలను యధాతథంగా మీ ముందు ఉంచుతున్నాను. విచారణ అనంతరం తేటతెల్లమైన విషయం ఏమిటి అంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న కోరిక ఎంత బలంగా ఉందో, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలన్న వాదన కూడా అంతే బలంగా వినిపిస్తోంది. అలాగే రాయలసీమ ప్రాంతంతోపాటు రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలంటూ, ఆయా ప్రాంతాలకు చెందిన వివిధ వర్గాల వారు చేస్తున్న డిమాండ్లు కూడా ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ

మార్గాలుగా పరిగణించ వచ్చు. కాబట్టి ఈ డిమాండ్లు కూడా పరిశీలనాత్మకమైనవే. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలన్న వాదన వైపే శ్రీకృష్ణ కమిటీ మొగ్గు చూపుతుంది. మరి కేంద్రం కనీసం ఈ శ్రీకృష్ణ కమిటీ సిఫార్సులను ఖాతరు చేయకుండా ఏకపక్షంగా విభజన నిర్ణయాన్ని తీసుకోవడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. అదే విధంగా భారతదేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లూ ఉన్నాయి. అదే విధంగా తీర్మానాలు కూడా చేసి ఉన్నాయి. అయినా వాటిని పరిగణలోకి తీసుకోకుండా కేవలం ఓట్లు, సీట్లు ప్రాతిపదికన చేస్తున్న ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఈ విభజన బిల్లు వలన సీమాంధ్ర ప్రాంతంలో యువత ఉపాధి అవకాశాల్ని కోల్పోవడం జరుగుతుంది. అదేవిధంగా నికర జలాలను కూడా కోల్పోవలసి ఉంటుంది. ఆర్థిక ప్రగతి ఆగిపోతుంది. రెండు రాష్ట్రాల్లో అనుపాతంగా పొందవలసిన ఆదాయాలు కూడా కోల్పోవడం జరుగుతుంది. అదే విధంగా సామాజిక, ఆర్థిక, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలన్నిటినీ కోల్పోవలసి ఉంటుంది. కావున ఈ బిల్లును నేను వ్యక్తిగతంగా, మా పార్టీ తరపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. సమైక్య తీర్మానం చేయాలని, అదే విధంగా ఓటింగ్ పెట్టాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తూ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్ః జోగి రామన్న గారూ మాట్లాడండి.

ఉ.10.30 KRR-GRV

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

శ్రీ జోగు రామన్న, (అదిలాబాద్)ః అధ్యక్షా, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, గౌరవ రాష్ట్రపతి గారి ద్వారా వచ్చినటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును సంపూర్ణంగా సమర్థిస్తున్నాను. నాకు ఈ అవకాశం కల్పించిన ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలకూ, తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం కొరకు పోరాటం చేసిన మా పార్టీ అధ్యక్షులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రం కావాలని అదే వారి జీవితాశయమంటూ ప్రజల్లో చైతన్యం కలుగ చేసిన ప్రొఫెసర్ శ్రీ జయశంకర్ గారికి జోహార్లు అర్పిస్తున్నాను. ఎందరో అమర వీరుల త్యాగాలు, 1100 మంది విద్యార్థుల బలిదానాలతో, నాలుగున్నర కోట్ల మంది ప్రజల కన్నీళ్ళతో కూడిన ఈ బిల్లు పై సభలో చర్చించేందుకు నాకు అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం వస్తే నష్టం వస్తుందని అనేక మంది అనేక రకాలుగా మాట్లాడుతున్నారు. వారందరికీ నేనొక్కటే చెప్పదలచుకున్నాను. తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు, తెలంగాణను అణచివేశారు కాబట్టే, నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజలు ఈ రోజు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకుంటున్నారు.

అధ్యక్షా, మీముందుకు కొన్ని అంశాలను తీసుకువస్తాను. ఆదిలాబాద్ జిల్లాలో అనేక మంది గిరిజనులు, ముస్లిం మైనారిటీలు ఉన్నారు. అనేక మంది సీమాంధ్ర పాలకులు, ఆదిలాబాద్ జిల్లాను

గిరిజనుల జిల్లా అని అనేక సార్లు మాట్లాడడం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు ప్రతీ సంవత్సరం మలేరియా, డయేరియా వంటి వ్యాధులతో, అనేక ఇతర సమస్యలతో, త్రాగడానికి కనీసం వాగునీరు, బోర్ల నీరు లేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వైద్య సదుపాయాలు అందించేందుకు 2005 వ సంవత్సరంలో శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు రిమ్స్ హాస్పటల్‌ను మంజూరు చేసినప్పటికీ, నేటికీ వైద్యులు గానీ, సిబ్బంది గానీ లేరు. కడపలోని రిమ్స్ హాస్పిటల్ వైష్ణవాలయంగా ఉంటే, మా ఆదిలాబాద్ జిల్లాలో శివాలయంగా మారింది. విద్యాపరంగా 52 మండలాలకు గాను, కేవలం 11 డిగ్రీ కళాశాలలే ఉన్నాయి. డైట్ కాలేజీలో రెగ్యులర్ లెక్చరర్స్ లేక, విద్యా విధానం అధ్వాన్నంగా ఉండడంతో, తెలంగాణ ప్రజలు, తెలంగాణ విద్యార్థులు కూడా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలంటూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం జరిగింది.

గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బోరు బావుల విషయం ప్రస్తావించారు. సీమాంధ్రలో రైతులకు కెనాల్స్ ద్వారా సాగునీరు అందుతుంటే, తెలంగాణలో రైతులు వారి స్వంత డబ్బులు ఖర్చుపెట్టుకొని బోరు బావులు త్రవ్వుకున్నారు. రైతులు స్వంతంగా త్రవ్వుకున్న బోరు బావులను వారి అభివృద్ధిగా మాట్లాడడం హాస్యాస్పదం. 2000వ సంవత్సరం నుండి చూసినట్లైతే, సుమారు 2000 పైచిలుకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. తెలంగాణ రైతులు బ్యాంకు అప్పులు తీసుకుని, బోరు బావులు త్రవ్వుకుని, ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, వలసలు పోతున్నారు. సీమాంధ్రలో ఇలాంటి పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితిలోనే తెలంగాణ రైతులు, ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పి....

మిస్టర్ స్పీకర్: బిల్లుపైన మాత్రమే మాట్లాడండి. Let us not deviate. This opportunity to the Members is to speak only on the Bill. మీరు బిల్లుపైన మాట్లాడి, మరేమైనా స్పీచ్ ఉంటే సమర్పించండి.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, రెండు నిముషాల్లో ముగిస్తాను. మా నియోజక వర్గంలోని లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు, అంతరాష్ట్ర ప్రాజెక్టు. ఈ విషయంలో సీమాంధ్ర పాలకులు ఇంత వరకు మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడలేదు. కాబట్టి ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు నామరూపాలు లేకుండా పోయింది. ఆదిలాబాద్ జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీ, స్పిన్నింగ్ మిల్లులు నడపలేక అమ్మేయడం వల్ల, మా ప్రజలు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. ఈ విధంగా మా నోట్లో మట్టి కొట్టడం వల్లనే మేము ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుకుంటున్నామని తెలియజేసుకుంటున్నాను. డా.ఎన్. జయ ప్రకాశ్ నారాయణ్ గారు కూడా చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని చెపారు.

మిస్టర్ స్పీకర్: ఎస్. ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, ఒక్క నిముషం. సుమారు 14 నుండి 15 ప్రాజెక్టులున్నప్పటికీ, కనీసం వెయ్యి, రెండు వేల ఎకరాలకు కూడా కెనాల్స్ ద్వారా నీరు పారే పరిస్థితి లేనందున మా ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుతున్నారు. ప్రతిపక్ష నాయకుడు, ముఖ్యమంత్రి గారు మొదలైన వారు మా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించినప్పుడు, మా ప్రజలు అనేక సమస్యలను వారికి విన్నవించారు. కనీసం వాటిని పరిష్కరిస్తే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కోరారు. కానీ, ప్రతిపక్ష నాయకుడు మా జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు 'మీరు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి అనుకూలమైతే జై తెలంగాణ' అని ఒక్కసారి అనమని మా ప్రజలు కోరితే, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కనీసం ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు. వారు పాదయాత్ర చేస్తున్నప్పుడు తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలలో ఒక్క కుటుంబాన్ని కూడా వారు పరామర్శించలేదు. కానీ, విజయవాడలో కల్తీ సారా త్రాగి చనిపోయిన వారి కుటుంబాలను మాత్రం పరామర్శించారు. వారి కుటుబాలకు పార్టీ నుండి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ విధమైన వివక్షతను చూపడం వల్లనే తెలంగాణ ప్రాంత ప్రజలు ప్రతేక తెలంగాణ రాష్ట్రం కోరుతున్నారని మనవి చేస్తున్నాను.

(గౌరవ ఉప సభాపతిగారు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

(ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సీమాంధ్ర సభ్యులు తమకు మైకు ఇవ్వవలసినదిగా గౌరవ ఉప సభాపతి గారిని కోరుతున్నారు)

2010వ సంవత్సరం నుండి 2013-14 సంవత్సరం వరకు కూడా తెలంగాణ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. అందువల్లనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కానీ లైలా తుఫాను, నీలం తుఫాను వచ్చినప్పుడు సీమాంధ్ర ప్రాంతంలో హెలీకాప్టర్‌ల ద్వారా హుటాహుటిన సర్వే చేసి, సీమాంధ్ర రైతులకు మాత్రం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. ఇటువంటి వివక్షను చూపడం వల్లనే తెలంగాణ ప్రాంత ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుతున్నారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రామయ్య గారూ, ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ జోగు రామన్న: అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారు తెలంగాణ ప్రాంతంలో పర్యటనకు వచ్చినప్పుడు, ఒక ఎం.పి. గారు ఆమె మాట్లాడిన మాటలను తెలుగులో అనువాదం చేసినటువంటి వ్యక్తులు కూడా ఈరోజు అన్నీ మరచిపోయి మాట్లాడుతుంటే చాలా బాధాకరంగా ఉంది. అందుకోసమే ప్రాంతాల వారీగా ప్రజలు విడిపోయిన విషయం తమకు విదితమే. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన మాటను మర్చిపోయిన రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్లు రద్దు చేసే అవకాశం ఉంటే......

(శ్రీ జోగు రామన్న గారి మైకు కట్ చేయబడింది)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఎస్. కిషన్ రెడ్డి గారు, మాట్లాడండి.

(ఈ సందర్భంలో తెలుగు దేశం పార్టీ సీమాంధ్ర సభ్యులు తమకు ఒక్క నిముషం మాట్లాడే అవకాశం ఇవ్వవలసిందిగా కోరసాగారు.)

(శ్రీ జోగు రామన్న గారితోబాటు తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఒక్కసారి మైకు ఇవ్వవలసిందిగా గౌరవ ఉప సభాపతి గారిని కోరసాగారు.)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఎస్. రామన్న గారూ, ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ జోగు రామన్న: సర్. ఒక్క నిమిషంలో ముగిస్తాను. వాస్తవాలు చెబితే వీరికెందుకు ఇంత భయం? ఏ.పి.ఎన్.జీ.ఓ.ల ఉద్యమంలో ప్రజలు రోడ్ల మీదకు వచ్చారని,శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు పాదయాత్ర చేస్తున్నప్పుడు మాట్లాడారు. మరి 42 రోజుల పాటు తెలంగాణ ఉద్యోగులు సమ్మె చేస్తే, అరవై ఏళ్ళగా తెలంగాణ ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే, అవేమీ వారికి కనబడవా? అక్కడ జరిగే కృత్రిమ ఉద్యమాల గురించి మాట్లాడి, ఇక్కడి ఉద్యమాల గురించి మాట్లాడని, ఇక్కడ ఆత్మహత్యలు చేసుకున్న ప్రజల కుటుంబాలను పరామర్శించని తెలుగు దేశం పార్టీ వారు తెలంగాణ గురించి ఏ విధంగా మాట్లాడతారని నేనడుగుతున్నాను.

(శ్రీ జోగు రామన్న గారి మైకు మరలా కట్ చేయబడింది)

MR.DEPUTY SPEAKER: Kishan Reddy Garu

SRI JOGU RAMANNA: Sir, Mike Sir (without mike)

MR. DEPUTY SPEAKER : I have called the names given by the parties as per the list.

SRI JOGU RAMANNA: Sir one minute (without mike)

MR.DEPUTY SPEAKER : How long you want to extend the time like this? It is not proper. If you do not cooperate, who else will cooperate? Please cooperate. Please conclude.

ఉ.10.40 NSK-KSV

శ్రీ జోగు రామన్న: నా పేరు ప్రస్తావించారు కాబట్టి, నేను ఈ రోజు జోగు రామన్నగా చెబుతున్నాను. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రం కొరకు గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అనుకూలమని చెప్పి, తరువాత మాట మార్చినందుకు నేను ఆ పార్టీకి రాజీనామా చేశాను. నాకు తెలంగాణ ప్రజల ఆకాంక్ష ముఖ్యం తప్ప, పార్టీలు ముఖ్యం కాదు. నా రాజకీయ జీవితం వారి పార్టీ భిక్ష అని అంటున్నారు. నాకు పార్టీ ముఖ్యం కాదు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ఆకాంక్ష ముఖ్యం. నా గురించి మాట్లాడే అర్హత వారికి లేదు. మాటలు మార్చిన తెలుగుదేశం పార్టీలో ఉన్న తెలంగాణ ఎం.ఎల్.ఏ.లకు విజ్ఞప్తి చేస్తున్నాను. మీకు తెలంగాణ మీద

నిజంగా చిత్తశుద్ధి ఉంటే 'జై తెలంగాణ' అని మీ నాయకుడి చేత చెప్పించండని సవాల్ చేస్తున్నాను. వారికి మాట్లాడే నైతిక హక్కు లేదు. ఈ బిల్లుకు నేను సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ, ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ముగిస్తున్నాను. 'జై తెలంగాణ'.

శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు, (పాలకుర్తి): అధ్యక్షా, వారు చెప్పేది చెప్పుకుంటే ఇబ్బంది లేదు. తప్పుడు మాటలు మాట్లాడితేనే ఇబ్బందిగా ఉంటుంది. శ్రీకాంతాచారి గారు చనిపోయే ముందు టి.ఆర్.ఎస్. పార్టీకి చెందిన వారు అక్కడ ఎవరూ లేరు. మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు శ్రీకాంతాచారితో ధైర్యంగా ఉండమని ఫోన్‌లో మాట్లాడారు. అప్పుడు నేను అక్కడే ఉన్నాను. శ్రీకాంతాచారి గారు ఎందుకు చనిపోయారు? మీ పార్టీలోనే ఒకతను ఒంటి మీద కిరోసిన్ పోసుకొని, అగ్గిపెట్టె దొరకలేదని నాటకమాడారు. కానీ కిరోసిన్ పోసుకున్న శ్రీకాంతాచారి మాత్రం చనిపోయాడు. అప్పుడు టి.ఆర్.ఎస్. పార్టీ సభ్యులు ఎక్కడున్నారు? 1000 మంది విద్యార్థులు చనిపోవడానికి కారణం టి.ఆర్.ఎస్. పార్టీ. శ్రీకాంతాచారిని బ్రతికించడానికి ప్రయత్నం చేసిందీ, హాస్పిటల్ ఖర్చులు పెట్టిందీ, ఆ కుటుంబాన్ని ఆదుకున్నదీ మా తెలుగుదేశం పార్టీ. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎన్.టి.ఆర్. ట్రస్టు నుంచి రక్తం తెప్పించి, డాక్టర్లతో మాట్లాడి మొత్తం హాస్పిటల్ ఖర్చులు భరించింది తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ౙౙ •

(టి.ఆర్.ఎస్. పార్టీకి చెందిన సభ్యులచే అంతరాయం)

MR.DY.SPEAKER: Please sit down.

శ్రీ ఎర్రబెల్లి దయాకర రావు: తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోడానికి ఇప్పటికీ మా పార్టీ సిద్ధంగా ఉంది.

(మైక్ కట్ చేయబడింది)

(మైక్ లేకుండా) వారు ఎలా పడితే అలా మాట్లాడుతున్నారు సార్. నాకు ఇంకొక్క నిమిషం సమయాన్ని ఇవ్వండి.

(సభకు అంతరాయం)

శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి, (ఇబ్రహీంపట్నం): అధ్యక్షుల వారికి నమస్కారములు. తెలంగాణ ముసాయిదా బిల్లు మీద నాకు మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు మొదటగా మీకు ధన్యవాదములు. ఈ ప్రతిపాదనలు నా వ్యక్తిగతం, నా జిల్లా మరియు నియోజకవర్గ తెలంగాణ ప్రజల ఆకాంక్ష. ఈ ముసాయిదా బిల్లుపై చర్చ ద్వారా ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని ప్రతి సభ్యుడినీ కోరుతున్నాను. గత 56 సంవత్సరాల నుంచి తెలంగాణలో వివక్షత ఏర్పడిన సందర్భంలో ఈ రోజు తెలంగాణకు ఒక మంచి అవకాశం వచ్చినందున, అందరూ కలిసి ముందుకు పోవాలని నేను కోరుతున్నాను. ముఖ్యంగా తెలంగాణపై ఉన్న వివక్షత వల్లనే ఈ 'తెలంగాణా ఉద్యమం' రావడం జరిగింది. గత 56 సంవత్సరాల నుంచి జరిగిన ఈ ఉద్యమంలో అందరి కృషి, కష్టం, అన్ని

• Expunged as ordered by the Chair

విధాలా సహాయసహకారాలు అందించిన 4 కోట్ల తెలంగాణ ప్రజల ఫలితంగానే ఈ బిల్లు రావడం జరిగింది. తెలంగాణ ప్రాంతానికి నిధులు, నీరు, విద్యా, ఆరోగ్యం వంటి వాటిలో చూపిన వివక్షత వల్ల, జరిగిన అన్యాయం వల్లనే టి-బిల్లు రావడం జరిగింది. ప్రతి బడ్జెట్‌లో కూడా తెలంగాణకు అన్యాయం జరిగింది. రంగారెడ్డి జిల్లా 1972వ సంవత్సరంలో ఏర్పడినప్పటికీ అక్కడి ప్రజలు ఉద్యోగాలు, నీరు వంటి వాటిలో దేనికీ నోచుకోలేని పరిస్థితిలో ఉన్నారు. పాలమూరులోనున్న ఎత్తిపోతల పథకానికి గాని, ఏ కార్యక్రమాన్ని తీసుకున్నా, ఎన్ని దీక్షలు చేసినా, ఉపవాసాలున్నా, పాదయాత్రలు చేసినా నిధులు కేటాయించడంలో వివక్షత చూపించారని నేను తెలియజేస్తున్నాను. వ్యవసాయానికి నీరు కావాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఎలాంటి నిధులు కేటాయించలేదు. 56 సంవత్సరాలుగా వివక్షత చూపినందుకే విద్యార్థుల్లో, ఉద్యోగుల్లో ఈ ఉద్యమం పెద్ద ఎత్తున రావడం జరిగింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న 12,000 ఎకరాలు గత 10 సంవత్సరాల నుంచి సెజ్‌ల పేరు మీద, రాజీవ్ గృహ కల్ప పేరు మీద కొన్ని వేల కోట్ల విలువైన భూములను, ఆస్తులను అమ్ముకున్నారు. ఉన్న ప్రభుత్వ భూములు గాని, ఎస్సీలకు, బీసీలకు ఇచ్చిన భూములన్నీ కూడా బిఓటీ క్రింద తీసుకొని సెజ్‌లకు, ఆంధ్రాలోనున్న బడాబాబులకు కట్టబెట్టారు. ఈ వివక్షత వల్లే తెలంగాణ కావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు. మా నిధులు, విధులు మాకు అనుగుణంగా మేము చేసుకుంటామనే ఆలోచన కోసం పోరాటం చేయడం జరిగిందని తెలియజేస్తున్నాను. నీళ్లకు సంబంధించి రూ.6,000 కోట్ల రూపాయలు కేటాయిస్తే, అందులో సెస్ రూపంలో వచ్చిన రూ.300 కోట్లను సెంట్రల్‌పూల్‌లో వేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతం అభివృద్ధి కొరకు ఈ నిధులను కూడా కేటాయించలేదు. ఇలాంటి చిన్న చిన్న విషయాలలో కూడా వివక్షత చూపించడం జరిగింది. డిగ్రీ కాలేజీలకు, భవనాలకు ఎప్పుడో 4, 5 సంవత్సరాల క్రితం నిధులిచ్చారు. ఇప్పుడు ఆ నిధులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రతిచోట వివక్షతతో చేస్తున్నారు. ప్రజలు తెలంగాణ కావాలనే ఆకాంక్షతో ఉన్నారు. కాబట్టి అందరూ ఏకగ్రీవంగా టి-బిల్లును అమోదించవలసిందిగా కోరుతున్నాను. రంగారెడ్డి జిల్లా ఉనికిని దెబ్బతీయాలని హెచ్.ఎం.డీ.ఏ.ను తీసుకొని వచ్చి, దీన్ని యు.టి. గా చేయాలని, గవర్నర్ పాలన క్రిందకు తీసుకురావాలని ఆలోచనలు చేయడం సరైన పద్ధతి కాదు. హైదరాబాదు చుట్టుప్రక్కల ఉన్న రంగారెడ్డి జిల్లా ఉనికిని కాపాడుకోడానికి ఈ బిల్లుకు సభ్యులందరూ సహాయసహకారాలు అందించాల్సినదిగా కోరుతూ, ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదములు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**ఉ.10.50 జివైజి/ఎస్ఎస్‌కె**

శ్రీ చింతలపూడి వెంకట్రామయ్య: అధ్యక్షా, నాకు ఈ అవకాశమిచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. గౌ. రాష్ట్రపతి ద్వారా పంపబడిన ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ, 2013 చట్టానికి సంబంధించిన ముసాయిదా బిల్లును గౌ. సభాపతి గారు మన సభ ముందుచుంచిన నేపథ్యంలో సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్ఫూరికి కట్టుబడి వున్న వ్యక్తిగా ఈ ముసాయిదా బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. మా ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగానూ, నా వ్యక్తిగతంగానూ రాష్ట్ర విభజన బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. 13వ

శాసన సభలో నేను సభ్యునిగా వున్న సమయంలో ఇటువంటి ముసాయిదా బిల్లు రావడం చాలా బాధాకరంగానూ, దురదృష్టకరంగానూ నేను భావిస్తున్నాను. ఈ బిల్లులో రాష్ట్ర మనుగడకు, అభివృద్ధికి ఆటంకం కలిగించే అంశాలున్న నేపథ్యంలో దీన్ని ఎంతమాత్రం సమర్థించలేము. రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు, వారెన్నుకున్న ప్రజా ప్రతినిధులు ఈ విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నారు. 1972 డిసెంబర్1వ తేదీన స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధి గారు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచవలసిన అవసరాన్ని చెప్పారు. భారత దేశంలో ఏ రాష్ట్రాన్నైనా విడగొట్టవచ్చు, ఎన్ని రాష్ట్రాలుగా అయినా విడగొట్టవచ్చు కాని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించడం అసాధ్యం, ఈ రాష్ట్రాన్ని విభజిస్తే రెండు లక్షల మంది ఉద్యోగస్తులకు ఇబ్బందులెదురవుతాయని, బదిలీ, సర్వీస్, పెన్షన్స్ తదితర అనేక ఇక్కట్లొస్తాయని ఆనాడు ఇందిరా గాంధి గారు ఈ రాష్ట్రంలోని తెలుగు ప్రజల యొక్క మనోభావాలను దృష్టిలో పెట్టుకొని, ఈ భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడినందుకు ఈ రాష్ట్ర తెలుగు ప్రజల తరఫున నేను ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తున్నాను. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి హైదరాబాదు నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీమాంధ్ర వారిదేనని, విభజన వలన హైదరాబాదుతో ఐదు దశాబ్దాల అనుబంధం వున్న సీమాంధ్ర ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతాయని జస్టిస్ శ్రీ కృష్ణ కమిటి ఆరు నెలలు రాష్ట్రమంతటా విస్తృత పర్యటనలు జరిపి, అందరినీ కలిసి ఈ రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడమే ఉత్తమమని సూచించడం జరిగింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగానే తెలుగు మాట్లాడే వారందరితో కలిపి ఒక రాష్ట్రంగా చేయాలన్న భావనతోనే ఈ రాష్ట్రం ఏర్పడింది. ఈ బిల్లు తీసుకురావడం ద్వారా రెండవ ఎస్ఆర్సి ప్రకారమే మరో రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని గతంలో చేసిన తీర్మానాన్ని ఉల్లంఘించడం జరిగింది. సాంప్రదాయాలకు విరుద్ధంగా ఈ విభజన ప్రక్రియ వుంది కాబట్టి వెంటేనే ఆ ప్రక్రియను ఆపాలని, సమైక్యంగా వుంటేనే అన్ని రంగాలలో ప్రగతి సాంధించవచ్చు కావున మన తెలుగు ప్రజలను రెచ్చగొట్టి రాష్ట్రాన్ని ముక్కలు చేసే సాహసం చేయవద్దని, ఈ బిల్లును వెనక్కు పంపమని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అంతేకాక ఈ బిల్లును సిడబ్ల్యుసి పది రాష్ట్రాలతో కూడిన తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం నిర్ణయం తీసుకున్నట్లుగా నాలుగు గంటలకు అనౌన్స్ చేసిన సందర్భంలో దానిని వ్యతిరేకిస్తూ మా గాజువాక నియోజకవర్గంలో నాలుగున్నర గంటలకు రాష్ట్రంలోనే మొట్టమొదటగా ఉద్యమం చేయడం జరిగింది.

మా గాజువాక ప్రజలతో పాటు ఈ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని మన రాష్ట్రంలో వున్న తొమ్మిది కోట్ల మంది ప్రజల్లో దాదాపు ఏడు కోట్ల మంది ప్రజలు ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేకుండానే ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. భాషాప్రయుక్త రాష్ట్రంగా తెలుగు ప్రజలు ఎంతో కష్టపడి సాధించుకున్న ఈ రాష్ట్రాన్ని విడదీసి రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలను, వారి కుటుంబాలను గాలికొదిలేయవద్దని కోట్లాది మంది తెలుగు ప్రజలు ముక్త కంఠంతో రోడ్ల మీదకొచ్చి ఆర్తనాదాలు చేసిన విషయాన్ని హైకమాండ్ వారు దృష్టిలో పెట్టుకొని ఈ రాష్ట్రాన్ని విభజించకుండా సమైక్యంగా వుంచడానికే కృషి చెయ్యాలని కోరుతున్నాను. అంతేకాదు ఈ

రాష్ట్రంలోని తెలుగు ప్రజల యొక్క మనోభావాలను ఏ మాత్రం దెబ్బతినకుండా వుంచవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద వుంది.

కాబట్టి స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ గారు పార్లమెంటులో చేసిన ప్రసంగాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్నే కొనసాగించాలని కోరుతూ, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికే కట్టుబడి వుంటూ ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఈ ముసాయిదా బిల్లుపై నా అభిప్రాయాలను గౌ. సభాపతి గారికి రాతపూర్వకంగా కూడా సమర్పిస్తున్నాను. వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ, ఈ ప్రత్యేక తెలంగాణా బిల్లును వ్యతిరేకిస్తూ సంపూర్ణమైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని కొనసాగించాలని కోరుకుటూ సెలవు తీసుకుంటున్నాను. ధన్యవాదాలు.

శ్రీ కిచ్చెన్నగారి లక్ష్మా రెడ్డి, (మేడ్చెల్)ః అందరికీ నమస్కారం. ముఖ్యంగా నాకు అవకాశమిచ్చినందుకు మా లీడర్ గారికి, విప్ గారికి, స్పీకర్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా కాన్‌స్టిట్యుయన్సీ ప్రజలకు కూడా నాకు ఈ ఛాన్స్ ఇచ్చినందుకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణా అన్నది ఎన్నో ఏళ్ల కల. ఎంతో మంది, ఎన్నో పార్టీలు ఉద్యమాలు చేస్తే ఈ రోజు ఈ పరిస్థితికొచ్చింది. కొంతమంది వాళ్ల వల్ల వచ్చిందనుకుంటున్నారు. ఎవరివల్లా కాదు. అన్ని పార్టీల పోరాటం, ఎంతో మంది ఆత్మ బలిదానం, తెలంగాణాలోని ఎంతో మంది గొప్పగొప్ప వారి పోరాటల వల్ల ఈ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు పరిస్థితి ఇంతవరకొచ్చిందని తెలియజేస్తున్నాను.

మా గౌరవ మంత్రులిద్దరు ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజ్యాంగ విరుద్ధమని మాట్లాడడం జరిగింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలనడగరు. ప్రజానాయకుల వ్యూస్ ప్రకారం నడచుకుంటారు. ఈ భారత దేశాన్ని యుపిఎ ప్రభుత్వం నడిపిస్తున్నది. అంటే మెజారిటీ పార్లమెంటు సభ్యుల సపోర్ట్ వున్న యుపిఎ పాలిస్తున్నది. యుపిఎ ప్రభుత్వంలోని కేబినెట్, యుపిఎ పార్ట్నర్లందరు కూడా తెలంగాణాకు అనుకూలమని తెలియజేశారు. కేబినెట్‌లో పెట్టారు. కేబినెట్‌లో పాస్ చేశారు. ప్రెసిడెంట్‌కిచ్చారు. ప్రెసిడెంట్ నుండి మీరు చర్చించండి, మీ వ్యూస్ చెప్పండి అని ఇక్కడికి రావడం జరిగింది. ఇది రాజ్యాంగ విరుద్ధమెట్లా అవుతుందో నాకైతే అర్థం కావడం లేదు. ప్రజాస్వామ్యంలో ఇది అప్రజాస్వామికం ఎట్లా అవుతుందో కూడా నాకు అర్థం కాలేదు. ఎన్‌డిఎ కూడా తెలంగాణా బిల్లు పెట్టండి, మేం ఓటు వేస్తామని చెప్పి దీనికి కన్సెంట్ ఇచ్చింది. అంటే పార్లమెంటులో 80 శాతం మంది ప్రజలను రెప్రజెంట్ చేస్తున్న పార్లమెంటు సభ్యులు తెలంగాణాకు అనుకూలం వ్యక్తం చేశారు కనుక ఇది అప్రజాస్వామికం కాని, రాజ్యాంగ విరుద్దం కాని కాదని నేను తెలియజేస్తున్నాను.

ఇక రాష్ట్రం విషయానికొస్తే ఇక్కడున్న అన్ని పార్టీలు సమ్మతం తెలియజేశాక కాంగ్రెస్ ఒప్పుకుంది. కనుక రాష్ట్రంలో వున్న 80 శాతం మంది సభ్యులు ఇదివరకే ఒప్పుకున్నారు కనుక 80 శాతం మేరకు ప్రజలు కూడా దీనికి ఒప్పుకున్నట్లే. కనుక ఇది ప్రజాస్వామికం,

రాజ్యాంగబద్ధంగా కూడా వుందని తెలియజేస్తున్నాను. సర్, ఇక్కడ అసలు విషయం మరచిపోయారు. తెలంగాణా వచ్చిందని అందరికీ తెలుసు. నార్కో అనాలిసిస్ చేస్తే తెలుస్తుంది. అయితే దేనికోసం ఇట్లా చేస్తున్నారంటే అక్కడా ఇక్కడా వాళ్లే లీడర్లవుదామని, హీరోలవుదామనే వురుకులాటే తప్ప మరొకటి కాదు. తెలంగాణా వచ్చేసిందని పోరాడుతున్న ఆ ముగ్గురికీ తెలుసు. ఆ ముగ్గురు పేర్లు నేను చెప్పను కాని ఆ ముగ్గురూ అక్కడ హీరోలవుదామని, ఈ బిల్లు మీద ఏదో కన్ఫ్యూజన్ చేస్తున్నారే తప్ప తెలంగాణా వచ్చేసిందని తెలుసు వీరందరికీ. వాళ్లనుకున్నట్లుగా కాక తెలంగాణా రావడం వల్ల లాభనష్టాలుండొచ్చు.

ఉ.11.00 Crk/Asv

మనుష్యుల మధ్య విభజన కాదు, పరిపాలనా పరంగా విభజన కావాలని మేము కోరుకుంటున్నాము. ఆలస్యం చేస్తే మనుష్యుల మధ్య కూడా విభజన వస్తుంది. కాబట్టి యునానిమస్‌గా అందరం ఒప్పుకుందాం. అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి ...........

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ కె. లక్ష్మారెడ్డి: అధ్యక్షా, విభజనకు అనుకూలమని తెలియజేస్తే చర్చ వేరుగా ఉండేది. విభజనను ఒప్పుకుంటే, మన రాష్ట్రానికి ఏమి కావాలో అవి, అన్ని పార్టీల నాయకులు పోరాడి, కేంద్ర ప్రభుత్వం నుండి తెచ్చుకోవచ్చు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఫ్యాక్టరీల బ్రాంచీలను ఆంధ్రా ప్రాంతంలో పెట్టమని చెబుదాము. ఉద్యోగావకాశాలు పోతాయని, నీళ్లు రావని ఆలోచించవద్దని మనవి చేస్తున్నాను. అక్కడ సముద్రం ఉంది. వర్షాలు రాకపోతే కనీసం చేపలు తిని అయినా బతకవచ్చు. ఓడరేవులు పెట్టుకోవచ్చు. రొయ్యలు పెంచుకోవచ్చు. రానున్న కాలంలో సముద్రం నీళ్లే ఉపయోగించుకోవాలి. డీసాలినేట్ చేసి తాగడానికి, వ్యవసాయానికి, ఇండస్ట్రీస్‌కి ఉపయోగించుకోవచ్చు. కనుక బాధ పడకండి. కలిసుందాం, పరిపాలనా పరంగా విడిపోదాం. కలిసుండి అన్నీ సాధించుకుందాం, పరిపాలనను విభజించుకుందామని అందరికీ తెలియజెస్తున్నాను. బిల్లు పై ఓటింగ్ లేదు కనుక అందరూ వ్యూస్‌ని చెప్పి ఈ సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతున్నాను. "జై తెలంగాణా ".

శ్రీ పి. రామకృష్ణా రెడ్డి, (మాచర్ల) : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013 అనేది ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ స్ఫూర్తికి, సాంప్రదాయాలకు విరుద్ధంగా, అసెంబ్లీ తీర్మానం లేకుండా సభకు కనీస గారవం ఇవ్వకుండా, మా ప్రాంత ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా జరుగుతున్న ఈ రాష్ట్ర విభజనను ప్రతి ఒక్కరూ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. నా నియోజకవర్గం పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఉంది. అప్పట్లో మెషినరీ, క్రేన్‌లు లేకపోయినా మా ప్రాంత ప్రజల రెక్కల కష్టంతో నిర్మించుకున్న నాగార్జునసాగర్ ఈరోజు ఎడారిగా మారే పరిస్థితికి వచ్చింది. ఈ విభజన జరిగితే, ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి, నాగార్జునసాగర్ రైట్ కెనాల్ ద్వారా నీళ్లు రాక కొన్ని లక్షల ఎకరాలు బీడు భూములుగా మారే పరిస్థితి వస్తుంది. ఈ రెండు జిల్లాలలో త్రాగునీటికి సంబంధించి కూడా ఇబ్బంది వస్తుంది. ఈ విభజన వల్ల మా

ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి వస్తుంది. స్వర్గీయ రాజశేఖర రెడ్డి గారు పేదల కోసం, బడుగు బలహీన వర్గాలు, రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ విద్యార్థుల కోసం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా లక్షల మందికి ఈరోజు చదువుకుని మంచి ఉద్యోగాలు రావాలని ఆశిస్తున్న వాళ్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాను. పేద రైతులందరూ ఈరోజు వాళ్ల పిల్లలను చూసి బాధపడుతున్నారు. వాళ్ల చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వస్తాయో రావో అని అనుకుంటున్నారు. ఈరోజు హైదరాబాదు మాది, హైదరాబాదులో మీరు రెండు సంవత్సరాలు ఉండాలి అంటే వాళ్ల బతుకులు, వాళ్ల కుటుంబం ఏమి కావాలి అధ్యక్షా? రాజశేఖర రెడ్డి గారు ముందు చూపుతో ఈ రాష్ట్రం కలిసి ఉండాలి, తెలుగు ప్రజలు కలిసి ఉండాలి, మన దేశంలోనే ఈ రాష్ట్రం అగ్రగామిగా ఉండాలని, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు, స్వార్థ రాజకీయ పార్టీల అవసరాల కోసం ఈ రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నం చేయడం చాలా అన్యాయం. విచిత్రం ఏమిటంటే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుండీ సమైక్యాంధ్రకు మద్దతుగా, సీమాంధ్రా ప్రజల మనోభావాలకనుగుణంగా ఒకే అభిప్రాయాన్ని చెప్పాము. మా పార్టీ అధ్యక్షులు, ఎం.ఎల్.ఏలు సామాన్య కార్యకర్తలందరూ ఒకే అభిప్రాయంతో మా ప్రాంత ప్రజల మనోభావాలకనుగుణంగా ముందుకు వెళ్తున్నాం. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు కొన్ని రకాల అభిప్రాయాలను, వారి ఎం.ఎల్.ఏలు మరో అభిప్రాయంతో, రెండు కళ్ల సిద్ధాంతాతో సీమాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా మోసం చేస్తున్నారు. సీమాంధ్ర ప్రజలెవరూ వీళ్లను క్షమించే పరిస్థితి ఉండదు. కొంత మంది తెలుగుదేశం నాయకులు మా పార్టీ సభ్యులను, మమ్మల్ని అగౌరవపరిచే విధంగా ఆ ప్రాంత ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, మేము ఈ సభలో ఎంజాయ్ చేస్తున్నామని కామెంట్ చేస్తున్నారు. మేము, మా ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు మా నిరసనను మీ దృష్టికి తీసుకొస్తాను. గుంటూరు జిల్లా ప్రజల పక్షాన, పలనాడు ప్రాంత ప్రజల పక్షాన, మాచర్ల నియోజక వర్గం ప్రజల పక్షాన ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. జై సమైక్యాంధ్రా!

శ్రీ కె.ఎస్. రత్నం, (చేవెళ్ల) : అధ్యక్షా, ఈ బిల్లుపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చేవెళ్ల నియోజకవర్గ ప్రజల తరుపున కూడా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రపతి గారు ఈ బిల్లును శాసనసభకు పంపించారు. శాసనసభ్యుల సూచనలు మాత్రమే ఇవ్వాలి. సూచనలంటే తెలంగాణా ప్రాంతంలో, సీమాంధ్రా ప్రాంతంలో ఈ విభజన వల్ల వచ్చే ఇబ్బందులను, నష్టాలను గురించి సభలో చెప్పాలి. అందరికీ సమ న్యాయం చేయాలని, ఈ చర్చ జరగవలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఈ తెలంగాణా పోరాటం నిన్న, మొన్న పుట్టింది కాదు. తెలంగాణా ప్రజలు 1969 నుండి మా తెలంగాణా మాకు కావాలి, మేము తెలంగాణాలో దగా పడ్డాం, అన్యాయానికి గురయ్యాం అనే ఆలోచనలో ఉన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకూ తెలంగాణా కావాలని కోరుకుంటున్నారు. ఇందులో ఎవరికీ అన్యాయం జరగదు.

చాలా మంది మాకు అన్యాయం జరుగుతున్నది మేము మునిగిపోతున్నామని గగ్గోలు పెడుతున్నారు. దీంట్లో ఎక్కడా అన్యాయం లేదు. చాలా సుఖంగా, చాలా సంతోషంగా జీవించే అవకాశం వాళ్లకు కలుగుతుంది. ఈ విభజన వలన్ల బాధపడేది కేవలం రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు ఇక్కడెవరైతే నివసిస్తున్నారో వాళ్లు మాకేదో అన్యాయం జరుగుతున్నదని బాధపడుతున్నారు తప్ప సీమాంధ్ర సామాన్య ప్రజలు కూడా డివిజన్ కావాలని కోరుకుంటున్నారు. తెలంగాణ సెపరేట్ అయితే మా ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందనే ఆలోచన వాళ్లలో ఉందనే విషయాన్ని తెలియచేస్తున్నాను. ఈనాడు తెలంగాణ సాధనలో కవులు, కళాకారులు, విద్యార్థులు అన్ని రాజకీయ పార్టీలు, అడ్వొకేట్స్ పాలుపంచుకున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు సకలజనుల సమ్మెను చేసినప్పుడు తెలంగాణ ప్రాంత ప్రజలంతా చలించిపోయారు. అందుకే ఈనాడు తెలంగాణ కావాలని, తెలంగాణ ఇవ్వాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి కలుగడం కూడా ఒక మంచి సాంప్రదాయమని భావిస్తున్నాను.

అధ్యక్షా, సమైక్యం కోసం ఈనాడు పోరాటం చేసేవాళ్లందరూ హైదరాబాద్ కోసమే. ఏమున్నది హైదరాబాద్‌లో. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో, జూబ్లీహిల్స్‌లో పెట్టుబడిదార్లు, వలసవాదులు నివసిస్తున్నారు. ఈనాడు హైదరాబాద్‌లో కూడా స్లమ్ ఏరియాల్లో చాలా మంది పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారు. వాళ్లకు ఉండటానికి ఇళ్లు లేవు. మినిమమ్ సదుపాయాలు లేని పరిస్థితుల్లో ఈరోజు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న భూములన్నీ ఆనాడు రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా వేలాది ఎకరాలను వేల కోట్ల రూపాయలకు ధారాదత్తం చేసిన ఘనత ఆనాడు రాజశేఖర్‌రెడ్డిది. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతంలో ఉన్న భూములన్నీ అమ్మి బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేసి ఆ నిధులన్నీ కడపలోని పోతిరెడ్డిపాడు రెగ్యులేటరీ ప్రాజెక్టుకు కేటాయించిన ఘనత రాజశేఖర్‌రెడ్డి గారిది.

ప్రాణహిత చేవెళ్లకు ఆనాడు రాజశేఖర్ రెడ్డి గారు ఎన్నికల ముందు శంఖుస్థాపన చేసి అరకొర నిధులిచ్చి ప్రారంభించడం జరిగింది. కానీ ఈనాటి వరకూ ప్రాణహిత చేవెళ్లకు సరియైన నిధులు కేటాయించకుండా దాన్ని చిన్నచూపు చూస్తూ ఆ ప్రాజెక్టు పూర్తైతే తెలంగాణ ప్రాంతం బాగుపడుతుందనే ఆలోచనతో 10 సంవత్సరాల కాలమైనా ప్రాణహిత చేవెళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది. ప్రాణహిత చేవెళ్లకు మొబిలైజేషన్ పేరు మీద రూ.600 కోట్లు కేటాయించి ఆ మొబిలైజేషన్ పేరు మీద వాటన్నింటిని స్వాహా చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డి గారిదని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. తెలుగుదేశం పార్టీ తెలంగాణకు కట్టుబడి వుందని నేను వ్యక్తిగతంగా చెప్పడం లేదు, పార్టీపరంగా చెబుతున్నాను. చంద్రబాబు నాయుడు గారు కూడా తెలంగాణకు కట్టుబడి వున్నారని నేను స్పష్టంగా చెప్పదలచుకున్నాను. పదే పదే తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేసి, తెలుగుదేశం పార్టీ తెలంగాణాకు అడ్డుపడుతున్నదని చెబుతున్న మా సోదరులకు కొంత మందికి సూచిస్తున్నాను. ఎవరైనా, ఎక్కడైనా ఇంటికి పిలిచి

గ్లాసు మంచినీళ్లు ఇచ్చి, భోజనం పెడితే శాశ్వతంగా మనం మరచిపోము. ఈనాడు అనేక మంది బడుగు, బలహీన వర్గానికి రాజకీయ జీవితాన్నిచ్చిన తెలుగుదేశం పార్టీని విమర్శించడం సరికాదని మా సోదరులకు తెలియచేస్తున్నాను.

MR. DEPUTY SPEAKER: Please conclude.

శ్రీ కె.ఎస్.రత్నంః అధ్యక్షా, నేను గతంలో ఎప్పుడూ మాట్లాడలేదు. మొదటిసారిగా మాట్లాడుతున్నాను. ఒక్క నిమిషం సార్. తెలంగాణ కావాలని బలమైన కోరిక ఈనాడు తెలంగాణ ప్రజల్లో ఉంది. తెలంగాణ అవసరం లేదు, తెలంగాణ ఏర్పడితే ప్రపంచమంతా బద్దలైపోతున్నట్లు, మేము భారత దేశం నుంచి విడిపోతున్నట్లు ముఖ్యమంత్రి గారు మాట్లాడుతున్నారు. ఒకనాడు బంగ్లాదేశ్ గానీ, పాకిస్తాన్ గానీ భారతదేశం నుంచి విడిపోలేదా అని అడుగుతున్నాను. తెలంగాణ సపరేటైనా తెలంగాణ ప్రజలు చాలా మంచి వారు, సహృదయులు. 1969 వ సంవత్సరం నుంచి జరిగిన ఉద్యమంలో తెలంగాణ ప్రజలు గానీ, తెలంగాణ విద్యార్థులు, కవులు, కళాకారులు గానీ ఎవరి మీద ఎక్కడా దౌర్జన్యం చేయలేదు. ఎవరి మీదా చెయ్యి వేయలేదు. తెలంగాణ సాధన కొరకు ప్రాణాలు తీసుకున్నారు తప్ప ప్రాణాలు తీయలేదనే విషయాన్ని తెలియచేస్తున్నాను. తెలంగాణ ఇవ్వవలసిందే. దీని కొరకు సభలో తీర్మానం చేయవలసిన అవసరం లేదు. కేవలం అభిప్రాయం చెప్పడం కొరకే బిల్లును పంపించడం జరిగింది. సీమాంధ్రులు గానీ తెలంగాణ వాళ్లు గానీ అందరం కలిసి విడిపోవడం మంచిది.

ఈనాడు ఒక గ్రామ పంచాయతీ ఉంటే ఆ గ్రామ పంచాయతీ కింద అనుబంధ గ్రామముంటే మా గ్రామం అభివృద్ధి చెందడం లేదు, మాకూ సపరేట్ గ్రామం ఇవ్వండని ఆ గ్రామ ప్రజలు కోరతారు. అదే విధంగా తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందలేదు కాబట్టే మేము తెలంగాణ సెపరేట్ కావాలని కోరుకోవడంలో ఏమాత్రం సంశయం లేదని తెలియచేస్తున్నాను. తెలంగాణ ప్రాంతంలో, తెలుగుదేశం పార్టీలో వుండి తెలంగాణ కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన మొట్ట మొదటి వ్యక్తిగా తెలియచేస్తున్నాను. పార్టీలో వ్యక్తులు వాళ్ల వాళ్ల అభిప్రాయాలు చెబుతున్నా తెలుగుదేశం పార్టీ గానీ, చంద్రబాబు నాయుడు గారు గానీ తెలంగాణకు కట్టుబడి వున్నారని ఇప్పటికి కూడా మనవి చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి పి.ఎం.కమలమ్మ, (బద్వేల్)ః అధ్యక్షా, ఈరోజు గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ద్వారా పంపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, 2013 చట్టానికి సంబంధించిన ముసాయిదా బిల్లును గౌరవనీయులైన సభాపతి గారు సభ ముందు ఉంచిన నేపథ్యంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్ఫూర్తికి కట్టుబడివున్న వ్యక్తిగా ఈ ముసాయిదా బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. మా బద్వేల్ నియోజక వర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగా, నా వ్యక్తిగతంగానూ రాష్ట్ర విభజన బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. రాష్ట్ర విభజన వల్ల ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి వాటిల్లే నష్టాల గురించి ప్రస్తావన గానీ, విభజన పర్యవసానాలను పరిష్కరించే ప్రయత్నం గానీ ఈ బిల్లులో లేవు.

అందువలన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అలాగే రాయలసీమ రాష్ట్రంలో పూర్తిగా వెనుకబడ్డ ప్రాంతం. వనరులు లేని ప్రాంతం. వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతం. ఇటువంటి రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, బీదరిక నిర్మూలనకు, యువత ఉపాధికి ఈ బిల్లులో ఏ మాత్రం ఏర్పాట్లు లేవు. అందువలన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను.

రాయలసీమలో గాలేరు నగిరి, హంద్రీనీవా, తెలుగుగంగ లాంటి పథకాలకు నీటి కేటాయింపుల విషయమే ప్రస్తావనకు రాలేదు. రాష్ట్ర విభజన వల్ల కృష్ణా నదిలో మిగులు జలాలను వినియోగించుకునే అవకాశాన్ని కూడా రాయలసీమ కోల్పోయే ప్రమాదముంది. అందువలన ఈ బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. వెనుకబడ్డ రాయలసీమ యువత ఉపాధి కోసం పూర్తిగా హైదరాబాద్ నగరం మీద ఆధారపడుతున్నారు. ఈ బిల్లులో ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లో ఉన్న వారికి రక్షణ, ఉపాధి, ఆర్థిక భద్రతల కోసం ఏ రకమైన ఏర్పాట్లు లేవు. అందువలన నేను ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. అంతే కాకుండా రాయలసీమ ప్రాంతంలో ప్రభుత్వ ఆదాయాన్ని గమనిస్తే, వ్యయాన్ని పరిశీలిస్తే వచ్చే ఏడాది దాదాపు రూ.10,000 కోట్ల లోటు తేలుతుంది. అంటే ఉద్యోగులకు జీత భత్యాలు కూడా ఇవ్వడానికి సాధ్యం కాని పరిస్థితి. ప్రతీ నియోజక వర్గానికి ఏడాదికి రూ.150 కోట్ల వరకూ లోటు ఉంటుంది. ఇంక అభివృద్ధి ఏ రకంగానూ సాధ్యం కాదు. అందువలన ఈ పరిస్థితుల్లో బద్వేల్ నియోజక వర్గ ప్రజల పక్షాన, రాయలసీమ ప్రాంత ప్రజల పక్షాన సీమాంధ్ర ప్రాంత ప్రజల పక్షాన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్నే కొనసాగించాలని కోరుతూ, సమైక్యాంధ్రప్రదేశ్‌కు కట్టుబడి వుంటూ ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృ తజ్ఞతలు తెలియచేస్తున్నాను.

ఉ.11.20 కెఎంఎస్/బివిఆర్

శ్రీ సి.హెచ్.ప్రతాపరెడ్డి, (షాద్‌నగర్): అధ్యక్షా, సభలో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లుపై మాట్లాడేందుకు నాకు సమయమిచ్చినందుకు మీకు హృ దయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. అదేవిధంగా, ఈ తెలంగాణా రాష్ట్రాన్ని సానుకూలంగా ప్రకటించినందుకు ఏఐసీసీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారికి కూడా హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలుపుతున్నాను. ముఖ్యంగా, తెలంగాణా రాష్ట్ర సాధనకై ప్రాణ త్యాగాలు చేసిన సుమారు 1200 మంది విద్యార్థి అమరవీరులకు నా జోహార్లు. అధ్యక్షా, పుట్టిన ప్రతి మనిషికీ డేటాఫ్ బర్త్ ఉంటుంది. కానీ, ఈ రోజు తెలంగాణా రాష్ట్రం కోసం 1200 మంది పిల్లలు డేటాఫ్ డెత్ రాసి చనిపోయారంటే నిజంగా వాళ్ల ధైర్యానికి, తెలంగాణా మీద వాళ్లకున్న అభిప్రాయానికి జోహార్లు తెలుపుతున్నాను. ఎందుకంటే, మేం చనిపోయినాసరే మా కుటుంబాలు, మా ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో వాళ్లు చనిపోయే డేట్‌ని కూడా వ్రాసుకుని చనిపోయారు. ఇది మామూలు విషయం కాదు.

అధ్యక్షా, తెలంగాణాలో ఉన్న పది జిల్లాల్లో హైదరాబాదు మరియు రంగారెడ్డి జిల్లాలు అరకొర అభివృద్ధి చెందాయేమో గానీ, తక్కిన 8 జిల్లాలు మాత్రం మంచినీరు లేక, సాగునీరు లేక, విద్యాపరంగా, ఉద్యోగాల పరంగా ఎక్కడ అభివృద్ధి చెందాయో చూపించాలని కోరుతున్నాను. వాస్తవానికి హైదరాబాదు నగరానికి అత్యంత సమీపంలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలో పరిశ్రమలు కొన్ని వచ్చినప్పటికీ, వాటి కోసమని మా భూములు లాక్కున్నారు, నీటిని లాక్కున్నారు. కానీ, ఉద్యోగాలన్నీ ఆంధ్రావాళ్లకు మాత్రమే ఇచ్చారు. మరి ఈ రోజు భూమిలో ఉన్న నీరు కలుషితమై పోయింది. కృష్ణా పరీవాహక ప్రాంతం సుమారు 300 కి.మీ.లు మా జిల్లాలో ప్రవహిస్తుంది. కానీ, మా జిల్లాకు త్రాగునీరు లేదు. అత్యంత వెనుకబడ్డ జిల్లా పాలమూరు జిల్లా. చాలా మంది ముఖ్యమంత్రులు మా జిల్లాను దత్తత కూడా తీసుకున్నారు. కానీ, అభివృద్ధి చేసింది మాత్రం శూన్యం. వాస్తవానికి వర్షాధారం వల్ల జిల్లాలో పంటలు పండటమే తప్పించి, ఎక్కడ కూడా ఒక్క ఎకరానికి కూడా నీరు పారే ప్రసక్తి లేదు. వర్షాకాలంలో వచ్చే నీటిపైనే ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే నీటిపై ఆధారపడి అర ఎకరమో, ఎకరమో పంట వేస్తే, ఆ పంట పండుతుందో, ఎండుతుందో కూడా తెలియదు. ఈ రోజు త్రాగునీరు విషయానికి వస్తే, 500 ఫీట్లు, 1000 ఫీట్లు లోతుగా బోర్లు తవ్వినా కూడా ఎక్కడా కూడా నీరు వచ్చే పరిస్థితి లేదు. గ్రామాలు కూడా ఖాళీ చేసి వలసపోయే ప్రమాదం ఉంది. ఈ రోజు వరకూ త్రాగునీరివ్వలేని ప్రభుత్వాలు మనవి. 65 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో రోడ్లు కూడా లేని పరిస్థితి మాది. మా దగ్గర సుమారు 158 తాండాలుంటే, అందులో సగం తాండాలకు కూడా రోడ్లు లేని పరిస్థితి. వారికి విద్య, కరెంటు సదుపాయాలు లేని పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే ఇవాళ తెలంగాణా కావాలని ఎందుకు అడుగుతున్నామో మీకు అర్థమౌతుంది. ఇది వాస్తవం కూడా అధ్యక్షా. కాబట్టి, తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన వెంటనే, మొట్టమొదటగా మా జిల్లాకు పాలమూరు ఎత్తిపోతల పథకం మంజూరు చేసి, మంచినీరు తీసుకురావాల్సిందిగా మేం కోరుతున్నాం. ఇంకా చెప్పాలంటే..

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ప్లీజ్ కంక్లూడ్...

శ్రీ సి.హెచ్. ప్రతాపరెడ్డిః కంక్లూడ్ చేస్తున్నాను. అధ్యక్షా, సీమాంధ్ర వాళ్లని గాని, ఇక్కడున్న ప్రజాప్రతినిధులందర్నీ నేను కోరేది ఒక్కటే. మీరంతా తెలంగాణా బిల్లుకు సహకరించండి. తెలంగాణా వచ్చాక మీ ప్రాంతం అభివృద్ధి చేసుకోవడానికి మేం కూడా మీ వెంటే ఉంటాం, మీతో కలిసి పని చేస్తాం, మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి సహకరిస్తాం.

శ్రీ కె. విద్యాసాగర్ రావు, (కోరుట్ల)ః అధ్యక్షా, తెలంగాణా ముసాయిదా బిల్లుపై మాట్లాడే అవకాశం ఈ శాసన సభలో నాకు వస్తుందో, రాదోనని అనుకున్నాను. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లుపై మాట్లాడే అవకాశం నాకు కల్పించినందుకు ముందుగా మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణా కల సాకారమయ్యే సమయంలో నన్ను ఈ సభకు పంపిన మా నాయకుడు, తెలంగాణా ఉద్యమ కారుడు, తెలంగాణా ఆశాజ్యోతి అయినటువంటి మా కేసీఆర్ గారికి, అదేవిధంగా తెలంగాణా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కోరుట్ల నియోజకవర్గం నుంచి రెండు

సార్లు నన్ను శాసన సభ్యుడిగా గెలిపించి ఈ సభకు పంపిన నా నియోజకవర్గ ప్రజలకందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజు పార్టీలన్నీ బిల్లుపైన మాట్లాడుతున్నాయి. ఇవాళ ముఖ్యమంత్రి గారు గాని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు గాని, వైఎస్సార్ సీపీ వాళ్లు గాని, తెలంగాణా రాష్ట్రం వస్తే మీరు పూర్తిగా నష్టపోతారని చెప్పి తెలంగాణా ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ఇవాళ ఈ ముసాయిదా బిల్లుకి, ఆత్మసాక్షిగా తెలంగాణా ప్రజల తరఫున, తెలంగాణా ఉద్యమకారుల తరఫున నేను పూర్తిగా మద్దతిస్తున్నాను. ఒక్కటే చెబుతున్నాను. తెలంగాణా ప్రజలను భయభ్రాంతులను చేసి ఇన్ని రోజులు ఈఈ • చేశారు. ఇంకా ఈఈ చేయడం కోసం, మీ రాజకీయ లబ్ది కోసం, మీ పొలిటికల్ మైలేజ్ కోసం, సీమాంధ్రలో ఎన్నికల్లో గెలవడం కోసం మా తెలంగాణా ప్రజలకు ఇంకా అన్యాయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలన్నింటినీ కోరుతున్నాను.

అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు నిన్న మాట్లాడుతూ ఒక్క టన్ను బొగ్గు కూడా మేం సీమాంధ్రకు తీసుకువెళ్లడం లేదు, విభజన జరిగితే మీకు నీళ్లు రావు, మీకు కరెంటు రాదు అని చెప్పారు. ఏదేమైనా మా అవస్థ మేం పడతామని చెబుతున్నాను. నీళ్లొచ్చినా, నీళ్లు రాకున్నా, ఒక పూట తిన్నా, ఒక పూట తినకున్నా మా అభివృద్ధిని మేం చేసుకుంటామని మాకు అవకాశమివ్వమని అడుగుతున్నాం. అంతేగానీ, ఇవాళ మీరేదో మమ్మల్ని భయభ్రాంతుల్ని చేసి, ఇన్ని రోజులు మీరేం తిన్నారు గనుక, ఇంకా మేమే ఏలుతాం, మీ రక్తమాంసాలు ఇంకా కొద్దిగా మిగిలిపోయాయి కాబట్టి తింటామని మీరు ఆలోచిస్తే మాత్రం, శుద్ధ ఈఈ ప్రతి పక్ష సభ్యుడిగా ఈ సభా నాయకుడిని కూడా నేను హెచ్చరిస్తున్నాను.

అధ్యక్షా, తెలంగాణా అనేది ఎన్నో రోజుల పోరాటం. సుమారు 1200 మంది బిడ్డలు ఇవాళ బలైపోయారు. ఆనాడు 1969లో 369 మంది విద్యార్థులు బలైననాడు నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నాను. నా వంతుగా తెలంగాణా రాష్ట్ర సాధన కోసం ఒకరోజు జైలుకు కూడా పోవడం జరిగింది. ఇంతమంది పోరాటాలు గమనించి, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి గారు రాష్ట్రానికి తెలంగాణా ముసాయిదా బిల్లుని పంపి, దాని మీద మీ అభిప్రాయాలు చెప్పమనంటే, 42 రోజుల నుండి చర్చను అడ్డుకుని, ఇంకా నెల రోజులు కావాలి, 4 వారాల సమయం కావాలని ఎక్స్‌టెన్షన్ కోరుతున్న విషయం శోచనీయమని చెబుతున్నాను. అధ్యక్షా, గత 40 రోజుల్లో ఈ రోజు ఏదైతే ప్రతి సభ్యుడికీ 3 నుండి 5 నిమిషాలు మాట్లాడేందుకు సమయం కేటాయిస్తున్నారో, అదే విధంగా సమయం కేటాయించి ఉన్నట్లయితే ఇదివరకెప్పుడో ఈ బిల్లు మీద చర్చ జరిగుండేది. చిన్న నిరూపణ సార్. మాకు జరిగిన అన్యాయాన్ని గురించి రెండు నిమిషాల్లో చెప్పి, నా ఉపన్యాసాన్ని పూర్తి చేస్తాను.

• Expunged as ordered by the Chair

అధ్యక్షా, కీ.శే. డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోరుట్లలోను, కడప జిల్లా పులివెందులలోను వెటర్నరీ కాలేజీ స్థాపన కోసం ఫౌండేషన్ స్టోన్ వేయడం జరిగింది. ఇవాళ రూ.200 కోట్ల వ్యయంతో పులివెందులలో వెటర్నరీ కాలేజీ పూర్తయ్యింది. అదే మా కోరుట్లలోని కాలేజీ ఇంకా పూర్తి కాని పరిస్థితి ఉంది. మా పిల్లలు చదువుకోని పరిస్థితి ఉంది. దాని విషయమై వెంటబడితే, ప్రభుత్వం రూ.30 కోట్లు ఇచ్చినా ఇంకా పనులు నత్తనడకన నడుస్తున్న పరిస్థితి ఉంది.

అదే విధంగా ఇవాళ ప్రతి నాయకుడూ చెబుతున్నాడు. ఇవాళ మీ ప్రాంతంలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టును మేం ఎంతో అద్భుతంగా కట్టామని, మేమే అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారు. నేను ఒక్కటే చెబున్నాను. ఎస్సారెస్పీ ప్రాజెక్టు క్రింద చివరి గ్రామాలకు కూడా నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. వరద కాలువలు తవ్వినా మిడ్ మానేరు ప్రాజెక్టు కట్టని పరిస్థితి ఉంది. మా నియోజకవర్గంలో ఒకప్రక్క గోదావరి ఉన్నా, గ్రామాల్లో త్రాగడానికి నీరు లేదు. కోరుట్ల, మెట్‌పల్లి రెండు మున్సిపాలిటీల్లోనూ చదువుకోవడానికి జూనియర్ కళాశాలకు గాని, డిగ్రీ కళాశాలకు గానీ బిల్డింగులు ఇప్పటి వరకు లేవు. మెట్‌పల్లి ప్రాంతంలో ఇవాళ హైస్కూల్లోనే డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల నడుస్తోంది. అధ్యక్షా, అభివృద్ధి ఏది? మేం 9 ఏళ్ల పరిపాలనలో అభివృద్ధి చేశామని ఈ ప్రక్క వాళ్లు (ప్రధాన ప్రతిపక్షం) అంటారు. మేం అభివృద్ధి చేస్తున్నాం అని ఈ ప్రక్కవాళ్లు (అధికారపక్షం) అంటున్నారు. ఇవాళ మేం చేశాం, మేం చేశాం అని మూడు పార్టీల వాళ్లు అంటున్నారు. మరి అభివృద్ధి ఏదని అడుగుతున్నాను.

(బెల్)

ఒక్క నిమిషం అధ్యక్షా.. మాకు గత 5 సంవత్సరాల్లో ఒక్కసారి కూడా మాట్లాడే అవకాశం రాలేదు. కాబట్టి, ఇప్పుడన్నా మాట్లాడే అవకాశం ఇవ్వండి. ఇన్ని జరుగుతున్నా ఇంకా కలిసుందామని చెప్పడం మాత్రం అన్యాయం.

(బెల్)

ఒక్క నిమిషం ఇవ్వండి అధ్యక్షా.. ఇన్ని జరుగుతున్నా కూడా ఇంకా కలిసుందామని వీళ్లు మాట్లాడటం చాలా అన్యాయం. ఇలా తవ్వుకుంటూపోతే ఎన్నో బయటకు వస్తాయి. మాకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎన్నోవిధాలుగా మా నాయకుడికి కూడా చెబుతున్నాం. ఇంత జరుగుతున్నా కూడా ఇంకా మేం కలిసుంటాం అంటున్నారు. మీతో మాకు పొత్తు కలవదు. మేం విడిపోతామయ్యా.. మగడా.. నువ్వు ఏడ్చినా నీతో సంసారం చేసే పరిస్థితి లేదని, తెలంగాణాకు చెందిన నాలుగున్నర కోట్ల మంది ప్రజలు కోరుతుంటే, ఇవాళ మేం కలిసుంటామని చెప్పడం మాత్రం దుర్మార్గమని చెబుతున్నాను.

ఉ.11.30 బివిఆర్/కెఎంఎన్

అధ్యక్షా, ఒక్కటే చెబుతున్నాం. ఈ రెండు, మూడు పార్టీలకు చేతులెత్తి నమస్కారం చెబుతున్నాను. మనం విడిపోయి కలిసుందాం. విడిపోయి మా పరిపాలన మమ్మల్ని చేసుకోనివ్వండి. మా ప్రాజెక్టులను, రైతులను, విద్యార్థులను ఆదుకునే అవకాశమివ్వండని ఈ రోజున కోరుతున్నాం. 1100 మంది అమరవీరులకు ఆత్మశాంతి కలగాలంటే తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలి. ఈ రాష్ట్రంలో మేం ఏం చేసుకుంటామన్నది ప్రతిపక్ష పార్టీలకు గాని, అధికార పార్టీకి గాని అవసరం లేదు. మేం అన్నం తింటామా, మన్ను తింటామా అనే దాంతో వాళ్లకు సంబంధం లేదు. మా అవసరం కొద్ది మా రాష్ట్రాన్ని మేం ఏర్పాటు చేసుకుంటాము. ఈ అవకాశం మాకివ్వాలని మూడు పార్టీలనూ చేతులెత్తి కోరుకుంటున్నాను. ఆనాడు ఇదే సభలో డిసెంబరు, 9 వ తేదీనాడు ఏనాడైతే తెలంగాణా ప్రకటన వచ్చిందో, ఆనాడే చంద్రబాబు నాయుడు గారు అన్నారు. మీరు (అధికారపక్షాన్ని) తీర్మానం పెడతారా, లేక మేం పెట్టాలా అని అన్నారు. ఇదే ముఖ్యమంత్రి గారు ఎప్పుడు మేం సభను అడ్డుకున్నా వారేమన్నారు? తెలంగాణాపై తీర్మానం నా చేతుల్లో లేదు. తెలంగాణా ప్రకటన మీ చేతుల్లోనో, మా చేతుల్లోనో లేదు. కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని అన్నారు. ఇన్ని చెప్పిన వాళ్లు ఇవాళ యూ-టర్న్ తీసుకుని, రాజకీయ లబ్ధి కోసం, సీట్ల కోసం తెలంగాణా ప్రజానీకానికి అన్యాయం చేస్తున్నారు. నేను ఇవాళ ఒక్కటే చెబుతున్నాను. తెలంగాణాకు అన్ని విధాలా అన్యాయం జరిగింది. అందువల్ల, తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేసుకోవడం కోసం అందరూ సహకరించాలని కోరుకుంటూ, ఈ అవకాశమిచ్చిన మీకు మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుకుంటూ ముగిస్తున్నాను. జై తెలంగాణా.

శ్రీ సుద్దాల దేవయ్య, (చొప్పదండి): అధ్యక్షా, గౌరవనీయులు భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారు పంపిన, 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లుపై మాట్లాడేముందు తెలంగాణా రాష్ట్రం కోసం అశువులు బాసిన అమరవీరులకు నివాళులర్పిస్తూ, ఈ బిల్లుకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నాను. గత వారం రోజులుగా నేను జ్వరంతో బాధపడుతున్నా, ఈ బిల్లుపై మాట్లాడే అవకాశం కోల్పోతానేమోనన్న భయంతో ఈ రోజు నేను సమావేశాలకు రావడం జరిగింది. అందుకు మీరు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ బిల్లుకి పూర్తిగా మద్దతు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఊకె అబ్బయ్య, (ఇల్లెందు): ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉప సభాపతి గారికి నమస్కారం. అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ బిల్లుకి సంబంధించి నేను తెలంగాణాకు అనుకూలంగా ప్రతిపాదిస్తున్నాను. ఎందుకు అనుకూలంగా ప్రతిపాదిస్తున్నాను అనే దానికి కొన్ని విషయాలకు పరిమితమై మీ ముందు మాట్లాడటానికి ప్రయత్నం చేస్తానని తెలియజేస్తున్నాను. ఎన్నో సంవత్సరాలు, ఎన్నో రోజుల నుండి వివిధ ఉద్యమాలు అంటే జై ఆంధ్రా, జై తెలంగాణా, ముల్కీ నాన్‌ముల్కీ ఉద్యమాలు నడిచాయి. చరిత్రలో ఇవన్నీ ఉన్నాయి. ఇందులో భాగంగా 1969లో హైదరాబాదులో తెలంగాణా కావాలని విద్యార్థులు ఉద్యమం చేస్తున్న సందర్భంగా, రైల్వే స్టేషన్ దగ్గర మా ఖమ్మం జిల్లాలోని గార్ల ప్రాంతానికి చెందిన రవీంద్రనాథ్ జైన్ అనే విద్యార్థి చనిపోవడం జరిగింది. అట్లాగే, రామటెంకి శ్రీకాంత్ అనే విద్యార్థి కూడా ఈ మధ్యకాలంలో చనిపోవడం జరిగింది.

ఇది ఎందుకు చెబుతున్నానంటే – సంపద అనేది అన్ని ప్రాంతాల్లో ఒకేచోట కేంద్రీకరించి ఉండదనే విషయం మనకందరికీ తెలుసు. నీరు ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి ప్రవహిస్తుంది. అట్లాగే, మినరల్స్ కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమౌతాయి. సారవంతమైన భూమి కూడా కొన్ని ప్రాంతాలకే ఉంటుంది. అట్లాగే, ఈ రాయలసీమ, తెలంగాణా, ఆంధ్రా ప్రాంతాల మధ్య అసమానతలున్న మాట వాస్తవం. ఇది మనం కావాలని చేసిన పరిస్థితి కాదు. భౌగోళిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, అంతరాల వల్ల విభేదాలు వచ్చి, అక్కడ అభివృద్ధిని సాధించలేకపోవడం వల్ల వచ్చిన ఉద్యమాలని అర్థం చేసుకోవాల్సిందిగా సభకు విజ్ఞప్తి చేస్తున్నాను.

అందులో భాగంగానే ఆనాటి నుండి ఈనాటి వరకు కూడా మనం గమనంలోకి తీసుకున్నట్లయితే, ఇవాళ తెలంగాణా ప్రాంతంలో అదిలాబాద్ గాని, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు ప్రాంతాల్లో అపారమైన బొగ్గు గనులున్న మాట వాస్తవం. మన రాష్ట్రంలో అధిక శాతం 50 బొగ్గు గనులుంటే, అందులో 22 బొగ్గు గనులు షెడ్యూలు ప్రాంతంలో ఉండి, 46 శాతం దాకా ఉత్పత్తిని సాధించిన పరిస్థితి ఉంది. ఈ ఉత్పత్తిలో ఎంత శాతం రాయల్టీ వస్తుందో గమనించినట్లయితే, 1999 నుండి 2010 వరకు జీ.ఓ.ఎం.ఎస్.నెం.49 ప్రకారం రాయల్టీ సుమారుగా రూ.460 కోట్లు రావాల్సి ఉంది. కార్మిక వర్గం ఒకప్పుడు 1,65,000 మంది వరకున్నా, ఇప్పుడు 1,17,000 వరకే పరిమితమయ్యారు. భూగర్భంలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి చేసిన సందర్భంగా మనకు రూ.460 కోట్ల రాయల్టీ రావాల్సిన సందర్భంలో, ఈ షెడ్యూలు ప్రాంతంలో ఉన్న ఎస్‌సిసిఎల్‌లో రూ.1,842 కోట్ల ఉత్పత్తిని సాధించడం జరిగింది. కానీ, అక్కడున్న వారి భూములను తీసుకోవడం, అక్కడున్న వారికి భూసేకరణకు సంబంధించిన పరిహారమివ్వని పరిస్థితి ఉంది.

ఉదాహరణకు తీసుకుంటే సత్తుపల్లిలో భూములు కోల్పోయిన రైతాంగానికి 3 లక్షల నుండి 4 లక్షల రూపాయల వరకు పరిహారమివ్వడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఈ రోజు కేంద్ర ప్రభుత్వ కొత్త భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన వారికి 6 లక్షల నుండి 12 లక్షల రూపాయల వరకు పరిహారమివ్వాలని ఉంది. కోల్ ఇండియాలో కూడా సిఆర్ఎస్ పాలసీ ఉంది. కానీ, సింగరేణిలో సిఆర్ఎస్ పాలసీ లేదు. అందువల్లనే బెల్లంపల్లి, మందమర్రి, మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఓసిలో కూడా భూములు ఇచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే, ఇతర ప్రాంతాల్లో భూములకు ఎక్కువ రేట్లు ఇచ్చి, షెడ్యూలు ఏరియాల్లో మాత్రం తక్కువ రేట్లు ఇస్తున్నారు. అంటే రూ.1,25,000/-లు గానీ, పట్టాదారుల భూములకు రూ.2,75,000/-లు గానీ ఇస్తున్నారు. ఇది చాలా విచారకరమైన విషయమని తెలియజేస్తున్నాను.

(బెల్)

అధ్యక్షా, అట్లాగే జీ.ఓ.ఎం.ఎస్.నెం.49 ఉంది. వేరే ప్రాంతాలకు, షెడ్యూల్ ప్రాంతాలకు మధ్య తేడా ఉంది. దాన్ని కొంత వివరించడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. దయచేసి రెండు, మూడు నిమిషాల సమయం ఇవ్వండి. నేను ఎవ్వర్నీ తిట్టే ప్రయత్నం చేయను. తిట్టినా కూడా వచ్చేదేమీ లేదు. ఎట్లాగో సౌమ్యంగా విడిపోవాలనుకుంటున్నాం. వాళ్లకున్న ఇబ్బందులు వాళ్లకున్నాయి. కేంద్ర ప్రభుత్వం వాళ్లిచ్చిన అమెండ్‌మెంట్స్‌ని సానుకూలంగా పరిశీలించి, వాళ్లకేమున్నా ఇబ్బందులుంటే

వాటిని తొలగించే ప్రయత్నం చేయమని సభాముఖంగా తెలియజేస్తున్నాను. జీ.ఓ.ఎం.ఎస్.నెం.49ని షెడ్యూలు ప్రాంతాల్లో ఏపీజెన్కో వారు అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సింగరేణి వాళ్లు గానీ, బిపిఎల్ వాళ్లు గాని చేయరు. ఇతర ప్రాజెక్టుల్లో చేయడానికి సహకరించి ముందుకు రావడం లేదు. ఈ జీ.ఓ.ఎం.ఎస్.నెం.49 ప్రకారం నాలుగవ తరగతి ఉద్యోగాల నుండి ఇతర ఉద్యోగాల వరకు 100 శాతం ఉద్యోగాలు అక్కడ భూములు కోల్పోయిన వారికివ్వాలని ఉంది. అట్లాగే కోల్ ఇండియా పాలసీ ప్రకారం ఇతర ప్రాంతాల్లో రెండెకరాల భూమిని కోల్పోతే, వాళ్లకు ఉద్యోగాలు చేసే పిల్లవాళ్లు లేక, నైపుణ్యం లేకపోతే ఖచ్చితంగా వాళ్లకు నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని చెబుతున్నారు. అటువంటివి కూడా చేయలేని పరిస్థితి కనపడుతోంది. అధ్యక్షా, మొన్నటి రోజున ఒక పెద్ద సంఘటన కూడా జరిగింది.

(బెల్)

ఒక్క నిమిషం సార్. ఇక్కడ గిరిజన శాఖ మంత్రివర్యులున్నారు. ఈ చట్టాలన్నీ అమలు జరుగుతున్నాయా? 5వ షెడ్యూలు ఉంది, 1/70 యాక్టు ఉంది, భూ బదలాయింపు చట్టం, ప్రాంతాల వ్యయం గురించి, రుణ విమోచన చట్టం ఉన్నది. ఇటువంటి చట్టాలన్నింటిని గిరిజన మంత్రిగా ఉండి ఏ మేరకు వాటిని అమలు చేయగలిగారు? మీకందరికీ తెలుసు షెడ్యూలు ప్రాంతాల్లో బస్సులు లేవు, రోడ్డు సౌకర్యాలు లేవు. ఎటువంటి సౌకర్యాలు లేవని మీకు తెలుసు. హాస్పిటల్ సౌకర్యాలు కూడా అందలేని పరిస్థితిలో ఉన్నారని మనకందరికీ తెలుసు. అటువంటి పరిస్థితిలో వివక్షతకు దారి తీస్తోంది. అలాంటప్పుడు రకరకాల ఉద్యమాలు వస్తున్నాయి. అవి ప్రజాస్వామ్య పద్ధతుల్లో రావచ్చు. రైతుల్లో రావచ్చు. విద్యార్థుల్లో కూడా రావచ్చు. ఈ క్రమంలో విసుగు చెందిన విద్యార్థులు ఉద్యమాల్లో చేరి, పక్కదారి పట్టే పరిస్థితులు మన రాష్ట్రంలో వస్తున్న సందర్భంలో, అన్ని ప్రాంతాలను సమానంగా చూసే బాధ్యత తీసుకోవాల్సిన అవసరమున్నది.

ఇక చివరిగా ఒక విషయం చెబుతాను. మా ప్రాంతంలో బయ్యారం గనులున్నాయి. 50 సంవత్సరాల నుండి నిన్న మొన్నటి వరకూ కూడా బయ్యారంలో ఉన్న సంపదని, ఈ తెలంగాణా ప్రజానీకానికి చెందవలసిన సంపదని కొల్లగొట్టిన ఘనులు ఇక్కడ కూడా ఉన్నారు. ఆ విషయం మనకందరికీ తెలుసు. అటువంటి పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ తరఫున నారా చంద్రబాబు నాయుడు గారు ఈ సంపద దేశానికి చెందాలనే ఉద్దేశ్యంతో, గతంలో ఓబుళాపురం కావొచ్చు, బయ్యారంలో ఉన్న గనుల విషయంలో కావొచ్చు, తప్పనిసరిగా ఉద్యమం చేయాలని భావించారు. అలా భావించి తెలుగుదేశం పార్టీ నాయకుల్ని, రాజ్యసభ సభ్యుల్ని, ఎమ్మెల్యేలను 90 మంది వరకు ఢిల్లీకి తీసుకువెళ్లి, మూడు రోజుల పాటు వర్షం వస్తున్నా లెక్కచేయక, ఆ ప్రాంతంలో ఇతర పార్టీల వారు రాళ్లూ, రప్పలు వేసి ప్రదర్శనని నిలువరించినా గానీ, అక్కడ పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం వల్ల, బేణీ ప్రసాద్ వర్మ దీనికి అనుకూలంగా నిర్ణయాన్ని పంపించడం జరిగింది.

ఉ.11.40 RSS/MAR

కానీ ఇప్పటివరకు దాని మీద నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారు, అది సరైన విధానం కాదు. తెలంగాణా ప్రాంతంలో ఖమ్మం జిల్లాలో ఇల్లెందులో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాలనేది

ప్రధానమైన నినాదం. ఇటువంటి సమస్యలు ఎక్కువగా ఉండటం వలన ఉద్యమాలకు దారితీస్తుంది. అందువల్ల తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమనేది మా ఆశయం. అట్లాగే ఆంధ్రా సోదరులకు వాళ్ల న్యాయమైన కోర్కెలు ఏవైనా ఉంటే తక్షణమే మీరు తీర్చడానికి ప్రయత్నం చేస్తారని ఆశిస్తూ ఈ అవకాశమిచ్చిన మీకు మరొకసారి కృతజ్ఞతలను తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ వి.సునీతాలక్ష్మారెడ్డి (మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి) :అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు-2013 పైన జరుగుతున్న చర్చలో నాకు మాట్లాడే అవకాశం కల్పించిన సభాపతిగా మీకు, గౌరవ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును నేను సమర్థిస్తూ స్వాగతిస్తున్నాను. 60 సంవత్సరాల తెలంగాణా ప్రజల కల సాకారం చేసే ఈ బిల్లుని మన రాష్ట్ర అసెంబ్లీకి పంపించిన గౌరవ రాష్ట్రపతి గారికి మా హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఈ బిల్లు పైన మాట్లాడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ముందుగా తెలంగాణా ఉద్యమంలో ఆత్మబలిదానాలను చేసుకున్న తెలంగాణా ముద్దు బిడ్డలకు, అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి త్యాగఫలితమే ఈ తెలంగాణా అని తెలియజేస్తూ వారి తల్లిదండ్రులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇది ఎన్నో ఏళ్ల కల, ఎన్నో ఏళ్ల పోరాటం, ఎన్నో ఉద్యమాలు, మరెన్నో ఆందోళనలు కొన్ని వందల మంది అమర వీరుల త్యాగాలు, కష్టాలు, కన్నీళ్లు, టిఆర్ గ్యాసులు, లాఠీ దెబ్బలు, రబ్బర్ బుల్లెట్లు, ఛీత్కారాలు, ఇచడింపులు ఏదైతేనేమి వెయ్యి కళ్లతో, వెయ్యి ఆశలతో ఎదురు చూసిన తెలంగాణా స్వప్నం సాకారమైయ్యింది. నాలుగున్నర కోట్ల మంది తెలంగాణా ప్రజల యొక్క లక్ష్యం ఈరోజు నెరవేరిందని తెలియజేస్తున్నాను.

ఈ ఉద్యమంలో ఉద్యోగులు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు, పల్లె నుండి ఢిల్లీ వరకు అహోరాత్రులు శ్రమించి తెలంగాణా ఉద్యమంలో పాల్గొనడం జరిగింది. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ గారు ఏదైతే శాంతియుత మార్గంలో అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించారో, ఈ నాడు తెలంగాణా ప్రజలు కూడా వారి బాటలో నడుస్తూ శాంతియుతమైన మార్గంలోనే ఈ తెలంగాణా రాష్ట్రాన్ని సాధించగలిగారు. తెలంగాణా అంశమనేది 60 సంవత్సరాల పోరాటమని అందరికీ తెలిసిందే, కీలకమైన ఈ అంశం మీద సున్నితమైన ఈ అంశం మీద నిర్ణయం తీసుకోవాలంటే 60 సంవత్సరాల్లో ఎవరికీ సాధ్యం కాలేదు. మరి అటువంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని, చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కేవలం శ్రీమతి సోనియా గాంధీ గారు తీసుకున్నారు. వారికి నర్సాపూర్ శాసన సభ్యురాలిగా రాష్ట్ర మంత్రిగా నిలబడే అవకాశం కల్పించిన నా నర్సాపూర్ నియోజక వర్గం ప్రజలు, మెదక్ జిల్లాతో పాటు యావత్ తెలంగాణా ప్రజలు కూడా అండగా నిలబడతారని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

2000వ సంవత్సరంలో ఆనాడు డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు సిఎల్పి నాయకుడిగా ఉన్నప్పుడు 41 మంది కాంగ్రెస్ శాసన సభ్యులం తెలంగాణా కావాలని ఒక లేఖను ఇవ్వడం

జరిగింది. అందులో ఒక శాసన సభ్యురాలిని నేను అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆ రోజు తెలంగాణా రాష్ట్రం కావాలని బీజం వేసింది కాంగ్రెస్ పార్టీ అయితే, ఈ రోజు తెలంగాణాను ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తూన్నాను. ఈ 13 సంవత్సరాల కాలంలో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. తెలంగాణా ఉద్యమం తీవ్రమై ముందుకు సాగడం జరిగింది. ఈ 13 సంవత్సరాల కాలంలో ఎన్నో ఇబ్బందులను మేము ఎదుర్కోవడం జరిగింది. అటు ఉద్యమకారుల నుండి విద్యార్థుల నుండి, స్థానిక ప్రజల నుండి, ఇతర పార్టీల నుండి, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని నిరసనలు ఎదుర్కొన్నా ప్రజల ఆకాంక్షలను గౌరవించాము. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఈ ఉద్యమంలో పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీ పైన శ్రీమతి సోనియా గారి మీద ఉన్న నమ్మకం విశ్వాసంతో తెలంగాణా ఇచ్చేది మేమే తెచ్చేది మేమే అని చెబుతూ ప్రజలతో మమేకం కావడం జరిగింది.

అంతర్గతంగా మా పార్టీలో ఎన్నో విధాలుగా మేము ప్రయత్నం చేయడం ద్వారా వాళ్లను మెప్పిస్తామనే ఒక గొప్ప నమ్మకంతో మేము ముందుకు వెళ్లడం జరిగింది. ఈ రోజు అందరి సహకారంతో తెలంగాణాను సాధించుకోగలిగామని తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మేమందరం కూడా అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా దానికి కట్టుబడి ఉండాలని అనుకోవడం జరిగింది. ఈ రోజున కాంగ్రెస్ పార్టీ శ్రీమతి సోనియా గాంధీ గారి నాయకత్వంలో తెలంగాణాకు అనుకూలంగా తీసుకున్న ఈ నిర్ణయానికి ఖచ్చితంగా కట్టుబడిగా ఉండాలని నా సోదరసోదరీమణులను కోరుకుంటున్నాను. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు మీరందరూ సహకరించాలని నేను కోరుతున్నాను. తెలంగాణాను ఇవ్వడమంటే సీమాంధ్ర ప్రాంతానికి అన్యాయం చేయమని కాదు, అన్యాయానికి గురైన తెలంగాణా ప్రాంతానికి న్యాయం చేయమనే మేము అడుగుతున్నాము. సమైక్య రాష్ట్రంలో ఇరు ప్రాంతాల వారికి సమన్యాయం జరగాలని మాట్లాడిన నా సీమాంధ్ర సోదరులందరూ కూడా తెలుగుతల్లి ఆత్మగౌరవానికి భంగం కలిగిందని సమన్యాయం జరగలేదని చెప్పడం జరుగుతోంది. సమైక్య రాష్ట్రంలో ఇరు ప్రాంతాల వారికి న్యాయం జరుగుతుందని, తెలుగు తల్లి ఆత్మగౌరవాన్ని పెంచాలని మేము కూడా అనుకున్నాము. కానీ ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే పెద్ద మనుషుల ఒప్పందం గానీ ముల్కీ విధానం గానీ ప్రాంతీయ కమిటీలు గానీ, సిక్స్ పాయింట్ ఫార్ములా గానీ, 610 జీఓ గానీ ఇవన్నీ కూడా ఉల్లంఘనలకు గురికావడం జరిగింది.

తెలంగాణా ప్రజలకు అన్యాయం జరిగింది, తెలంగాణా ప్రజల ఆత్మ గౌరవం దెబ్బతింటూ వచ్చింది, సమన్యాయం జరగకపోగా అన్యాయం జరిగింది కాబట్టే ఈరోజున తెలంగాణా ఉద్యమం ఉవ్వెత్తునలేవడతో ఎంతో మంది ప్రాణాలను బలిగొనడం జరిగిందని తెలియజేస్తున్నాను. తెలంగాణా రాష్ట్రం వస్తే తెలంగాణా ప్రాంత ప్రజలకు నష్టం వస్తుందని, విడిపోతే పడిపోతామని, తెలంగాణా రాష్ట్రం వస్తే ఇరిగేషన్ ప్రాజక్టులు ఉండవు, నీళ్లుండవు, కరెంటు ఉండదని కొందరు మాట్లాడుతున్నారు. ఏదైనా సరే నష్టమైనా కష్టమైన మా రాష్ట్రమే మాకు ప్రధానం, మా ప్రజల ఆకాంక్షే మాకు ముఖ్యమని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు రాజ్యాంగానికి విరుద్ధమని కొందరు అంటున్నారు. ఒకప్పుడు మన దేశంలో 14 రాష్ట్రాలు ఉండేవి. 14 రాష్ట్రాలను 28 రాష్ట్రాలు చేసినప్పుడు రాజ్యాంగ విరుద్ధం జరగనిది, తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే ఏ విధంగా రాజ్యాంగ విరుద్ధమౌతుందని నేను అడుగుతున్నాను. తెలుగు జాతిని చీల్చారు తెలుగు భాషకు ద్రోహం చేశారని కొందరు గౌరవ సభ్యులు మాట్లాడుతున్నారు. తెలంగాణా రాష్ట్రం కావాలనుకునే ప్రజలు కూడా తెలుగువారే అనే మాటను గుర్తుంచుకోవాని మనవిచేస్తున్నాను. తెలుగు మాట్లాడే ప్రజలుగా రెండు రాష్ట్రాల్లో గర్వంగా ఉందాం, ప్రాంతాల వారీగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు జాతిగా ఒకటిగా ఉందామని ఈ సందర్భంగా నేను కోరుతున్నాను.

తెలంగాణా ఉద్యమం తీవ్రమైన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఏమి పట్టించుకోవడం లేదు, ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని అన్ని పార్టీలు కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయడం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకొని ఆ నిర్ణయం పైన అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతనే తెలంగాణాకు అనుకూలమైన నిర్ణయాన్ని తీసుకున్న మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు, ఎవరిని అడిగి ఈ నిర్ణయం తీసుకున్నారు, ఎవరికీ తెలియకుండానే నిర్ణయాన్ని తీసుకున్నారని మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసే విధానం సరికాదని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ఒక పద్ధతి ప్రకారంగా ఒక ఆలోచనతో ప్రణాకాబద్ధంగా తెలంగాణా విషయంలో ముందుకు వెళ్లిందని చెప్పడానికి కొన్ని విషయాలను మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

ఉ. 11.50 KV/RSS

2000 సంవత్సరంలో 41 మంది తెలంగాణ కాంగ్రెస్ శాసన సభ్యులం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుతూ ఒక రెప్రజెంటేషన్ ఇచ్చాము. 2004 సంవత్సరంలో శ్రీమతి సోనియాగాంధీ గారి నాయకత్వంలో కరీంనగర్ బహిరంగ సభలో తెలంగాణకు అనుకూలమని వారు ప్రకటించారు. యూపీఏ కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం జరిగింది. పార్లమెంటు ఉభయసభలలో ప్రధానమంత్రి గారి ప్రసంగంలో తెలంగాణ అంశం మాట్లాడారు. ప్రధాన మంత్రి గారి ప్రెస్‌మీట్‌లో తెలంగాణ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తెలంగాణ గురించి ప్రణబ్ ముఖర్జీ కమిటీని వేశారు. 2008 సంవత్సరంలో మళ్లీ ఎన్నికల సమయంలో శ్రీమతి సోనియా గాంధీ గారు హాజరైన బహిరంగ సభలో తెలంగాణకు అనుకూలమైన నిర్ణయం తొందరలోనే తీసుకుంటామని చెప్పారు. తేదీ. 29, నవంబర్, 2009న కె. చంద్రశేఖర్‌రావు గారు 14(F) రద్దు కోసం నిరాహార దీక్ష చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించి అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోమని చెప్పడం జరిగింది.

శ్రీ టి. హరీశ్‌రావు (మైకు లేకుండా) : అధ్యక్షా, కె.చంద్రశేఖర్‌రావు గారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసమే నిరాహార దీక్ష చేశారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

శ్రీమతి వి. సునీతా లక్ష్మారెడ్డిః ఏది ఏమైనప్పటికీ అది కూడా తెలంగాణలో అంతర్భాగమే. కె.చంద్రశేఖర్‌రావు గారు నిరాహార దీక్ష చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించి అన్ని పార్టీల నిర్ణయాలను తీసుకోమని చెప్పారు. అప్పుడు అందులో భాగంగా అన్ని పార్టీలు తెలంగాణకు అనుకూలమని చెప్పారు.

అదే విధంగా, తేది.07.డిసెంబర్, 2009న రోశయ్య గారు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తేది.09.డిసెంబర్,2009న కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం గారు తెలంగాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. తెలంగాణకు అనుకూలంగా ప్రకటన వచ్చిన తరువాత సీమాంధ్రలో జరిగిన ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని తేది.23,డిసెంబర్,2009లో అందరి ప్రజల సలహాలు అవసరమిని భావించి తేది. 05.01.2010న అఖిళపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి తీసుకున్న నిర్ణయాల ప్రకారం శ్రీకృష్ణ కమిటీని వేశారు.

మన రాష్ట్రంలో శ్రీకృష్ణ కమిటీ పర్యటించి అందరి అభిప్రాయాలను తీసుకున్న తరువాత ఏడు ఆప్షన్‌లనిచ్చింది. దాంట్లో కూడా తెలంగాణకు ఒక ప్రత్యేక రాష్ట్రం అవసరమని ఉన్నదనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఆ తరువాత మళ్లీ ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే మన రాష్ట్రానికి చెందిన అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణకు అనుకూలమని లిఖితపూర్వకంగా లేఖలు సమర్పించాయి. ఒక సి.పి.ఎం పార్టీ మాత్రం సమైక్యాంధ్రకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల మనోభావాలను గౌరవిస్తాం, తెలంగాణ ఏర్పాటు కోరడం న్యాయమైన పోరాటమని చెప్పి ఇప్పుడు ఆయా పార్టీలు మాట మార్చడమే కాకుండా ఈరోజు కాంగ్రెస్ పార్టీని నిందిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ విషయానికొస్తే 2008 సంవత్సరంలో తన పార్టీలోని మూడు ప్రాంతాలకు చెందిన శాసనసభ్యులతో ఒక కమిటీ వేసుకొని ఆ కమిటీలో తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఒక తీర్మానాన్ని చేసి ఆ తీర్మానాన్ని ప్రణబ్ ముఖర్జీ కమిటీకి పంపిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అదే విధంగా రోశయ్య గారు ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశంలో కూడా తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఏర్పాటుకు అనుకూలమని చంద్రబాబునాయుడు గారు అవసరమైతే అసెంబ్లీలో తీర్మానం పెట్టండి, మేం దానికి సపోర్టు చేస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.

తెలుగుదేశం పార్టీ 2009 ఎన్నికలలో టి.ఆర్.ఎస్.పార్టీతో పొత్తు పెట్టుకొని రాజకీయ లబ్ది పొందిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. కేంద్ర హోం శాఖ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కూడా తెలంగాణ ఏర్పాటుకు అనుకూలమని లేఖ ఇచ్చిన మాట వాస్తం కాదా? కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన మరుసటిరోజే చంద్రబాబునాయుడు గారు ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి దాంట్లో తెలంగాణ ఏర్పాటును తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తున్నది, సీమాంధ్ర

అభివృద్ధి  కోసం రూ.5 లక్షల కోట్లు  ప్యాకేజీ ఇవ్వాలని అడిగిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.  ఇన్ని సార్లు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలమని లేఖలిచ్చి, ప్రెస్‌మీట్లు పెట్టి ఈరోజు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని చీల్చిందని విమర్శించడం సరైన పద్ధతి కాదు.

ఇక వై.ఎస్.ఆర్.సి.పి స్టాండ్ ఏమిటో వారికే అర్థం కాదు.  ఎందుకంటే ఒకసారేమో ఓటింగ్ నిర్వహించాలంటారు, ఇంకొకసారేమో సమైక్య తీర్మానం పెట్టాలంటారు. వారికి అవకాశమొచ్చినప్పుడల్లా మైకు తీసుకొని వారికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడి ఇష్టం వచ్చినట్లుగా సభ నుంచి వెళ్లిపోతున్నారు.  పరకాల ఎన్నికల సమయంలో మేం తెలంగాణకు అనుకూలమని చెప్పిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను.  కేవలం రాజకీయ లబ్ధి కోసం ఈ విధంగా వెనుదిరగడం మంచిది కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

భారతీయ జనతా పార్టీ కూడా తెలంగాణకు అనుకూలమని చెబుతున్నది. అనులకూలమని చెప్పిన తరువాత కూడా ఒకవైపు రెండు రాష్ట్రాలని చెప్పి మూడు రాష్ట్రాలనిచ్చినప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకివ్వలేరని అడుగుతున్నాను.  టి.డి.పి ఇవ్వొద్దన్నది కాబట్టి మేం ఇవ్వలేదని చెబుతున్నారు.  ఇప్పటికీ మీరు తెలంగాణకు అనుకూలంగా మాట్లాడుతున్నా బి.జె.పి కేంద్ర అధినాయకత్వం 2014 ఎన్నికల తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తుందని మళ్లీ తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఎటువంటి షరతులు లేకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనుకూలమైన  నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి మీరంతా తెలంగాణ ఏర్పాటుకు సహకరించాలని కోరుతున్నాను.  కాంగ్రెస్ పార్టీ హమేషా ధోఖా దియా అంటూ నాగం జనార్ధన్ రెడ్డి గారు మాట్లాడారు.  తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లుతుందని తెలిసినా, మరొక పక్కన కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది ఉన్నదని తెలిసినా కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నదని తెలియజేస్తున్నాను.

మెజారిటీ ప్రజల బాగు కోసం పరిపాలనలో భాగంగా ఎన్నో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది.  ఆ నిర్ణయాలకు అనుగుణంగానే ఈరోజు శ్రీమతి సోనియాగాంధీ గారి నాయకత్వంలో తెలంగాణకు అనుకూలమైన నిర్ణయం  తీసుకున్న సందర్భంలో వారిని వ్యక్తిగతంగా విమర్శించడం సరికాదని తెలియజేస్తున్నాను.  సోనియాగాంధీ గారిని అనవసరంగా శాపనార్థాలు పెడుతున్నారు. బొమ్మలకు పెళ్లిళ్లు చేస్తున్నారు, ఘోరీలు కడుతున్నారు.  ఫోటోలను తగులబెడుతున్నారు. వారి వారి ఇష్టం వచ్చిన రీతిలో ప్రవర్తించడం  మంచి పద్ధతి కాదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

రాజకీయాలలో కొన్ని పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది, అటువంటప్పుడు నిరసనలు తెలిపే హక్కు మీకుంటుంది. కానీ వ్యక్తిగతంగా కించపరిచినట్లు చేయడం చాలా ధారుణం, నేను జరిగిన సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను.

అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీల అభిప్రాయాలను అడిగినప్పుడు శ్రీమతి సోనియాగాంధీ గారు కేంద్ర ప్రభుత్వంలో ఉండే యూపీఏ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులను కలిసి వారితో చర్చించిన తరువాతనే కాంగ్రెస్ పార్టీ CWCలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం తీసుకోవడం జరిగింది. CWCలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగానే ఈ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీ కేవలం రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రిని చేయడానికే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఇప్పుడు అంటున్నారు.

మ.12.00 mms/rss.

ఈరోజున వీళ్లందరూ ఏం మాట్లాడుతున్నారు? శ్రీ రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రిని చేయడానికే రాష్ట్ర విభజనకు సంబంధించిన నిర్ణయంతీసుకున్నారనే విధంగా, రాష్ట్రాన్ని చీల్చారనే విధంగా ఆరోపిస్తున్నారు.

అధ్యక్షా, ఈరోజున రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రిగా చేయాలంటే రాష్ట్రం రెండుగా విడిపోవాల్సిన అవసరం లేదు. రెండు పర్యాయాలు ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలొచ్చినా కూడా ఆ అవకాశాన్ని శ్రీమతి సోనియా గాంధీ గారు ఉపయోగించుకోలేదు. రాష్ట్ర విభజన అంశంపైన ప్రజలకు సంబంధించి పార్టీ పరంగా మేం నిర్ణయిం తీసుకోవడం జరిగిందని అధిష్టానం స్పష్టం చేసింది. 2004 మరియు 2009వ సంవత్సరంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షతన యు.పి.ఏ. ప్రభుత్వం ఏర్పడ్డాక మేమంతా కూడా శ్రీమతి సోనియా గాంధీ గారిని ప్రధాన మంత్రి పదవిని స్వీకరించమని కోరినప్పటికీ పార్టీ పదవే ముఖ్యమని, కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు కొరకే మేం పనిచేస్తామని వారు చెప్పడం జరిగింది. ఆనాడు ప్రధాన మంత్రి పదవిని త్యజించిన త్యాగశీలి శ్రీమతి సోనియా గాంధీ గారని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆనాడు శ్రీమతి సోనియా గాంధీ గారు కానీ, శ్రీ రాహుల్ గాంధీ గారు కానీ ప్రధాన మంత్రి పదవి కావాలనుకుంటే ఏది అడ్డు కాదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని అధిష్టానం మరియు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తరువాత మేమంతా వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు శ్రీమతి సోనియా గాంధీ గారి వద్దకు వెళ్లిన సందర్భంగా వారు "thanks from one side, curse from the other side" అని చెప్పి, మీరు నాకు ఒక మాట ఇవ్వాలని కోరడం జరిగింది. రాష్ట్ర విభజన పైన సీమాంధ్ర నాయకులు కొంత బాధలో ఉన్నారు, వారిని మీరు విమర్శించొద్దు, మనస్సు నొప్పిపడే విధంగా మాట్లాడొద్దనే మాట మా దగ్గర శ్రీమతి సోనియా గాంధీ గారు తీసుకోవడం జరిగిందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అంటే ఒకవైపు సీమాంధ్రులు గాంధీ కుటుంబాన్ని విమర్శిస్తున్నప్పటికీ గాంధీ కుటుంబ వారసత్వం పొందిన శ్రీమతి సోనియా గాంధీ గారు "ఒక చెంప

మీద కొడితే మరో చెంప చూపించే" పద్ధతిలో ఉన్నారు. ఈరోజున సీమాంధ్రులు తిడుతున్నప్పటికీ, తెలంగాణ నాయకులు సీమాంధ్రులను ఏం అనవద్దని, వారు బాధతో ఉన్నారని చెబుతూ మాతో మాటను శ్రీమతి సోనియా గాంధీ గారని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఎల్లప్పుడు మేం మీకు విధేయులుగా ఉంటామనే మాటను శ్రీమతి సోనియా గాంధీ గారితో చెబితే, నాకు విధేయులుగా ఉండనవసరం లేదు, కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉండమని వారు చెప్పడం జరిగింది. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన వారు, దేశ ప్రజల హృదయాల్లో అదే విధంగా రాష్ట్రంలోని మెజారిటీ ప్రజల యొక్క ఆకాంక్షలను నెరవేర్చడానికే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును శ్రీమతి సోనియా గాంధీ గారు తన భుజస్కంధాలపైన వేసుకోవడం జరిగింది. ఈరోజు శ్రీమతి సోనియా గాంధీ గారు యు.పి.ఏ. చైర్ పర్సన్‌గా ప్రజలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అమలుపరుస్తున్నారు. ఆ విషయం గురించి ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరముంది. Right to Education Act, Right to Information Act, ఉపాధి హామి పథకం, ఆహార భద్రత చట్టం మరియు లోక్‌పాల్ బిల్లు వంటి ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని కూడా శ్రీమతి సోనియా గాంధీ గారు ప్రధానమైన అంశంగా భావించి నిర్ణయం తీసుకోవడం జరిగింది. కానీ కొంత మంది అనుకున్నట్టుగా ఓట్ల కోసం, సీట్ల కోసం కాదని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ముసాయిదా బిల్లులో కొన్ని సవరణలు చేయాల్సిన అవసరముంది. ఒక పర్యాయం క్యాబినెట్ తీర్మానం పాస్ చేసిన తరువాత రాష్ట్ర విభజన పైన నిర్ణయం తీసుకునేందుకు "గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను" ఏర్పాటు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ఇన్‌ఛార్జు గానీ చాలా సందర్భంలో అధిష్టానంతో, కేంద్ర ప్రభుత్వంతో చెప్పడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది, ఆ అంశంలో వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని చెబుతూ, సీమాంధ్ర ప్రాంతానికి కావల్సిన మౌళిక సదుపాయాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాలివ్వమని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కోరినప్పుడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా ఈరోజున సీమాంధ్రులు కాంగ్రెస్ పార్టీని నిందించడం ఏ మాత్రం సమంజసంగా లేదు. భారత రాష్ట్రపతి గారు ముసాయిదా బిల్లును ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు పంపించి సభ్యుల అభిప్రాయాలు మాత్రమే చెప్పమని కోరుతూ పంపించడం జరిగింది. కానీ అందుకు విరుద్ధంగా చాలా మంది సభ్యులు ముసాయిదా బిల్లుపైన ఓటింగ్ అడుగుతున్నారు. గతంలో మనం ఈ శాసనసభ నందు ఎన్నో చట్టాలను చేయడం జరిగింది. ఈ శాసనసభకు సంబంధించి ఏవైతే చట్టాలుంటాయో వాటిపైన ఓటింగ్ చేసే అధికారం ఉంటుంది గానీ ప్రస్తుతం మన ముందున్న ముసాయిదా బిల్లు పార్లమెంట్ ప్రాపర్టీ. బిలు అనేది పార్లమెంట్ ప్రాపర్టీ కాబట్టి, శాసనసభలో బిల్లుపైన ఓటింగ్ నిర్వహించే అధికారం లేదు. కానీ అవసరమని ఎవరైనా భావిస్తే బిల్లుకు సంబంధించిన సవరణలను పంపవచ్చని నేను కోరుతున్నాను. ఈ సందర్భంగా బిల్లులోని కొన్ని అంశాలను ప్రధానంగా ప్రస్తావించుకోవాల్సిన అవసరముందని నేను భావిస్తున్నాను. ఇరు

ప్రాంతాలకు న్యాయం జరిగే విధంగా బిల్లులోని అంశాలను చర్చించుకుని తదుపరి బిల్లును పార్లమెంట్‌కు పంపినట్లైతే, పార్లమెంట్‌లో ప్రస్తావించిన అంశాలకు తగిన పరిష్కారం లభించే విధంగా సభ్యులందరూ దోహదపడాలని నేను భావిస్తున్నాను.

అధ్యక్షా, తెలంగాణలో చాలా వెనుకబడిన ప్రాంతాలున్నాయి. ఇరిగేషన్ సదుపాయం లేని జిల్లాలు, on going projects తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆయా ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చి సత్వరమే పూర్తిచేయాలని నేను కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మెదక్ జిల్లా లాంటి నా సొంత జిల్లాలో సాగునీటి సౌకర్యం అసలే లేదు. రైతులు బోర్లపైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కాబట్టే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించమని మీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా వంద టి.యం.సి.ల నీరు ఉపయోగించుకునే విధంగాను, 16 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజానీకానికి తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసే విధంగా తెలంగాణ ప్రాంతంలోని ఏడు జిల్లాలకు సంబంధించిన ప్రాజెక్టు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కాబట్టి ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించమని నేను కోరుతున్నాను.

అదే విధంగా విద్య, వైద్య, ఉద్యోగ రంగాల్లో తెలంగాణ ప్రాంత జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగాక ప్రజానీకానికి అవసరమైన మెరుగైన విద్యకు ప్రాధాన్యం కల్పిస్తూ, జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నాను. అదే విధంగా వైద్య సదుపాయాలు మెరుగుపడేందుకు ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల మరియు ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాను. తెలంగాణ ప్రాంతంలో రాష్ట్ర ఏర్పాటు జరిగితే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని భావిస్తున్న నిరుద్యోగ యువతకు కొత్త కొత్త ప్రాజెక్టులను ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా శ్రద్ధ వహించాలని నేను మీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వెనుకబడిన ప్రాంతాలు ఇటు తెలంగాణలో అటు సీమాంధ్ర ప్రాంతాల్లో ఉన్నాయి కాబట్టి సీమాంధ్ర ప్రాంతానికి కూడా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, విద్యుత్ విషయమై కొందరు సభలో మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ దొరకదనే విధంగా, కరెంటు ఉండదనే విధంగా సభ్యులు మాట్లాడుతున్నారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఆస్తులను ఏ విధంగా పంపిణీ చేస్తారో అదే విధంగా ఆస్తిగా ఉన్న విద్యుత్‌ను కూడా కొత్తగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రానికి పంపిణీ చేయాల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా ప్రస్తుతం ఇరిగేషన్‌కు సంబంధించి బోర్ వేయడం జరిగిందే సెపరేట్‌గా విద్యుత్‌కు కూడా ఒక బోర్‌ను ఏర్పాటు చేసి కరెంటు సక్రమంగా అందే విధంగా కొత్తగా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. తెలంగాణ ప్రాంతంలో రైతులందరూ

బోర్లపైన, కరెంటు పైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఆ అంశంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ముసాయిదా బిల్లుకు సంబంధించి కొన్ని సవరణలను కూడా మేం లిఖితపూర్వకంగా మీకు పంపడం జరిగింది. ప్రధానంగా పది సంవత్సరాలు ఉమ్మడి రాజధాని విషయంలో గానీ, హై కోర్టు విషయంలో గానీ, ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలోగానీ, నేటివిటీ పైన, పెన్షన్స్ పైన గానీ సవరణలను లిఖిత పూర్వకంగా తమరికి సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన శాఖామాత్యులు శ్రీ పి.బాలరాజు గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ, సమైక్యవాదాన్ని సభలో వినిపిస్తూ, మంత్రి గారి జిల్లాకు ముఖ్యంగా గిరిజన ప్రాంతానికి కావల్సిన సమస్యలను సభలో ప్రస్తావించడం జరిగింది. అందుకు గాను మంత్రిగారైన శ్రీ బాలరాజు గారిని అభినందిస్తూ, వారి స్ఫూర్తితో చాలా మంది సీమాంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులున్నారనే విషయాన్ని నేను స్పష్టం చేస్తున్నాను.

అధ్యక్షా, సీమాంధ్ర నాయకుల అభిప్రాయాలను మేం గౌరవిస్తాం. మీ ప్రాంత సమస్యలను మేం గుర్తిస్తాం. ఎందుకంటే మేం దాదాపు అరవై సంవత్సరాలుగా ఆ సమస్యలపై పోరాటం చేసి, వాటిని చవిచూసినవారమే. సీమాంధ్ర పోరాటం కేవలం ఆరు మాసాల పోరాటమైతే తెలంగాణ పోరాటం అరవై యేళ్ల పోరాటమనే విషయాన్ని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రజలను తప్పుదోవ పట్టించొద్దని నేను సీమాంధ్ర నాయకులను కోరుతున్నాను. ఎందుకంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నుంచి వెలువడిన తరువాత మూడు రోజుల వరకు ఏ నాయకుడు కూడా ఆ విషయం పైన మాట్లాడలేదు. కానీ ఎప్పుడైతే ఎ.పి.ఎన్.జి.వోస్. అధ్యక్షుడు బయటకు రావడం జరిగిందో, ప్రజలను తప్పుదోవ పట్టించడం జరిగిందో అప్పుడే సీమాంధ్ర నాయకులు సమైక్యాంధ్ర గురించి ప్రస్తావించడం జరిగిందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఈనాడు నాయకులు మాట్లాడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో వెయ్యి,పదహేను వందల మంది మా ప్రాంత విద్యార్థులు, యువకులు బలిదానాలకు పాల్పడి మరణిస్తే కూడా ఏనాడు మేం ఎక్స్‌గ్రేషియా గురించి మాట్లాడలేదు. కానీ ఈరోజు ఎ.పి.ఎన్.జి.వోస్. అధ్యక్షుడేమి మాట్లాడుతున్నాడు? సీమాంధ్రలో ఉద్యమం కారణంగా చనిపోయిన వారికి మేం ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పడం చూస్తుంటే వారు ఏ విధంగా ప్రజలను, ఉద్యోగులను, విద్యార్థులను రెచ్చగొట్టి ప్రాణ త్యాగం చేసుకోమనే విధంగా మాట్లాడటాన్ని ఒకసారి తలచుకోవల్సిందిగా నేను మీ ద్వారా సీమాంధ్ర నాయకులను కోరుతున్నాను. ఇది మంచి పద్ధతి కాదని కూడా తెలియజేస్తున్నాను. సీమాంధ్ర ఉద్యమం నాయకుల చేతిలో కూడా లేదు. ఆ ఉద్యమం ఉద్యోగస్థుల చేతుల్లో ఉందనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, చాలా మంది సభ్యులు నిన్న సభలో ఒక విషయం గురించి ప్రస్తావించడం జరిగింది. టి.ఆర్.యస్. పార్టీ నాయకుడి వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం

అంగీకరించిందనే విధంగా మాట్లాడారు. కానీ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ  తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు  ఉద్యమించిన పార్టీ. ఆ పార్టీని మేం గౌరవిస్తాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆ పార్టీది చాలా కీలకమైన పాత్ర ఉందనే విషయాన్ని మేం అంగీకరిస్తున్నాం. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన అంశం నాలుగున్నర కోట్ల ప్రజానీకానికి సంబంధించినదనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

మ.12.10 RSS / KKR.

నాలుగున్నర కోట్ల తెలంగాణా ప్రజలకు సంబంధించిన విషయంగా గుర్తించాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా ఆవేశంగా మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితులలో నేను ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం జరిగిందని మాట్లాడడం  చాలా బాధ కలిగింది. రాష్ట్రానికి సంబంధించి మా శాఖ నుండి గానీ ఇతరత్రా శాఖల నుండి అయితేనేమి ఇందిరమ్మ అభయహస్తం, స్త్రీనిధి, వడ్డీలేని రుణాలు, వికలాంగుల సంక్షేమం, ఎస్.సీ, ఎస్టీ, ఉపప్రణాళిక తీసుకురావడం వంటి మంచి మంచి పథకాలు చేపట్టారు. ఇన్ని మంచి పథకాలు తీసుకొచ్చిన మన ముఖ్యమంత్రి గారు నేను ముఖ్యమంత్రిగా ఉండడం దురదృష్టకరం అని చెప్పిన మాటలు మా అందరికి బాధ కలిగించిందని ఈ సందర్భంగా మీకు తెలియజేసుకుంటున్నాను.

(బెల్)

ముగిస్తున్నాను అధ్యక్షా. ఈ తెలంగాణా పోరాటంలో ఎంతోమంది ఆత్మ బలిదానాలు చేసుకొని వారి తల్లిదండ్రుల కడుపుకోతను మిగల్చడం జరిగింది. అమరులైన త్యాగధనుల యెక్క త్యాగ ఫలితమే ఈ తెలంగాణా అని తెలియజేస్తున్నాను. తెలంగాణా ప్రజలు కుల, మత, పార్టీలకు అతీతంగా వారు చేసిన ఉద్యమస్ఫూర్తి ఫలితమే ఈ తెలంగాణా అని తెలియజేస్తున్నాను.  ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు సహాయనిరాకరణ, సకల జనుల సమ్మె, మిలీనియం మార్చ్ ఫలితమే ఈ తెలంగాణ. తెలంగాణ ప్రాంత కేంద్రమంత్రులు, తెలంగాణలోని అన్నీ ప్రాంతాల ఎంపీలు, ఎం.ఎల్ఏలు, ఎంఎల్సీలు కలసి పార్టీలకు అతీతంగా చేసిన కృషి ఫలితమే ఈ తెలంగాణ.  తెలంగాణా ప్రజల ఐక్యతే ఈ తెలంగాణ. తెలంగాణా ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి పట్ల ఉన్న నమ్మక ఫలితమే ఈ తెలంగాణ అని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

(బెల్)

తెలంగాణ ను ఇచ్చిన సోనియా గాంధీ గారిని, మన్మోహన్ సింగ్ గారికి, రాహుల్ గాంధీ గారికి సి.డబ్ల్యు.సీ మెంబర్స్‌తో కలసిఎన్నో సార్లు మేము ఢిల్లీ వెళ్లిన సందర్భంలో మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా తెలంగాణా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అధ్యక్షా జై తెలంగాణ మే నా నినాదం. తెలంగాణా నిర్మాణమే మా విధానం అని తెలయజేస్తున్నాను. నా తెలంగాణా కోటి రతనాల వీణ అని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః గల్లా అరుణకుమారి గారూ..

శ్రీమతి గల్లా అరుణ కుమారి ః అధ్యక్షా....

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులు మాకు మాట్లాడే అవకాశం ఇవ్వండి సార్, ఒక్క నిమిషం మాకు మాట్లాడే అవకాశం ఇవ్వండి సార్ అంటూ పోడియం వద్దకు వచ్చారు.)

MR.DEPUTY SPEAKER: What is this? Why are you coming into the well? Go back to your seats.

శ్రీమతి గల్లా అరుణకుమారి (చంద్రగిరి) ః అధ్యక్షా, ఒక మహిళా సభ్యురాలిగా మాట్లాడుతున్నాను, దయచేసి సహకరించమని చెప్పండి అధ్యక్షా.

(TDP Members started raising slogans, 'We want justice. We want justice.")

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః అరుణ కుమారి గారూ, ఒక్కనిమిషం.... ముద్దుకృష్ణమ నాయుడు గారూ మాట్లాడండి.

( ఈ దశలో పోడియం వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యులు వెనుదిరిగి వారి వారిస్థానాలకు వచ్చి చేరారు )

శ్రీ జి.ముద్దుకృష్ణమ నాయుడు (నగరి) ః అధ్యక్షా, మేము మాట్లడే సందర్భంలో ఈ విభజనకు కారణం శ్రీమతి సోనియా గాంధీ గారు అంటే మమ్మల్ని సోనియా గాంధీ పేరు చెప్పవద్దు అని మీరు అంటారు. కానీ మంత్రిగారు మాట్లాడిన సందర్భంలో పదే పదే వారి ప్రసంగం అంతా కూడా సోనియా గాంధీని పొగడటం తప్ప మరొకటి లేదు. అటువైపు నుండి తెలంగాణా వారు సోనియా గాంధీ గారిని పొగుడుకోవచ్చు కానీ సీమాంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులు వారి ప్రజల మనోభావాలను వ్యక్తం చేసే సందర్భంలో తప్పుపడుతున్నారు. ౚౚ • గురించి గానీ, ఓట్ల కోసం, నోట్ల కోసం ఆమె చేసిన రాజకీయం గురించి కానీ చెప్పాల్సిన అవసరం మాకు ఉందా, లేదా చెప్పండి?

(ఈ సందర్భంలో అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం )

మీరు సోనియా గాంధీ గారి పేరును ఉచ్ఛరించడానికి వారికి అనుమతి ఇచ్చినప్పుడు, మేము కూడా ఆమె పేరును ఉచ్ఛరించాలి. I am on a point of order Sir, ఈరాష్ట్ర విభజనకు సంబంధించిన అంశంలో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ గారు Constituent Assembly లో కూడా కేంద్రప్రభుత్వానికి ఆ రోజున సర్వాధికారాలు ఇవ్వలేదు.

• Expunged as ordered by the Chair

ఎందుకంటే కేంద్ర ప్రభుత్వంలో రక రకాల పార్టీలు కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వంలో వేరే పార్టీల వాళ్లు ఉండవచ్చు, కానీ రాష్ట్రాల విభజన సందర్భంలోకానీ, హద్దులు మార్చే సందర్భంలో కానీ, లేదా హద్దులు మార్చి మరొకరి హద్దుల్లోపల కలిపేందుకు ఆర్టికల్3 లో సుస్పష్టంగా చెప్పారు. ఏం చెప్పారంటే... "To alter the name of any State provided that no Bill for the purpose shall be introduced in either House of the Parliament except on the recommendation of the President and unless vide the proposal contained in the Bill affects the area, boundaries or the name of any of the State, the Bill has been referred by the President to the Legislature of the State for expressing its views" అని చెప్పారు. Legislature అని చెప్పేది ఏమిటో Article 168లో clear గా చెప్పడం జరిగింది. ఎక్కడైతే రెండు సభలు ఉంటాయో ఆ రెండు సభలు మరియు గవర్నర్ అని చెప్పడం జరిగింది. వ్యూస్ అనేది ఎలా తీసుకుంటారనేది Article 189 లో చెప్పడం జరిగింది. ఓటింగ్ ద్వారానే తీసుకుంటారని చెప్పడం జరిగింది. కానీ దీనిపై స్పందన లేదు. రాష్ట్రపతి గారు మనకు డిసెంబర్ 12వ తేదిన పంపిన లేఖలో 23వ తేది లోపల సభ్యుల వ్యూస్‌ను సేకరించి పంపించమని చెప్పారు. మరలా 23.1.14 పంపించిన Extension Orderలో "AND whereas in pursuance of the proviso to article 3 of the Constitution of India, the Bill entitled "The Andhra Pradesh Reorganisation Bill, 2013" has been referred to the Legislature of the State of Andhra Pradesh for expressing its views thereon by the 23rd of January, 2014;

AND whereas the Government of Andhra Pradesh considers it expedient to seek further period till the 20th day of February, 2014 for the Legislature of the State of Andhra Pradesh for expressing its views on "The Andhra Pradesh Reorganization Bill, 2013;

NOW, therefore in pursuance of the proviso to article 3 of the Constitution of India and after considering the need for expeditious introduction of the Bill in Parliament, I hereby allow a further period till the 30th day of January, 2014 to the Legislature of the State of Andhra Pradesh for expressing its views on "The Andhra Pradesh Reorganization Bill, 2013."

ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గారు కూడా elected Member సార్.

(బెల్ )

మన శాసనసభకు డైరెక్షన్ ఇచ్చేటప్పుడు మన హక్కుల్ని హరించే విధంగా మన సభ్యులు ఫిబ్రవరి నెల 20వ తేది వరకు గడువు అడిగితే ఒక వారం మాత్రమే ఇస్తూ....

( ఈ దశలో మైకు కట్ చేయబడింది.)

(ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీ సభ్యులు మైకు ఇవ్వాల్సిందిగా కోరుతూ పోడియం వద్దకు వచ్చారు. " We want Justice " " We want Justice " అంటూ నినాదాలు చేయసాగారు. )

మ.12.20 JNV/KU

(TDP Members rushed to the podium saying the slogans “We want justice” We want justice”)

MR. DEPUTY SPEAKER: Chief Whip garu, please make an appeal to the Members

శ్రీ గండ్రవెంకట రమణారెడ్డి : అధ్యక్షా, మీద్వారా తెలుగుదేశం పార్టీ సభ్యులను కోరుతున్నాను, ఇంతకు ముందు మంత్రి గారు మాట్లాడిన దానిపై తమ అభిప్రాయాలను వారికి కేటాయించిన సమయంలో మాత్రమే వెల్లడి చేయాలని కోరుతున్నాను. గౌరవ సభ్యులైన గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు రాష్ట్రపతి గారి దగ్గర నుంచి వచ్చిన ఉత్తర్వుల పట్ల, లేఖ పట్ల అభ్యంతరం వ్యక్తం చేయడం, సభా నాయకుడు సమయం అడిగిన సందర్భంలో రాష్ట్రపతి గారు వారం రోజుల పాటు సమయం ఇచ్చి రాష్ట్రపతి గారు పంపిన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం గురించి మాట్లాడడాన్ని తప్పు పట్టడం కూడా సరియైనది కాదు.

ఈ తెలంగాణా ప్రాంతంలోని ప్రజలు రోజు అసెంబ్లీలో జరిగే ప్రొసీజర్‌ను చాలా ఆసక్తిగా చూస్తున్నారు. ఎప్పుడు ఈ రాష్ట్ర విభజన బిల్లు ఈ శాసన సభనుంచి పార్లమెంటుకు వెళ్తుంది. దీని కార్యాచరణ ఎప్పుడు పూర్తవుతుందనే ఆసక్తితో ఉన్నారు కాబట్టి నిజంగా తెలుగు దేశం పార్టీ సభ్యులు వారి అభిప్రాయాలు చెప్పడానికి, వారికుండే హక్కులను గురించి చెప్పడానికి సమయం తీసుకోవాలే తప్ప, ఈ రకంగా సభను సజావుగా జరగనీయకుండా అడ్డుకోవడం సరైనది కాదు. ఇది వారి పార్టీ యొక్క డొల్లతనానికి నిదర్శనం. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన మా మిత్రులు కూడా వారికి అపీల్ చేసి... దయాకర రెడ్డి గారు గానీ, చంద్రశేఖర రెడ్డి గారు గానీ, దయాకర్ రావు గారు గానీ వారంత ఎక్కడున్నారు? వారు తమ సభ్యులకు నచ్చజెప్పి దయచేసి సభను సజావుగా నడపాల్సిందిగా కోరుతున్నాను. గడువు పొడిగింపు ద్వారా వచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా లింగారెడ్డి గారి వంటి పెద్దలంతా కూడా సహకరించాల్సిందిగా మీ ద్వారా అప్పీల్ చేస్తున్నాను అధ్యక్షా.

MR.DEPUTY SPEAKER: Yes, Muddukrishnama Naidu, ask you members.

శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు : సార్, కేంద్ర ప్రభుత్వంలో ఏ పార్టీ వారైనా అధికారంలో ఉండచ్చు, ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్లు రాష్ట్రాలను విభజించకూడదు, కాబట్టి రాజ్యాంగబద్ధమైన, రాజ్యాంగానికి సేఫ్‌గార్డ్ చేసే రాష్ట్రపతి చేతుల్లోనే ఈ అంశాన్ని పెట్టాలి. కనుక ఆయన అనుమతి లేనిదే, అదీ శాసన సభ యొక్క మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాతనే ఈ బిల్లును పార్లమెంటుకు పంపరాదనే విషయం ఆర్టికల్ 3లో బ్రహ్మాండంగా ఉంది. లెజిస్లేచర్ అంటే ఏమిటో ఆర్టికల్ 168లో చెప్పడం జరిగింది, ఓటింగ్ ఎలా జరగాలో ఆర్టికల్ 189లో చెప్పడం జరిగింది. ఇంత క్లియర్‌గా చెప్పినా కూడా, రాష్ట్రపతిగా ఎన్నికైన వ్యక్తి ఇంతకు ముందు ఏ పార్టీలో అయినా ఉండచ్చు, కానీ రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత పార్టీ రహితంగా వ్యవహరించాలి. ఆయన పెద్ద మనిషిగా రాజ్యాంగాన్ని పరిరక్షించే వ్యక్తిగా ఉండాలే తప్ప ఒక పార్టీకి అఫిలియేటెడ్‌గా

ఉండకూడదు. ఈ లెటర్ 23వ తేది వెళ్లినట్లుంది, దాన్ని కొట్టి వేసి 22వ వెళ్లినట్లుగా రాశారు. షిండే గారు వెళ్లి ఆయనను ఇన్‌ఫ్లూయన్స్ చేసిన తరువాత...

(ఈ దశలో కొంతమంది తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులు హరీష్ రావు మరి కొంత మంది సభ్యులు, అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన గండ్ర వెంకట రమణారెడ్డి ఇతర సభ్యులు లేచి అభ్యంతర తెలిపారు)

ఆ సమాచారం కూడా టి.విల్లో వచ్చింది. రాష్ట్రపతి గారు కూడా పక్షపాతం చూపించారు. అందువల్ల నేను హర్ట్ అయ్యాను. మనం ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాని ఎన్నుకున్నాం. He is responsible person. అసెంబ్లీ హక్కులను హరించే విధంగా ఆయన తొందరపడి ఈ బిల్లును పెట్టాలా అని దురుద్దేశంతో చేయమని చెప్పడం తప్పు.

బీహార్‌లో గానీ, ఉత్తరప్రదేశ్‌లో గానీ కొన్ని చోట్ల 30 రోజుల సమయాన్ని ఇచ్చారు, మరి కొన్ని చోట్ల 15 రోజుల సమయం ఇచ్చారు, మనకు సమయం చాలదని, 43 గంటలు చర్చించకున్నా 65 మంది సభ్యులు మాట్లాడారు, మనకు ఒక వారం మాత్రమే సమయం ఇవ్వడం అన్యాయం. ఇంకా 30 రోజుల సమయం కావాలని తీర్మానం మేము పాస్ చేస్తున్నాం. గతంలో ఇటువంటి డైరెక్షన్ ఇవ్వడమనేది ఎప్పుడు కూడా జరగలేదు. గత అసెంబ్లీ యొక్క తీర్మానం లేకుండా బిల్లు వచ్చింది. ఆ విషయంలో తప్పు చేశారు, అసెంబ్లీ తీర్మానం లేకుండా బిల్లు పంపారు. ఈ బిల్లు ఏకపక్షంగా ఉంది, ఈ బిల్లు ఐదున్నరకోట్ల సీమాంధ్ర ప్రజల గొంతు కోసే విధంగా ఉంది. ఇది చాలా అన్యాయం అక్రమం, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అందరికి సబంధించిన వ్యక్తిగా ఉండాల్సింది, ఈ విధంగా సోనియాగాంధీ గారి ఆదేశాల మేరకు ఒక ప్రాంతం యొక్క అభిప్రాయాలన్ని ఆమె ఓట్ల కోసం, సీట్ల కోసం రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకోవాలనే తపన తప్ప ఇంకొటి కాదు, ఇది పూర్తిగా అసెంబ్లీ యొక్క హక్కులను హరించే విధంగా ఉంది.

దీని పైన అసెంబ్లీలో రాష్ట్రపతిగారికి ఒక తీర్మానం పంపించాలి. 30 రోజులు సమయం కావాలని మనం కూడా ఒక తీర్మానం చేద్దాం, మన అసెంబ్లీని కించపరచవద్దు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కించపరచొద్దు, మొత్తం సెటప్‌ని కాల రాయద్దు. సర్కారియా కమిషన్ చెప్పిన విషయం కానీ, వాంఛూ కమిటి చెప్పిన విషయం కానీ, రాజ్యాంగ స్ఫూర్తిని, సెటప్‌ని కానీ అగౌరపరిచే విధంగా రాష్ట్రపతి, షిండే మాటలు విని, సోనియాగాంధీ గారి మాటలు విని తొందరగా బిల్లును పార్లమెంటులో పెట్టాలనే ఆ ప్రొవిజన్ పెట్టడం అన్యాయం, అక్రమం, ఈ రాష్ట్రాన్ని కించపరచడం, సీమాంధ్ర ప్రజల్ని కించపరచడాన్ని నేను పూర్తిగా ఖండిస్తున్నాను.

(ఈ దశలో డెప్యూటి స్పీకరు గారు మైకు ఆఫ్ చేయగా, కొంతమంది తెలుగుదేశం పార్టీ సభ్యులు పోడియవద్దకు చేరారు.)

MR.DEPUTY SPEAKER: I am sorry Mr.Uma garu you are repeatedly sending your Members into the well. Please go back to your seats. Please go back. What is that you are asking? Please go back

శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాదరావు (గ్రామీణాభివృద్ధి, ఎన్ఆర్ఈజీఎస్ శాఖా మంత్రి) : అధ్యక్షా, గౌరవ సభ్యులు గాలిముద్దుకృష్ణమ నాయుడు గారికి సభా సమయం కావాలని ఉద్దేశ్యం ఉంటే.. ఒక ఫోరమ్‌లో లేక ఒక పద్ధతిలో మీ దృష్టికి కానీ లేదా ప్రభుత్వం దృష్టికి గానీ తీసుకురావచ్చు, దానికేమి అభ్యంతరం లేదు కానీ కేంద్ర హోమ్ మంత్రిగారికి ఏదో ఆపాదించడం, రాష్ట్రపతి గారికి ఆపాదించడం మంచిది కాదు, అది రాజ్యాంగ విరుద్ధం. అలాంటి, భాష వద్దు, అలాంటి ప్రతిపాదన వద్దు, టైమ్ కావాలంటే మీరు ఒక మోడ్‌లో రండి. ఇప్పుడు టైమ్ పెంచారు, ఎవరినడిగి పెంచారు? అందువల్ల మీరు ఒక పద్ధతిలో రావాలి గానీ, కేంద్ర హోమ్ మంత్రిగారిని కానీ, రాష్ట్రపతి గారిని కానీ, రాజ్యాంగాన్ని అవమానిస్తూ మాట్లాడటమనేది పద్ధతి కాదు.

రాజ్యాంగంలోని ప్రొసీజర్ ప్రకారం టైమ్ కోరండి, టైమ్ కోరడానికి ఏ ప్రొసీజర్ ఉందో దాన్ని అడాప్ట్ చేయండి, అంతేగానీ కేంద్ర హోమ్ మంత్రిగారిని కానీ, రాష్ట్రపతి గారిని కానీ, రాజ్యాంగాన్ని అవమానిస్తూ మాట్లాడడము మంచి పద్ధతి కాదు, అది రాజ్యాంగానికి వ్యతిరేకము. టైమ్ కావాలంటే రిజల్యూషన్ మూవ్ చేయండి, ఇటువంటి పద్ధతులను వాడొద్దని, రాజ్యాంగ వ్యతిరేకంగా మాట్లాడొద్దని నేను పెద్దలను కోరుతున్నాను.

(ఈ దశలో పోడియవద్దకు చేరిన కొంతమంది తెలుగుదేశం పార్టీ సభ్యులు We want justice" We want justice" అని నినాదాలు చేయసాగారు)

శ్రీమతి వి. సునితా లక్ష్మారెడ్డి : అధ్యక్షా, సోనియాగాంధీ గారిని పొడుగుడుతున్నారని అంటున్నారు, అవును నేను చెపుతున్నాను, సోనియాగాంధీ గారిని పొడుగుడుతున్నామని ఈ సందర్భంలో గర్వంగా చెపుతున్నాను. ఎందుకంటే.. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్ల తెలంగాణా ప్రజలయొక్క ఆకాంక్షను నెరవేర్చింది కాబట్టి. ఓట్లకోసం, సీట్లకోసం కాదని నేను ఇంతకు ముందే చెప్పడం జరిగింది. ఓట్లకోసం, సీట్లకోసం చేసింది మీరు అవునా, కాదా అని నేను అడుగుతున్నాను. మీ చంద్రబాబు నాయుడు గారి లాగా మాటలు మార్చే పార్టీ కాంగ్రెస్ పార్టీది కాదు, అలాంటి నాయకత్వం మాది కాదని నేను తెలియజేస్తున్నాను.

2004లో తెలంగాణాకు అనుకూలంగా సోనియాగాంధీగారు నిర్ణయం తీసుకుంటే, ఈ రోజు వరకు కూడా దానికి కట్టుబడి తెలంగాణా ఇవ్వడం జరిగింది. అధ్యక్షా, మరి ఈ రోజు మా నాయకురాలి స్టాండ్, మా కాంగ్రెస్ పార్టీ స్టాండ్. మరి మీ స్టాండ్ ఏమిటని నేను చంద్రబాబు నాయుడు గారిని అడుగుతున్నాను. అసలు వారికి మాట్లాడే అవకాశం లేదు, ఎందుకంటే టైమ్ ఉన్నప్పుడు వృధా చేస్తూ అనవసరంగా పోడియం దగ్గరకు వస్తున్నారు, మరి ఇప్పుడేమో టైమ్ సరిపోదనిచెప్పి మరలా వృధా చేస్తున్నారు. ఆరోజు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ని వేసినప్పుడు వాళ్లు దాన్ని

ఉపయోగించుకోలేదు. ఇప్పుడు సమయం పొడిగించినా, పొడిగించకపోయినా రాష్ట్ర విభజన అనివార్యం. ఇప్పటికైనా ముఖ్యమైన సమస్యలపైన మీరు మాట్లాడండి, ఆలోచించండి, సమస్యల పరిష్కారం కనుగొనేవిధంగా మీరు ప్రయత్నించాలని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మీరు నిజంగా ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నారు, తెలంగాణా ప్రకటించిన మరునాడే చంద్రబాబునాయుడు గారు ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా కూడా మళ్లీ అక్కడ నుంచి మేము వ్యతిరేకం మాకు అధికారంలోకి వచ్చే అవకాశంలేదని, ఓట్ల కోసం, సీట్లకోసం డ్రామాలుతున్నది టిడిపి అని కూడా నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. లీగల్ ఇష్యూస్ గురించి మాట్లాడుతున్నారు అధ్యక్షా.

కేంద్ర హోమ్ మంత్రిగారిని కానీ, రాష్ట్రపతి గారిని కానీ నిందించడం సరికాదు. వారికి ఉన్నటువంటి పరిధిలో వారికి సమయం ఇవ్వడం జరిగింది. లీగల్ ఇష్యూస్ ఏమన్నా ఉంటే వాటిని కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అమూల్యమైన సమయాన్ని ఇప్పటికైనా సద్వినియోగం చేసుకోవాలని సభ్యులను కోరుతూ, మరొకసారి శ్రీమతి సోనియాగాంధీ గారికి ధన్యవాదాలు తెలి య జేస్తున్నాను, ఈ శాశ్వతమైన నిర్ణయం తీసుకున్నందున ఆమె చరిత్రలో మిగిలిపోతారని నేను తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 12.30 కె.యు./వై.ఎం.ఆర్.

MR. DEPUTY SPEAKER: Please make an appeal. హరీష్‌రావుగారూ మాట్లాడండి.

శ్రీ టి.హరీశ్ రావు, (సిద్ధిపేట): స్పీకర్ సర్, ఇవాళ నాలుగు కోట్ల ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ విధానం ఎలా కనపడుతుంది అంటే, సభ జరగ వద్దు అని, ఏదో ఒక కుంటిసాకుతో సభను అడ్డుకోవడానికి పోడియం వద్దకు వెళ్తున్నారు. దయచేసి నేను సీమాంధ్ర తెలుగుదేశం సభ్యులకి విజ్ఞప్తి చేస్తున్నాను, మీరు దయచేసి పోడియం నుంచి మీ సీట్లలోకి రండి. స్పీకర్ గారు మీ సభ్యునికి ఇప్పటికి రెండుసార్లు సమయం ఇచ్చారు. ఏదో ఒక రకంగా సభను వాయిదా వేయించాలనేదే మీ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. సభను జరగకుండా చూసే ప్రయత్నం చేస్తున్నారు. సభను జరగనివ్వకపోవడం అంటే తెలంగాణను అడ్డుకోవడమే అవుతుంది. తెలంగాణ బిల్లు మీద చర్చ జరగకుండా చేయడం అంటే తెలుగుదేశం పార్టీ తెలంగా ణను అడ్డుకుంటుంది అని తెలంగాణ ప్రజలు భావించాల్సి ఉంటుంది. దయచేసి మీకు సమయం ఇచ్చినప్పుడు మీరు మాట్లాడాలే తప్ప, మీరు ఈ రకంగా సభను అడ్డుకోవద్దు. పోడియం నుంచి మీ సీట్లలోకి రావాలని తెలుగుదేశం పార్టీ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పుడు extension of time ఇచ్చారు, extension of time మాట్లాడటానికి ఇచ్చారు కానీ, ఈ విధంగా సభను అడ్డుకోవడానికి కాదు. దయచేసి సభను అడ్డుకోవద్దు. 42 రోజులు సమయం ఇస్తే, దాదాపు 15 రోజులు సభ జరగనివ్వలేదు. రోజూ పోడియం వద్దకు వెళ్లి, అడ్డుకుని, సభను వాయిదా వేయించి, మళ్లీ మాకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. నిన్న జరిగిన

బి.ఎ.సి. సమావేశంలో కూడా మాకు సమయం సరిపోవటం లేదని, extension ఇవ్వాలని అన్నారు. ఇది సరైన విధానం కాదు. మీరిలా చేయడం ద్వారా మీ ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. మీకు extension రాదు. దయచేసి తెలుగుదేశం పార్టీ సభ్యులు పోడియం దగ్గర్నుంచి తమ సీట్ల లోకి రావాలి. తెలుగుదేశం పార్టీ పట్ల తెలంగాణ ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. తెలుగుదేశం పార్టీ తెలంగాణను అడ్డుకొంటుంది అని తెలంగాణ ప్రజలు భావించాల్సి వస్తోంది. ఇది పద్ధతి కాదు.

(పోడియం దగ్గరున్న సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ సభ్యులు we want justice అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: గోపాల కృష్ణా రెడ్డి గారు మాట్లాడండి. Please make an appeal.

శ్రీ బి.గోపాల కృష్ణా రెడ్డి (కాళహస్తి): అధ్యక్షా, మేం ఎవరినో object చేయడం కోసమో, obstruct చేయడం కోసమో ఇక్కడికి రావడం లేదు. ఒక్కో సభ్యునికి రెండు నిమిషాల సమయమే ఇచ్చి త్వరగా మాట్లాడమంటే, రెండు నిమిషాల్లో ఏం మాట్లాడ గలుగుతారు? సభ్యులు శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారు స్పష్టంగా చెప్పారు. అధ్యక్షులు శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారికి..

(ఈ సమయంలో శ్రీబి.గోపాల కృష్ణా రెడ్డి గారికి ఇచ్చిన మైకు కట్ చేయబడింది.)

MR.DEPUTY SPEAKER: There are many Members in the House to speak. Every Member will be given time to speak on the Bill. ఐదు నిమిషాల్లో పూర్తిచేసే వారందర్నీ ముందుగా మాట్లాడించాలని నిన్న జరిగిన బి.ఎ.సి. మీటింగ్‌లో చెప్పారు.

(పోడియం దగ్గరున్న సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ సభ్యులు we want justice అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: గోపాల కృష్ణా రెడ్డి గారు మాట్లాడండి.

శ్రీ బి.గోపాల కృష్ణా రెడ్డి: అధ్యక్షా, సభ సజావుగా జరగాలని మేము కూడా అనుకుంటాం. అవసరమైతే ఎంత రాత్రైనా వేచి ఉంటాం. ప్రతి సభ్యునికీ పరిమితి విధించకుండా సమయమివ్వండి. ఈ సభలో మాట్లాడే సమయంపై పరిమితి విధించడం సరైనది కాదు. అసెంబ్లీలో రెండు, మూడు నిమిషాలు సమయం ఇవ్వడానికి ఇదేమైనా కోటానా? ఇది సరైనది కాదు. అది చెప్పడానికే మేము పోడియం దగ్గరకు వస్తున్నాం.

MR.DEPUTY SPEAKER: Whoever wants to complete in Five minutes, give their names.

శ్రీ బి.గోపాల కృష్ణా రెడ్డి: రెండు నిమిషాలు మాత్రమే సమయం ఇస్తే మాట్లాడడానికి సరి పోదు సర్. ఆ వైపు వాళ్లకి అరగంట సమయం ఇస్తారు....

MR.DEPUTY SPEAKER: Please complete it.

(పోడియం దగ్గరున్న సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ సభ్యులు we want justice అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః దయాకర్ రెడ్డి గారూ మాట్లాడండి. Please make an appeal.

("నొక్కొద్దు, నొక్కొద్దు మా గొంతులు నొక్కొద్దు" అంటూ పోడియం దగ్గరున్న సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ సభ్యులు నినాదాలు చేయసాగారు)

శ్రీ కె.దయాకర్ రెడ్డి (మక్తల్)ః అధ్యక్షా, పోడియం దగ్గరున్న మా సోదర శాసనసభ్యుల్ని తమ సీట్లలోకి రావాలని కోరుతున్నాను. నిన్న మీరు బి.ఎ.సి. సమావేశంలో మాట్లాడిన మాట కరెక్ట్. ఈరోజు మాట్లాడే ప్రతీ ఒక్కరూ మూడు నిమిషాలు నుంచి ఐదు నిమిషాలు మించకుండా మాట్లాడాలని బి.ఎ.సి. మీటింగ్‌లో స్పష్టంగా చెప్పారు. కానీ ఎక్కడ తేడా వచ్చిందంటే, శ్రీమతి సోనియా గాంధీగారిని మెచ్చుకోవటానికి, మా పార్టీని తిట్టడానికి మంత్రిగారికి మీరు సమయం ఇచ్చారు. ఇక్కడ కాదు. ఈఈ• ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తిట్టమనండి. మా పార్టీని తిట్టటానికో, మా నాయకుడిని తిట్టటానికో వాళ్లకు మైకు ఇస్తే పరిస్థితి ఈ రకంగానే ఉంటుంది. వాళ్ళకి ఈఈ ప్రజాక్షేత్రంలో చెప్పుకోమనండి. దానికేం ఇబ్బంది లేదు. ప్రజలే జవాబు చెప్తారు. కానీ బి.ఎ.సి. నిర్ణయానికి భిన్నంగా మంత్రిగారికి ఒక రకంగా, మిగతా పార్టీలకు మరొక రకంగా చేయడం కరెక్టు కాదు. ఈ రోజు మాట్లాడిన ప్రతీ ఒక్కరికి కూడా మూడు నుంచి ఐదు నిమిషాల సమయమేనని మీరు చాలా స్పష్టంగా చెప్పారు. కానీ దానికి భిన్నంగా జరిగింది. తెలంగాణ వారు మంత్రులుగా ఉండి ఏ జిల్లాకు న్యాయం చేశారు? జిల్లాలకు రమ్మనండి చూపిస్తాం. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారినో, తెలుగుదేశం పార్టీనో తిట్టడం సరికాదు. వాళ్ల ముఖ్యమంత్రిగారిని, ఆయనతోపాటు తెలంగాణను వ్యతిరేకిస్తున్న కేబినెట్ మంత్రులను తిట్టుకోమనండి.

MR.DEPUTY SPEAKER: Please ask your Members to resume their seats.

("నొక్కొద్దు, నొక్కొద్దు మా గొంతులను నొక్కొద్దు", we want justice అని పోడియం దగ్గరున్న సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ సభ్యులు నినాదాలు చేయసాగారు)

MR.DEPUTY SPEAKER: Ask your Members to resume their seats. ముద్దు కృష్ణమ నాయుడు గారు మాట్లాడండి.

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు (నగరి)ః సర్, శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ శ్రీమతి సోనియాగాంధీ గారు 2004వ సంవత్సరం నుంచి మాట తప్పకుండా ఒకే మాట మీద ఉన్నారని అన్నారు సరే. 2004వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. రాష్ట్రంలో మంత్రుల్ని ఇచ్చారు, కేంద్రంలో మంత్రుల్ని ఇచ్చారు. కామన్ మినిమమ్

• Expunged as ordered by the Chair

ప్రోగ్రాంలో పెట్టారు. కానీ మీరు 2009వ సంవత్సరం వరకు ఏమైనా పట్టించుకున్నారా? ఐదు సంవత్సరాలు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలించింది ఎవరు? పదో సంవత్సరం వచ్చింది. మరి ఇంతవరకు ఎందుకు ఆగారు? 2009 డిసెంబరు 9 నాడు శ్రీ పి.చిదంబరం గారు తెలంగాణ ఇస్తున్నాం అని ప్రకటించి, దాని తరువాత డిసెంబరు 23న 'అన్ని పార్టీల్లోనూ చీలిక వచ్చింది, అన్ని పార్టీలు యు టర్న్ తీసుకున్నాయి. కాబట్టి ఈ తెలంగాణ ఏర్పాటును ఆపేస్తున్నాము' అని విత్‌డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి నెలలో శ్రీకృష్ణ కమిటీని వేశారు. కానీ, శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన రిక మెండేషన్‌ను తీసుకోలేదు ఎందుకు? ఇప్పుడు హర్రీబర్రీగా ఎన్నికల ముందు ఎందుకు పెట్టారు?

మ.12.40 KRR-GRV

2014వ సంవత్సరంలో ఎన్నికలు వస్తుంటే, మీరు గెలుస్తారో, గెలవరో తెలియకుండా, కేంద్రంలో మీ పార్టీ గెలిచే దిక్కు లేకుండా పోతే, అవినీతిలో కూరుకుపోతే, ఆ అవినీతిని కప్పి పుచ్చుకోవడం కోసం కేంద్రంలో, రాష్ట్రంలో తెలంగాణ బిల్లును అడ్డం పెట్టుకుని ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. కేంద్రంలో గానీ, రాష్ట్రంలో గాని మీ దోపిడీ కోసమే ఈ బిల్లు తెచ్చారు తప్ప, ఏమాత్రం కూడా ప్రజలను ఉద్ధరించడానికి కాదు. ఎందుకు ఈ బిల్లుని ఇంత హర్రీబర్రీగా పెట్టుకో వాలి? అన్ని రాష్ట్రాల్లో తీర్మానాలు వచ్చిన తర్వాతే బిల్లుల్ని ప్రవేశపెట్టారు. తీర్మానం లేకుండా ఒక్క ఆంధ్రప్రదేశ్ విషయంలో మాత్రమే ఈ విధంగా ఎందుకు చేయాల్సి వచ్చింది? పదేళ్లుగా ఈ అంశం మీ దృష్టిలో ఉంటే, ఈ విషయమై రాష్ట్ర అసెంబ్లీని ఎందుకు ఒప్పించలేదు? అందర్నీ మెప్పించి, ఆ తరువాత తీర్మానం తీసుకోవచ్చు కాదా? మీకు పది సంవత్సరాల సమయం ఉండింది. ఈ పది సంవత్సరాలలో మీరు ఈ రాష్ట్రంలో కూర్చుని, అందరితో మాట్లాడుకొని, అందర్నీ ఒప్పించి, రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసుకుని, బిల్లును తయారుచేసి పంపించి ఉండుంటే ఇటు వంటి పరిస్థితి వచ్చేది కాదు. కానీ మీరెవర్నీ సంప్రదించకుండా, ఏదో ఎస్.ఎం.ఎస్.లు .....

(ఈ సమయంలో శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారికి ఇచ్చిన మైకు కట్ చేయబడింది)

MR. SPEAKER: What for you are asking mike? ముద్దు కృష్ణమ నాయుడు గారు మీరు మైకు దేనికి అడిగారు? మీరు దేని గురించి మాట్లాడుతున్నారు? మీ పార్టీకి టైం ఇస్తాం. అప్పుడు మీరు చెప్పాలనుకున్నవన్నీ మీరు చెప్పండి. You are trying to bring pressure on the Chair.

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు: President of India ఆ క్లాజును పెట్టడం తప్పు. రాష్ట్ర ప్రభుత్వం 30 రోజుల సమయం అదనంగా కావాలని అడిగింది. లీడర్ ఆఫ్ ది హౌస్ 30 రోజులు సమయం కావాలని అడిగారు. కాబట్టి అసెంబ్లీలో 30 రోజుల సమయం కొరకు అసెంబ్లీలో ఓటింగ్ తీసుకోండి. President of India కి ఒక తీర్మానం చేసి పంపుదాం. ఎందుకు హర్రీ...బర్రీ.. రెండు నిమిషాలు, ఐదు నిమిషాలు మాట్లాడాల్సిన అవసరం ఏమొచ్చింది? అరగంట, గంట అని టైం లేకుండా మాట్లాడతాం. ఇది 8,000 కోట్ల ప్రజలకు సంబంధించిన అంశం.

ఇటు తెలంగాణ ప్రాంత సభ్యులు గాని, అటు సీమాంధ్ర ప్రాంత సభ్యులు గాని.... మనం సమయ పరిమితి లేకుండా చర్చిద్దాం. మాట్లాడే సమయానికి పరిమితిని విధించొద్దు. ఎంత సమయం మాట్లాడాలని నిర్ణయించేది బి.ఎ.సి. మీటింగ్ కాదు. సభ్యుల యొక్క హక్కులను బి.ఎ.సి. హరించలేదు. కాబట్టి ఒక నెల సమయం అడగటం కోసం సభలో ఓటింగ్ పెట్టండి. అడిగిన తర్వాత President of India సమయమెందుకు ఇవ్వరు? తప్పకుండా...

(ఈ దశలో మరలా శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు గారికి ఇచ్చిన మైకు కట్ చేయబడింది)

శ్రీ నల్లాల ఓదేలు (చెన్నూరు): నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు సభాపతి గారికి ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చించేందుకు నాకు ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

(ఈ సందర్భంలో శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు గారు మరియు ఇతర తెలుగుదేశం సభ్యులు తమకు మైకు ఇవ్వవలసిందిగా కోరసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ముద్దు కృష్ణమ నాయుడు గారూ మీరు కూర్చోండి. ఎస్. ఓదేలు గారూ ప్లీజ్ కంటిన్యూ...

శ్రీ నల్లాల ఓదేలు: అధ్యక్షా, అణగారిన, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుండి ఒక దళిత ఎం.ఎల్.ఏ.గా, చెన్నూరు నియోజకవర్గ ప్రజలు నన్ను ప్రజాప్రతినిధిగా ఎన్నుకొని పంపించినందుకు మా నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణను సులభతరం చేసే విధంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ను చేర్చిన చిన్న రాష్ట్రాల ప్రయుక్త డా.బి.ఆర్.అంబేద్కర్ గారిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. గత 60 సంవత్సరాలుగా తెలంగాణ పట్ల ఉన్నటువంటి వివక్షతను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తు చేసి, తెలంగాణ ఉద్యమంలోనికి ప్రజలకు తీసుకురావడానికి కృషి చేసిన వారు తెలంగాణ జాతి పిత ప్రొఫెసర్ జయశంకర్ గారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడో మారుమూల ఉన్న మన్నవరం గ్రామంలో నివసిస్తూ, పిల్లలకు నాలుగు అక్షరాలు నేర్పేటువంటి టీచర్‌ను నేను. శ్రీ జయశంకర్ గారి బోధనలకు ఆకర్షితుడనై, తెలంగాణ తల్లి బిడ్డగా నా కర్తవ్యం నెరవేర్చాలనుకున్నాను. తెలంగాణలో ఉన్నటువంటి నాలుగున్నర కోట్ల ప్రజలు, ఈ అసెంబ్లీలో ఏం జరుగుతోంది అని చూస్తూ ఉన్న తరుణంలో, ఈ టి-బిల్లుపై చర్చలో పాల్గొనే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేనొక సామాన్య కార్మికుడి కొడుకును. దళిత కుటుంబంలో పుట్టినటువంటి నాకు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు పార్టీ టికెట్టు ఇవ్వడంతో, ఆ ప్రాంతంలో ఉన్నటువంటి సింగరేణి కార్మికులు మరియు అన్ని వర్గాల ప్రజలు

గెలిపించి పంపడం జరిగింది. మా నాయకుడు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు దీక్షా పటిమలతో, ఉద్యమంలో ఎన్నో వ్యూహ ప్రతివ్యూహాలను ఎదుర్కొని తెలంగాణ ఉద్యమాన్ని విజయబాట వైపు నడిపించారు. ఆయన ప్రాణాలకు తెగించి చేసిన ఆమరణ నిరాహార దీక్షకు, అగ్నికి వాయువు తోడైనట్లుగా విద్యార్థి లోకం కదం కదిపి, గర్జించింది. పల్లెలు, గ్రామాలు, పట్టణాలు ఉద్యమాలకు వేదికలు అయ్యాయి. ఊరూరా ఊరేగింపులు జరిగాయి. సీమాంధ్ర నేతలు అన్నట్లుగా మాయ చేస్తేనో, మంత్రమేస్తేనో ఉద్యమాలు పుట్టవు. అణచివేత నుండి, అలజడి నుండి ఉద్యమం పుట్టుకొచ్చేది ఇటువంటి వివక్షతను ఎదుర్కొనేందుకే.

తెలంగాణలో వివక్ష ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలను రెండవ శ్రేణి పౌరులుగా చూడడం జరిగింది. సమానంగా చూడలేదు. నిధులు, నీళ్ళు, నియామకాలు మళ్ళించడం జరిగింది. ఇప్పటికే మా నాయకులు, పెద్దలు శ్రీ హరీష్ రావు గారు, శ్రీ కె.టి.ఆర్.గారు, శ్రీ ఈటెల రాజేందర్ గారు ఈ విషయాలు సభలో చెప్పారు. కాబట్టి, నేను ఈ విషయమై మాట్లాడకుండా వెనుకబడిన ప్రాంతమైన మా సింగరేణి గురించి తమకు చెప్పదలచుకున్నాను. మాది చెన్నూరు నియోజకవర్గం. మా నియోజకవర్గంలో ప్రాణహిత మరియు గోదావరి అనే రెండు జీవ నదులు పారుతున్నప్పటికీ, మా నియోజకవర్గ ప్రజలు త్రాగు నీటికి, సాగు నీటికి నోచుకోలేదు. మా నియోజకవర్గం మహారాష్ట్ర బార్డర్‌లో ఉంది. ఈ సమైక్య పాలనలో ఇప్పటికీ మా నియోజకవర్గంలో రోడ్డు లేదు, ఆరోగ్యం లేదు, విద్య లేదు, చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు లేనటువంటి పరిస్థితి ఏర్పడింది. గోదావరి నదీ తీరంలో మేట వేసిన చోట, ఇసుక తీసుకునేందుకు ఈ సీమాంధ్ర ప్రభుత్వమే పర్మిషన్ ఇచ్చింది. దాని వల్ల గోదావరీ పరీవాహక ప్రాంతం ఎండిపోయి, బోరు బావులు ఎండిపోయి పంటలు కూడా పండలేని పరిస్థితి ఏర్పడింది. ఖచ్చితంగా దానిని మాన్పించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

మా నాన్న గారు సింగరేణి కార్మికుడు. సింగరేణి గనిలో అధికారులు, ఫ్యాన్ల క్రింద పనిచేసే వారు సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వారు. గనుల లోపల ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసేది మాత్రం తెలంగాణ ప్రజలు. బొగ్గు గని అంటే మృత్యు కుహరం. ప్రకృతికి విరుద్ధంగా భూమి తల్లి కడుపులోకి పోయి రావడమే బొగ్గు గనిలోనికి వెళ్ళి బొగ్గు తీయడమంటే. సీమాంధ్ర వాళ్ళు ఫ్యాన్ల క్రింద ఉంటే, తెలంగాణ ప్రజలు బండ క్రింద పనిచేస్తున్నారు. అందుకోసమే ప్రత్యేత తెలంగాణ సాధించుకుంటేనే గానీ ఈ వివక్ష పోదని భావించి, మా నియోజకవర్గ ప్రజలందరూ ఈ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అందుకోసమే నేను ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నాను. సింగరేణి ప్రాంతంలో ఆనాడు 10వ తరగతి చదివిన ఆంధ్ర ప్రాంత వాసులకు క్లర్కుల పోస్టులు ఇచ్చారు. కానీ, ఆనాటి మా స్కూల్స్‌లో 7వ తరగతి వరకే చదువుకునే అవకాశం ఉంది. ఆ పరిస్థితిని అధిగమించడానికి మా స్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేసి 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం తెచ్చుకుంటే, సింగరేణీ క్లర్కుల కనీస అర్హతను ఇంటర్మీడియట్‌కు పెంచారు. ఈ విధంగా తెలంగాణ ప్రాంతం ఎంతో వివక్షకు గురి అవుతూ వచ్చింది.

మ.12.50 KRR-KSV

ఇంటర్మీడియట్ చదివి డిగ్రీకి వస్తే, డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ పరీక్షలు రాస్తే, పరీక్షా పత్రాలను లీక్ చేసి తిరిగి ఉద్యోగాలు వారికే వచ్చేటట్లు చేసుకుంటున్నారు. భూములు కోల్పోయేది తెలంగాణ ప్రజలు, ఉద్యోగావకాశాలు, కాంట్రాక్టులు మాత్రం సీమాంధ్ర ప్రాంతం వారికే వస్తున్నాయి. ఓపెన్ కాస్టుల పేరిట ప్రైవేట్ భూములు, ఫారెస్ట్ రిజర్వు భూములను తీసుకుంటున్నారు. తెలంగాణ ప్రాంతంలో భూములు ఫారెస్ట్ భూములైతే, దానికనుగుణంగా తెలంగాణా ప్రాంతంలోపలే, ఆ భూమికి బదులుగా వేరే చోట అడవులు పెంచాల్సి ఉంది. ఓపెన్ కాస్టు కోసం అడవి భూములను తీసుకుంటున్నారు, కాని తెలంగాణలో పెంచాల్సిన అడవులు సీమాంధ్రలో పెంచుతున్నారు. ఇంత వివక్షత అవసరమా? అని మీ ద్వారా అడుగుతున్నారు. ఓపెన్ కాస్టులలో కాంట్రాక్టర్లు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. ఇదివరలో ఓపెన్ కాస్టులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు. ఈ నిరంకుశ సీమాంధ్ర పాలనలో డిపెండెంట్ ఉద్యోగాలు (వారసత్వ ఉద్యోగాలు) పోయాయి. 1,16,000 ఉద్యోగాలు ఉంటే ఇప్పుడు 60,000లకు కుదింపబడ్డాయి. దీని వెనుక సీమాంధ్ర పాలకుల వివక్ష ఉందని మనవి చేసుకుంటున్నాను. వచ్చే తెలంగాణ పునర్నిర్మాణంలో కచ్చితంగా వారసత్వ ఉద్యోగాలు రావడానికి ప్రయత్నిస్తాం. సింగరేణిలో అనేక పోరాటాలు, ఆందోళనలు జరిగాయి. కాని ఫలితం లేదు. అందుకే ప్రత్యేక తెలంగాణ కావాలని కోరుకుంటున్నాం.

నా ప్రజల తరపున కొన్ని సూచనలు చేయదలచుకున్నాను. తెలంగాణ రాష్ట్రం కచ్చితంగా ఏర్పడాలి. హైదరాబాదుతో కూడిన తెలంగాణ ఏర్పడిన తరువాత రెండు సంవత్సరాల కంటే ఉమ్మడి రాజధానిగా ఉండరాదు. లా అండ్ ఆర్డర్ తెలంగాణ రాష్ట్రానికే ఉండాలి. ఇన్నాళ్లు వివక్షతకు గురైన తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలి. వివక్షతకు గురైన అన్ని రంగాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలి. తెలంగాణ ఆవిర్భావం ఇరు ప్రాంతాల దళితుల అభ్యున్నతికి బాటలు వేయాలి. ఈ సమైక్యాంధ్రలో దళితులుఎక్కడా బాగుపడలేదు. ఏ దళితవాడలకు వెళ్ళినా ముక్కుమీద చేయి వేసుకొని పోయే పరిస్థితి ఉంది. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీ శైలజానాథ్ గారు మాట్లాడుతూ, సమైక్యాంధ్రలో దళితులు బాగుపడ్డారని, సుఖశాంతులతో ఉన్నారని, దళితవాడలలో రోడ్లు వేయబడ్డాయన్నారు. సమైక్యాంధ్రలో సీమాంధ్ర ప్రాంత దళితులు కాని, తెలంగాణ ప్రాంత దళితులు కాని బాగుపడలేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాగే గిరిజనులు కూడా బాగుపడలేదు.

(బెల్)

సీమాంధ్రనేతలు ఇకనైనా కుట్రలు వీడాలని, రెండు ప్రాంతాల అభివృద్ధి కోసం విడిపోదామని, కావలికుండల్లా కలిసి ఉందామని మనవిచేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం కోసం 1969

నుండి ఎన్నెన్నో త్యాగాలు, ఆత్మబలిదానాలు చేసిన అమరవీరులు ప్రొ.జయశంకర్, కాళోజి, శ్రీకాంతాచారి, అమరుడు వేణుగోపాల్ రెడ్డి, మా ప్రాంత సింగరేణి కార్మికుడు కొడుకైన రాంపెంకి శ్రీకాంత్‌కు, 1200 అమరవీరులకు పేరు పేరున అంజలి ఘటిస్తూ. . .

అదుగో అరుణోదయం,

కోటి ప్రభల సూర్యకాంతి,

అమరుల త్యాగఫలం,

కేసిఆర్ దీక్ష ఫలం,

తెలంగాణ ప్రజల పోరుఫలం,

చెరవీడిన తెలంగాణ స్వాతంత్రఫలం,

అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు,

ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుతంత్రాలు చేసినా తెలంగాణాను అడ్డుకోలేరు, అడ్డుకోలేరు. . జై తెలంగాణ.

శ్రీ శిల్పా మోహన్ రెడ్డి (నంద్యాల)ః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు-2013పై శాసనసభలో చర్చిస్తున్న సందర్భంలో నాకు అవకాశమిచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. సభలో చర్చ జరుగుతున్న సందర్భంలో తెలంగాణ, కోస్తాంధ్ర గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనున్న మూడు ప్రాంతాలలో రాయలసీమ గురించి మరచిపోతున్నారు. రాయలసీమ గతంలో చాలా నష్టపోయింది. కర్నూలు రాజధానిని, తుంగభద్ర రిజర్వాయర్‌ని, ఖనిజ సంపదలకు నిలయమైనటువంటి బళ్ళారి, హోస్పేట్, సండూర్‌ను పోగొట్టుకున్నాం. మాకు మాట్లాడడానికి అవకాశమివ్వకుండా, కేవలం రెండు నిమిషాలు కూడా ఇవ్వకపోవడం చాలా దురదృష్టకరం. నా ప్రాంత ప్రజల మనోభీష్టానికనుగుణంగా, నా వ్యక్తిగతంగా ఈ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఈ చర్చలో ఎక్కడైనా రాయలసీమ నిరుద్యోగుల గురించి, వారి ఉద్యోగాల విషయం గురించి గాని ఈ బిల్లులో సూచించ లేదు. రాయలసీమకు ప్రాణాధారమైన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగకు నికర జలాలిస్తామని ఈ బిల్లులో ఎక్కడా సూచించ లేదు. ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎం విషయాలలో మా ప్రాంత విద్యార్థులు ఎక్కడ చదవాలన్న నిర్ణయం జరగకపోవడం వలన ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాను. శ్రీకృష్ణదేవరాయులు పరిపాలనలో రాయలసీమ 'రతనాలసీమ'గా ఉంది. ఆ రోజులలో రతనాలను రాశులుగా పోసి అమ్మేవారు. అలాంటి రాయలసీమ ఈ రోజు రాళ్ళసీమగా, ఎడారిగా, వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతంగా ఉంది. దయచేసి మా ప్రాంతాన్ని కూడా గమనించమని నేను కోరుతున్నాను. ఆ రోజు కర్నూలు రాజధానిని కోల్పోయిన సందర్భంలో పెద్దమనుషుల ఒప్పందంలో ముఖ్యమంత్రిగా మా ప్రాంతం వారు ఉండాలని చెప్పడం జరిగింది. ఒప్పుకున్న తరువాతనే రాజధానిని హైదరాబాదుకు మార్చడం జరిగింది. ఆ రోజు మద్రాస్ ఉమ్మడి రాష్ట్రం నుండి మా ప్రాంతం విడిపోతున్న సందర్భంగా జరిగిన దానిని గురించి నేను ఈ క్రింద విధంగా చెప్పాలనుకుంటున్నాను.

ఒక తండ్రికి ముగ్గురు కొడుకులు. ఆ కొడుకులు ఆ రోజుల్లోనే మద్రాస్ నుండి విడిపోయిన తరువాత నష్టపోతున్నామనే ఉద్దేశ్యంతో ఒక కొడుకుని కర్నూలులో వ్యాపారం చేసుకోమని, ఒక కొడుకుని విజయవాడలో వ్యాపారం చేసుకోమని, ఇంకొక కొడుకుని హైదరాబాదులో వ్యాపారం చేసుకోమన్నాడు. వ్యాపారం చేసిన తరువాత ఉమ్మడి కుటుంబంలో జరిగిన ఆదాయం వల్ల ఆ తండ్రి హైదరాబాదులో 100 ఎకరాలు, విజయవాడలో 100 ఎకరాలు, కర్నూలులో 100 ఎకరాలు కొన్నాడు. దురదృష్టవశాత్తు ఆ తండ్రి చనిపోయాడు. చనిపోయిన తరువాత తెలంగాణ అనే పెద్దన్న 100 ఎకరాలు నేను ఇక్కడే సంపాదించాను కాబట్టి ఈ 100 ఎకరాలను ఇక్కడే ఉంచుకుంటానని అంటున్నాడు. హైదరాబాదులో దాని చుట్టుప్రక్కన ప్రాంతంలో 100 ఎకరాలు ఎకరానికి కోటి రూపాయలు వేసుకున్నా రూ.100 కోట్లు అవుతుంది. అదే విజయవాడ, దాని చుట్టుప్రక్కన ప్రాంతంలో ఎకరా రూ.20 లక్షలు వేసుకుంటే రూ.20 కోట్లు అవుతుంది. అదే కర్నూలు, దాని చుట్టుప్రక్కన ప్రాంతంలో ఎకరా రూ.3 లక్షలు వేసుకుంటే రూ.3 కోట్లు అవుతుంది. ఇందులో న్యాయం ఎక్కడ ఉందని ఆలోచించమని కోరుతున్నాను. ఆ రోజు పండిట్ జవహర్ నెహ్రూ గారు పెద్దన్నగా సమన్యాయం చేయాలనే ఉద్దేశంతో రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఉండి అందరూ సమన్యాయంతో ఉండమని చెప్పారు. కానీ ఈ రోజు జరుగుతున్న పరిస్థితులు చూస్తే చాలా బాధ కలుగుతుంది. ఒక సభ్యుడు మాట్లాడుతూ, చవటలని, దద్దమ్మలని, నాలుక చీరేస్తామని, తాట వలుస్తానని అంటాడు. మేము చేతగాక ఉన్నామా, మాట్లాడలేకపోతున్నామా, భాష రావడం లేదా, సంస్కృతి, సంప్రదాయాలు అలోచించాలి. ఈ రోజు తుంగభద్ర రిజర్వాయర్‌ను కర్నూలు కోల్పోవడం వల్ల, నీటి విషయంలో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఒక టి.ఎం.సీ. నీరు తెచ్చుకోవాలంటే కర్ణాటక మీద ఆదారపడాల్సి వస్తుంది. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు, బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన మిగులు జలాలు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినవి కాదని, అవి కర్ణాటక, మహారాష్ట్రకు సంబంధించినవని చెబుతున్న సందర్భంలో, ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచుతున్న సందర్భంలో రాయలసీమ ఎడారిగా మారే పరిస్థితి ఉంది.

**మ.1.00 జివైజి/ఎస్ఎస్‌కె**

దయచేసి మా రాయలసీమను ఎడారి కాకుండా కాపాడవలసిన అవసరముంది. ఈ రోజున హైదరాబాదులో వున్న బిహెచ్ఈఎల్, హెచ్ఎఎల్, హెచ్ఎమ్‌టి, ఎన్ఎఫ్‌సిఎల్, ఇన్ఫోసిస్, విప్రో, అరవింద్ ల్యాబ్స్, రెడ్డి ల్యాబ్స్ ఇలాంటివి మా దగ్గర ఒక్కటైనా పెట్టారా అని అడుగుతున్నాను. హైదాబాదులో ఇన్ని రకాల ఇండస్ట్రీస్ , ఫ్యాక్టరీస్ వస్తే మా రాయలసీమలో అలాంటివి ఒక్కటి కూడా లేదు. ఒక ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీ కాని, ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ కాని ఒక పెద్ద ఇండస్ట్రీ కాని అంటే ఐదు వేల మంది పని చేసే ఒక పెద్ద ఇండస్ట్రీ కాని ఉన్నాయా?

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆ రోజున రాబోయే రోజుల్లో నీటి యుద్ధాలు వస్తాయని తన కాలజ్ఞానంలో రాశారు. ఇది నిజం. భవిష్యత్తులో రాయలసీమ ఎడారిగా మారబోతుంది.

ప్రస్తుతం చూస్తుంటే తెలంగాణా, ఆంధ్ర రాయలసీమ అని కొట్లాడుతూ ఇబ్బంది పడే పరిస్థితి వుంది. అలా కాకుండా దయచేసి అందరం కలిసిమెలిసివుండాల్సిన అవసరముంది. ఐకమత్యమే మహాబలం, కలిసివుంటే కలదు సుఖం అని మన పెద్దలు ఏదైతే చెప్పారో దయచేసి అందరూ దీనిని గమనించమని మనవి చేస్తున్నాను. రాష్ట్రంలో రైతులకు మద్దతు ధరల విషయంలో కాని, గిట్టుబాటు ధరల విషయంలో కాని, లాభసాటి ధరల విషయంలో కాని, సాగునీటి వ్యవహారాల విషయంలో కాని, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల విషయంలో కాని, మహిళలు ఎదుర్కొంటున్న అత్యాచారాల విషయంలో కాని ఎవరూ మాట్లాడడం లేదు. వాళ్ల రాజకీయ పదవుల కోసం, వాళ్ల రాజకీయ ఉద్యోగాల కోసం ఇవ్వాళ కోస్తాంధ్ర, తెలంగాణా, రాయలసీమ అంటూ కొట్లాడుకునే పరిస్థితి రావద్దని, దయచేసి ఆ రోజున ఏదైతే విశాలాంధ్ర దృక్పథంతో తెలుగువారందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఒకటిగా మెలగాలని భావించారో అదే స్ఫూర్తితో ఆంధ్ర ప్రదేశ్ సమైక్యత కోసం అందరూ కట్టుబడి వుండాలని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని కొనసాగించాలని కోరుతూ సమైక్యాంధ్ర ప్రదేశ్‌కు కట్టుబడి వుంటూ ఈ ముసాయిదా బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. థాంక్యూ వెరీ మచ్ సర్ . జై సమైక్యాంధ్ర.

©©శ్రీమతి గల్లా అరుణ కుమారి (గనుల శాఖా మంత్రి): అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుపై ప్రసంగించడానికి అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. రాజ్యాంగానికి, ఫెడరల్ స్ఫూర్తికి, సాంప్రదాయలకు విరుద్ధంగా అసమగ్ర వివరాలతో మా ముందుంచబడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును నేను వ్యతిరేకిస్తున్నాను. అంతే కాకుండా ప్రజాభీష్టాన్ని పక్కకు నెట్టి ఒంటెద్దు పోకడలతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని నేను ఖండిస్తున్నాను. ఈ బిల్లును చరిత్రాత్మక తప్పిదంగా నేను భావిస్తున్నాను. రాష్ట్ర శాసనసభ తీర్మానంతో సంబంధం లేకుండా ఆర్టికల్ 3 ప్రకారం విభజన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. ఆర్టికల్ 371 -డి రాజ్యాంగ సవరణ గురించి ఈ సందర్భంలో ఎక్కడా పేర్కొనకపోవడం విచారించదగ్గ పరిణామంగా నేను భావిస్తున్నాను.

బిల్లులో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ గురించి ప్రస్తావించకపోవడం శోచనీయం. సీమ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. మెజారిటీ ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా తెలుగు జాతి ప్రజలను విడదీసే ఈ బిల్లుపై మాట్లాడవలసి రావడం చాలా దురదృ ష్టకరంగా భావిస్తున్నాను.

నా తండ్రి స్వర్గీయ రాజగోపాల్ నాయుడు గారు స్వాతంత్ర్య సమయోధుడిగా, సిద్ధాంతకర్తంగా, పేద,బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం ఉద్యమించారు. రైతు కూలీల కోసం, గీత కార్మికుల కోసం ప్రజలెదుర్కొంటున్న ఎన్నో సమస్యల మీద మహా ఉద్యమాలు

©© An asterisk before the name indicates confirmation by the Minister

నడిపిన పోరాట పటిమ కలిగిన నాయకుడు. మూడు సార్లు శాసనసభ్యునిగా, రెండు సార్లు పార్లమెంటు సభ్యునిగా పని చేసి ప్రజా సంక్షేమం కోసం నిర్విరామ కృషి సలిపినటువంటి వారు. ఆయన కుమార్తెగా ఈ అసెంబ్లీ ప్రాంగణంలో అడుగుపెట్టినప్పుడు ఒళ్లు జలదరించింది. మొట్టమొదట ఈ హౌస్‌లో అడుగుపెట్టినప్పుడు సభాపతి వేదిక వద్ద జాతీయ పతాకం, సత్యమేవ జయతే అన్న సూక్తి, గాంధీ గారి చిత్రపటాన్ని చూసి ఒక్కసారిగా ఏదో తెలియని గగుర్పాటుకు లోనయ్యాను. ఈ చోటనే కదా నా తండ్రి 15 సంవత్సరాలు ఎన్నో విధాన నిర్ణయాల గురించి, ప్రజల సమస్యల గురించి వారి తరఫున తన గళం వినిపించిన ఎన్నో సంఘటనలు గుర్తుకొచ్చాయి. సీమ ప్రాంతం నుండి ఎంతో మంది శాసనసభ్యులుగా , మంత్రులుగా, కొంత మంది ముఖ్యమంత్రులుగా కూడా వున్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ అసెంబ్లీ ప్రాంగణంలో అడుగుపెట్టడం నా అదృష్టం. ఈ అసెంబ్లీలో అడుగుపెట్టడానికి నాలుగు సార్లు అవకాశం కల్పించిన మా చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు మనసారా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

రాష్ట్రాన్ని ఏ ప్రాతిపదికన విభజిస్తున్నారో చెప్పలేదు. శ్రీకృష్ణ కమిటి నివేదికను పరిగణనలోకి తీసుకోనే లేదు. ఆంటోని కమిటి నివేదిక ప్రస్తావనే లేదు. 2010లో అప్పటి లోక్‌సభ స్పీకర్ అధ్యక్షతన భోపాల్‌లో జరిగిన సభాధ్యక్షుల సమావేశంలో భవిష్యత్తులో చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఎస్ఆర్‌సి సిఫార్సులుండాలని చేసిన సిఫార్సులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పునర్విభజన బిల్లు జవాబుదారీ తనాన్ని పెంచేవిధంగా లేదు. సమీకృత అభివృద్ధికి దోహదం చేసే విధంగా లేదు. ఎంతో హడావిడిగా విభజిస్తున్నారు. శాతవాహనుల కాలం నుండి, కాకతీయుల కాలం నుండి కొన్ని వేల సంవత్సరాలుగా తెలుగు ప్రజల మధ్య వున్న ఐకమత్యాన్ని విడదీసే ఈ రాష్ట్ర విభజన బిల్లును నేను తిరస్కరిస్తున్నాను. తెలుగువారి ఐక్యతను కాపాడాలి. రాష్ట్రాన్ని విభజిస్తే రాయలసీమకు త్రాగునీరు, సాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికీ రాయలసీమలో త్రాగడానికి నీరు లేనందువల్ల ప్రజలు దుర్భర వేదనను అనుభవిస్తున్నారు. మెజారిటీ ప్రజల ఆకాంక్ష మేరకు నేను రాష్ట్రం సమైక్యంగా వుండాలని ఆశిస్తున్నాను.

సెంటిమెంట్ల ఆధారంగా రాష్ట్రాన్ని విడగొట్టుకోవడం ఎంతో బాధాకరం. రాష్ట్రం సమైక్యంగా వుంటేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నమ్ముతున్నాను. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తున్న సందర్భంలో కేవలం రాజకీయ స్వార్థంతో కొంతమంది స్వార్థపరులు అన్నదమ్ముల్లాంటి తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టారు. కొంత మంది వారి స్వలాభం కోసం ఇది చేయడం మంచి పద్ధతి కాదు.

విద్య, వైద్యం ఆరోగ్యం, నదీ జలాల పంపిణీ, ఆర్థిక సహకారం రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల ప్రస్తావన లేకుండా వున్న ఈ బిల్లును తిరస్కరిస్తున్నాను. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలకు హైదరాబాదు నగరంతో వున్న భావోద్వేగాల కారణంగా వేలాది సంవత్సరాలుగా రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతిక సంబంధాలున్న నేపథ్యంలో అన్ని రంగాలలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలు ఇది తమ ప్రాంతంగా భావించి పెట్టుబడులు పెట్టారు.

అదేవిధంగా విదేశాలలో పని చేస్తున్న మన తెలుగు వారు ఎంతో మంది హైదరాబాదు నగరం మనది అన్న భావనతో తాము రిటైరైన తరువాత ఇక్కడే స్థిరపడవచ్చన్న ఉద్దేశంతో కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టడం జరిగింది. సువిశాలమైన హైదరాబాదు నగరం మనది, ఇక్కడున్న వారంతా మనవాళ్లు అనుకున్నాము. అమెరికాలో వివిధ హోదాల్లో వున్న వారు హైదరాబాదు మనది అని ఇక్కడికి వచ్చారు. యూనివర్సిటీ స్థాయి వున్న తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థలు హైదరాబాదులో వున్నాయి. రక్షణ రంగంలో 28 వ్యవస్థలు, 48 కేంద్ర ప్రభుత్వ సంస్థలున్నాయి. దేశవిదేశాల నుండి ఎంతో మంది ఇక్కడ పరిశ్రమలు, హాస్పిటల్స్ స్థాపించారు. ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఇక్కడే పని చేస్తున్నాయి. 150 దేశాలకు ఫార్మా ఉత్పత్తులను ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా వైద్యానికి సంబంధించి చిత్తూరు జిల్లాకు చెందిన ప్రతాప్ సి. రెడ్డి గారు ఆపోలో ఆసుపత్రిని ఈ నగరంలోనే స్థాపించడం జరిగింది. కోస్తాకు చెందిన డాక్టర్ సోమరాజు గారు కేర్ ఆసుపత్రిని స్థాపించారు. గుంటూరు జిల్లాకు చెందిన డాక్టర్ ఎమ్. గోపీచంద్ గారు స్టార్ ఆసుపత్రిని, నెల్లూరు జిల్లాకు చెందిన బొల్లినేని కృష్ణయ్య గారు కిమ్స్ ఆసుపత్రిని, రెయిన్‌బో చిన్న పిల్లల ఆసుపత్రి, గ్లోబల్ ఆసుపత్రి, ఇమేజ్ ఆసుపత్రి, కామినేని ఆసుపత్రి, సన్‌షైన్ ఆసుపత్రి, రెమిడీ ఆసుపత్రి, మ్యాక్స్ విజన్ లాంటి కంటి ఆసుపత్రులను సీమాంధ్రకు చెందిన వారు ఈ ప్రాంతం మాది అన్న భావనతో సూపర్ స్పెషాలిటీ స్థాయి ఆసుపత్రులను నెలకొల్పడం జరిగింది. ఇటువంటి ఆసుపత్రులను మా ప్రాంతాలలో నిర్మించాలంటే ఎంత సమయం పడుతుందో మీరు ఆలోచంచండి. ఈ ఆసుపత్రులను మా ప్రాంతాలలో నిర్మించుకుని వుంటే ఎంతమందికి ఉపాధి దొరికివుండేది, ఎంత మందికి ఉపయోగపడేది, ఎంత మందికి సహాయపడి వుండేదో మీరు ఒక్కసారి ఆలోచించాలని నేను కోరుతున్నాను.

మ.1.10 ni/nsk

ఇటువంటి హాస్పిటల్సు ఆ ప్రాంతంలో నిర్మించాలంటే ఎంత సమయం పడుతుందో ఆలోచించండి. ఇన్ని హాస్పిటల్సు మా దగ్గర స్థాపించుకుంటే మా ప్రాంతాల వారికి ఎంతో మందికి ఉపాధి కల్పించబడి ఉండేది. అక్కడి ప్రజలకి కూడా ఎంతో సౌకర్యంగా కూడా ఉండేది.

ఐటికి సంబంధించి విజువల్ సాఫ్ట్, ఇంటెల్ గ్రూప్, ఇన్‌ఫోసిస్, ఇన్‌ఫోటెక్, సి.ఆర్. అట్లాంటా మొదలైన కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల 50 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. వాటివల్ల అన్ని ప్రాంతాల ప్రజలు అభివృద్ధి చెందడం నిజం కాదా? హైదరాబాద్ నుండి సాఫ్ట్‌వేర్ టర్నోవర్ రూ.50 వేల కోట్లు అంటే 90 శాతం నిధులు వస్తున్నాయి. ఫార్మా ఎగుమతులు రూ.20వేల కోట్లకు పైగా ఉన్నాయి. హైదరాబాద్ గ్లోబల్ మెడికల్ హబ్‌గా ఏర్పడింది. ఇవన్నీ కొత్త రాజధానిలో ఏర్పడాలంటే ఎన్నో సంవత్సరాలు పడుతుంది. 55 సంవత్సరాలుగా హైదరాబాద్ నగరం ఆంధ్ర ప్రదేశ్ రాజధానిగా ఉండడంతో ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడులు అన్నీ ఇక్కడే పెట్టారు. అప్పటి ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డిగారి పిలుపు మేరకు సినీ పరిశ్రమ అంతా చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చిన మాట నిజం కాదా? అందువల్ల ఎంతో మందికి

ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. ఈ పరిశ్రమలపై ఆధారపడి ఎంతోమంది జీవిస్తున్నారు. వారికి ఇప్పుడు భరోసా ఏదని అడుగుతున్నాను.

2012 –2013 సంవత్సరంలో రాష్ట్ర ఆదాయం రూ.69 వేల కోట్లుంటే హైదరాబాదు నుండి రూ.34 వేల కోట్లు ఆదాయం వస్తుంది. రాష్ట్రం విడిపోతే మిగతా ప్రాంతాలకు ఆర్థిక సమస్యలు రావా? రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.1.60 కోట్లు ఉంటే అందులో హైదరాబాదు వాటా రూ.90 వేల కోట్లు ఉంది. నిజాం కాలంలో నాలుగు లక్షల మంది ప్రజలకు సరిపోయే విధంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే, నేడు 1.10 కోట్ల మందికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నాము. ఆ విధంగా మనం హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకున్నాము.

హెచ్ఎమ్‌డిఎ పరిధిలో సీమాంధ్ర ప్రాంతానికి చెందిన 30లక్షల మంది 30 సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. దాదాపు 80 లక్షల మంది హైదరాబాద్‌లో ఉంటున్నారు. హైదరాబాద్‌లో ఫార్మా రంగం, చిత్ర పరిశ్రమ, ఐటి రంగం, 60 కేంద్ర ప్రభుత్వ సంస్థలు మొదలైనవన్నీ రాష్ట్ర రాజధానిలో ఏర్పడడం వల్ల అన్ని ప్రాంతాల ప్రజలు హైదరాబాద్‌కు రావడం వల్ల జనాభా పెరిగి 11 అసెంబ్లీ సీట్లు పెరిగాయి. సీమాంధ్ర ప్రాంతంలో డీలిమిటేషన్ వల్ల 12 అసెంబ్లీ స్థానాలు కోల్పోవడం జరిగింది. సీమాంధ్ర ప్రాంతంలోని వారు తమ ఆస్తులు అమ్ముకొని హైదరాబాద్‌లో విద్యా, ఉద్యోగాల రీత్యా అమీర్‌పేట, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, వనస్థలిపురం లాంటి ప్రాంతాలలో 50 శాతం ప్రజలు సెటిల్ అయ్యారు. దాదాపు 2లక్షల మంది వివిధ ప్రయివేటు సంస్థలలో పని చేస్తున్నారు. భవిష్యత్తులో వీరికి భరోసా ఏది?

విద్యార్థులకు సంబంధించి సీమాంధ్రకు చెందిన విద్యార్థుల భవిష్యత్తు రాబోయే కాలంలో ప్రశ్నార్థకం అవుతుంది. వారంతా విద్యా, ఉద్యోగాల కోసం హైదరాబాద్‌పై ఆధారపడ్డారు. రాష్ట్రాన్ని విభజిస్తే విద్యార్థులు రెండు తరాల వారు నష్టపోతారు. ఐఐటి, ఐఐఐటి, మెడికల్ కాలేజీలు, నల్సార్ యూనివర్సిటీ, ఐఎస్‌బి, సెంట్రల్ యూనివర్సిటీ, బిట్స్, నిఫ్ట్, ఎన్ఎస్ఎల్, ఇంజనీరింగ్ కళాశాలలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్సు మొదలైన ప్రముఖ విద్యాసంస్థలలో విద్యార్థులు సీట్లు కోల్పోతారు.

రాజధాని అనే కారణంతో హైదరాబాద్‌లో బిహెచ్ఇఎల్, బెల్, డిఆర్‌డిఎల్, మిథాని, హెచ్ఎమ్‌టి, హెచ్ఐఎల్, ఐడిబిఎల్, ఇసిఐఎల్, సిసిఎమ్‌బి, ఎన్ఎమ్‌డిసి, డిఆర్‌డిఒ, ఎన్‌జిఆర్‌టి, సిఎమ్‌సి, ఎస్‌టిపి, ఆర్‌సిఐ, ఎన్ఎఫ్‌సి, ఎన్ఆర్ఎస్ఎ లాంటి ఎన్నో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థలు ఏర్పాటయ్యాయి. వీటన్నిటితో సీమాంధ్ర ప్రాంతం వారు తమ అనుబంధాన్ని కోల్పోతారు.

హైదరాబాద్‌లో ఐటికి సంబంధించి 1200 సంస్థలు పని చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, టిసిఎస్, విప్రో, ఇంటర్‌గ్రాఫ్, జీ లాంటి ప్రముఖ కంపెనీలలో ఒక లక్ష మంది ఉద్యోగాలు చేస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చాలామంది కంపెనీలు పెట్టారు.వారికి పలు ప్రయోజనాలు అందించారు. రేపు విభజిస్తే సీమాంధ్ర విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. గ్రూప్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యే కోచింగ్ కేంద్రాలు అన్నీ ఇక్కడే ఏర్పాటయ్యాయి. అవన్నీ వారికి దూరం అవుతాయి. ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్నారు. వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని బాధ పడుతున్నారు.

బాధ్యత గల ఒక కేంద్ర మంత్రి ఒక మాట అన్నారు. వారంటే మాకు అపార గౌరవం ఉంది. గుజరాత్ వాళ్లు లేరా? ఇతర రాష్ట్రాల వారు లేరా? వాళ్ల కంటే ఎక్కువగా ఉన్నారా? అని, వారి పరిస్థితి ఏమిటని అనడం నిజంగా నాకు చాలా బాధ కలిగింది. వారంతా వ్యాపార నిమిత్తం వచ్చారు. వ్యాపారం బాగా జరిగితే ఇక్కడ ఉంటారు, వ్యాపారం జరగకపోతే వెళ్లిపోతారు. కాని వారితో మాకు పోలిక ఎలా ఉంటుంది. మనది అనుకుని కష్టం, నష్టం భరించి ఉన్నాము.

అక్కడి ఆడపడచులు ఇక్కడ కోడళ్లు అయ్యారు, ఇక్కడి ఆడపడచులు అక్కడ కోడళ్లు అయ్యారు. ప్రతి మారుమూల ప్రాంతం నుండి తమ ఆస్థిపాస్తులు అమ్ముకొని హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరచుకొని ఇక్కడ సెటిల్ అయ్యారు. ఇప్పుడు వారు ఎక్కడికి వెళ్లాలి. ఇక్కడి ప్రజలకు చాలామందికి రాష్ట్ర విభజన ఇష్టం లేదు. కొంతమంది స్వార్థంతో రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర విభజనను లేవనెత్తడం చాలా దారుణం .

ఆనాడు తమిళనాడు నుండి ఆంధ్రను ఏర్పాటు చేస్తే, పార్లమెంట్‌లో బిల్లుపై శ్రీ సి.ఆర్. కృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ఆంధ్ర రాజధాని చేయాలని, దీని విషయమై ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్ కార్పోరేషన్‌లు తీర్మానం చేశాయని అన్నారు. పార్లమెంట్ సభ్యులు శ్రీ హరీష్ చంద్ర మాట్లాడుతూ మూడు కోట్ల విశాలాంధ్రకు హైదరాబాద్ నగరం రాజధాని అయితే మంచి జరుగుతుందని, రాయలసీమలోని ఆరు జిల్లాల సంస్కృతి, తెలంగాణాలోని 8 జిల్లాల సంస్కృతి సరిగ్గా సరిపోతాయని అన్నారు. పార్లమెంట్ సభ్యులు శ్రీ కృష్ణ ఆచార్య మాట్లాడుతూ హైదరాబాదులో అప్పటి ప్రజలు పూర్తిగా రాష్ట్రం విభజన జరగాలని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణా 8 జిల్లాలు కలిపితే మనకు ఆంధ్ర రాష్ట్రం పూర్తి అయినట్లు కాదని ఆనాడు అన్నారు.

ఎంతోమంది పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు అందరూ కూడా దీనిని ప్రమోట్ చేశారు. ప్రత్యేకంగా తెలంగాణా ఏర్పడితే ఆనాడు హైదరాబాద్ ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామ కృష్ణారావుగారు అసెంబ్లీలో చేసిన ప్రసంగం - పెద్ద రాష్ట్రం అయితే మైనారిటీలకు అధిక అవకాశాలుంటాయని భావిస్తున్నానని అన్నారు. ప్రత్యేక తెలంగాణా ఏర్పడితే ఇప్పుడు వస్తున్న ఆదాయాలు సగానికి పడిపోతాయి. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల నుండి సగం మందిని తొలగించవలసి వస్తుంది. విశాలాంధ్ర ఏర్పడితే వనరులు అధికంగా ఉంటాయి. కాబట్టి భరించవచ్చు. మైనారిటీల ప్రయోజనాల రీత్యా విశాలాంధ్ర అవసరమని ఆ రోజు ముఖ్యమంత్రిగారు అనడం జరిగింది. ఎంతోమంది పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు

అందరూ మాట్లాడి అందరూ ఒప్పుకున్న తరువాత హైదరాబాద్‌లో రాజధానిని ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రత్యేక రాష్ట్ర నినాదం తెలంగాణా ప్రయోజనాలకు మంచిది కాదు. తెలంగాణాలో ఇటీవల జరుగుతున్న సంఘటనలు నాకు చాలా బాధను ఆందోళనను కలిగిస్తున్నాయి. తెలంగాణా ప్రజలకు ప్రత్యేక తెలంగాణా నినాదం ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని నేను విశ్వసిస్తున్నాను. తెలంగాణాను విశాలాంధ్రలో అంతర్భాగంగా భావించుకొని చిరకాలంగా మనం మురిసిపోతూ వచ్చాము.

మనం నిజాం పాలన కాలంలో కూడా రాజకీయ, సాంఘిక ఉద్యమాలు నడుపుకుంటూ వచ్చాము. ఆంధ్ర మహాసభ విద్య, సంస్కృతికి మొదలైన వాటికి నిదర్శనం. అందరూ కలిసి మెలిసి, చేదోడు వాదోడుగా వ్యవహరించడం లోనే తెలంగాణా శ్రేయస్సు గర్వితమై ఉన్నది.ఈ దశలో ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయడం సరైంది కాదు.

రాజ్యాంగంలో చట్టాన్ని సవరించకుండా ప్రత్యేక తెలంగాణాను ఏర్పాటు చేయడం సైతం అసంభవం. రాజ్యాంగ చట్ట సవరణ అనేసరికి ఎన్నో కొత్త చిక్కులను ఎదుర్కోవలసి వస్తుంది. దీని ప్రభావం ఇతర ప్రాంతాలపై చాలా ఎక్కువగా ఉంటుంది. తెలంగాణా వాదం సమైక్యాంధ్ర సాధనకు ఏ మాత్రం దోహదం చేయజాలదని దేశ్‌పాండే శాసనసభలో ఆరోజు మాట్లాడడం జరిగింది. ఇలా ఎందరో మహానుభావులు తెలుగు ప్రజలు ఎంతో గొప్పవారని భావించి సువిశాల విశాలాంధ్ర ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో ఇక్కడికి ఆహ్వానించడం వల్ల ఇంతమందిమి ఇక్కడకు వచ్చాము. అభివృద్ధిలో భాగస్వాములం అయ్యాము. తెలుగు జాతి మనది, నిండుగ వెలుగు జాతి మనదనే భావనతో కలిసి మెలిసి పోయాము.

అదే విధంగా ఆ రోజు స్వాతంత్ర్యం రాక పూర్వమే వేములపల్లి శ్రీకృష్ణగారు తెలుగు జాతి అనే చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని వారసత్వ సంపదగావ్రాసిన గేయంలో చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడ, గతమెంతో ఘనకీర్తి కలవోడ అని ఎలుగెత్తి చాటడం జరిగింది. మన రాష్ట్రం, దేశం మొత్తాన్ని శాసించే స్థాయికి ఎదుగుతున్న సందర్భంలో పొరుగు రాష్ట్రాల వారు చేసిన కుట్ర ఫలితమే ఈనాటి పరిస్థితికి నిదర్శనమని నేను నమ్ముతున్నాను.

మ.1.20 Crk/Asv

ఈ కుట్రలకు బలి కాకుండా సమైక్యంగా నిలబడి మన జాతి ఐక్యతను చాటుకోవలసిన అవసరముందని నేను చెబుతున్నాను. "వీరుల రక్తంతో తడసిన పలనాడు", " ధీరులను కన్న జన్మభూమి" ఇది. ఎందరో కవులు జన్మించారు, ఎంతో ఘనకీర్తి ఉంది. నేడు పట్టుతప్పిపోయింది, చేవ తగ్గిపోయిన దానికి పూర్వ వైభవం ఇలాగే కొనసాగించాలని నేను అనుకుంటున్నాను. ప్రపంచ

ప్రఖ్యాతి గాంచిన అమరావతి శిల్పాలు మన గొప్పతనాన్ని చాటి చెప్పాయి. శిల్పిరాయిని ఎలా మలుస్తారో, దేశాన్ని మనం అలా మలచుకోవాలని నేను అనుకుంటున్నాను. "రాజ్యం అంటే వీరభోజ్యం" అన్న తిక్కన్న గారి మాటలను గుర్తు చేసుకొని ఆనాటి పౌరుషాన్ని మరలా చూపి కార్యశూరులు కావాలని నేను అంటున్నాను. గేదె కాళ్లకు తాడు కట్టి పాలు ఎలా పితుకుతారో ఆ విధంగా మన రాష్ట్రాన్ని ఇబ్బంది పాలు చేస్తున్నారు. మన జీవ నదులు, ధాన్యరాశులు, పచ్చదనాన్ని చూసి అందరి కళ్లు పడి మన దేశంలో గొడవలు సృష్టించబడ్డాయి. ఈ మోసాన్ని అందరూ గుర్తించాలని నేను కోరుకుంటున్నాను. అన్ని ప్రాంతాల ప్రజలు కలసిమెలసి మెలగాలని అనుకుంటున్నాను. ఎనిమిది కోట్ల మంది కలిసుంటే బలం. నడి సముద్రంలో పడవ ఉంది, దీనిని ఒడ్డుకు చేర్చవలసిన అవసరం ఉంది. "కలిసిమెలిసి నేడు పోవాలోయ్, కలిమి బలిమి కూర్చుకోవాలోయ్! తల్లి ఒక్కటే నీకు తెలుగోడా, సవతి బిడ్డల పోరు మనకేలా, చుక్కాని పట్టరా తెలుగోడా, నావ దరిచేర్చరా మొనగాడా" అని వారు రాసిన పదాలను ఈరోజు గుర్తు చేస్తున్నాను.

రాష్ట్రాన్ని విభజిస్తే, మా ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య, విద్య ఉద్యోగాల కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆందోళనలో ఉన్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలి? ఇంట్లో ఒకరు చనిపోతే ఎలా బాధపడతారో అలాంటి వాతావరణం మా ప్రాంతంలో నెలకొని ఉంది. భవిష్యత్తులో ఎన్నో సందేహాలుంటాయని అంటున్నాను. రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని ఎక్కడ చేపడతారు, ఎన్ని నిధులను కేటాయిస్తారు, ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే విషయాలను ఎక్కడా ప్రస్తావించలేదు. హైదరాబాద్ లాంటి మహానగరాన్ని నిర్మించాలంటే ఎంత డబ్బు కావాలి అధ్యక్షా? రాష్ట్రం విడిపోతే శ్రామిక, కార్మిక వర్గాలు నష్టపోతాయి. కేంద్రం చేపట్టిన విభజన ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా సాగుతోంది, భావోద్వేగాలున్నాయి. అభివృద్ధి జరగలేదని రాష్ట్రాన్ని విభజించడం ఇంతవరకూ దేశంలో ఎక్కడా జరగలేదు. అభివృద్ధి పరంగా చూస్తే, తెలంగాణా కంటే రాయలసీమ ఎంతో వెనుకబడి ఉంది. రాష్ట్రం విడిపోతే రాయలసీమ రాళ్ల సీమగా మారుతుంది. రాయలసీమలో బొగ్గు లేదు, గ్యాస్ లేదు, పచ్చదనం లేదు, విద్యుత్ వినియోగం ఎక్కువ. విద్యుత్ కేంద్రాలని నెలకొల్పడానికి తీసుకున్న చర్యలేమిటి, ఇచ్చే నిధుల ప్రస్తావని ఏది అని అడుగుతున్నాను.

అధ్యక్షా, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత పెద్ద ఎత్తున లక్షలాది మంది ప్రజలు రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి తమ నిరసన తెలపడం రెండవ సారి. మన దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం తరువాత రెండవ ఉద్యమం ఇదేనేమోనన్న వారి విన్నపాలను పట్టించుకోలేదు. ఉద్యోగస్తులు రోడ్లపైకి వచ్చారు. పల్లెల్లో ఉద్యమాలు జరుగుతున్నాయి. గ్రామగ్రామాలలో కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి. మహిళలు, యువకులు అని లేదు, అన్ని సెక్టార్లలో ఉద్యమాలు వచ్చాయి. నా రాజకీయ జీవితంలో ఇటువంటి పరిస్థితి వస్తుందని నేను అనుకోలేదు. సీమాంధ్రకు సంబంధించి మొదటి నుండీ నేను ఒక్కదాన్నే మహిళా మంత్రిని. ఆరు మంది మహిళా మంత్రులుంటే నేను ఒక్కదాన్నే సీమాంధ్రకు సంబంధించిన దానిని, మిగిలిన వారంతా తెలంగాణాకు సంబంధించిన వారే అధ్యక్షా. మా మధ్య ఏనాడు బేదాభిప్రాయాలు తలెత్తలేదు,

సొంత అక్కాచెళ్లుళ్లు లాగ ఉన్నాము. ఈరోజు రాష్ట్రం విడిపోతుందంటే చాలా బాధగా ఉంది అధ్యక్షా. అన్నలకు అన్నగా ఉన్న జానారెడ్డి గారిని ఎలా మరచిపోతాము, సిస్టర్ సిస్టర్ .. అని పలకరించే హరీష్‌రావు గారిని ఎలా మరచిపోతాము అదే విధంగా ప్రతి విషయాన్ని ఇష్యూ చేసేటువంటి నాగం జనార్థన్ రెడ్డి గారిని ఎలా మరచిపోతాము? ఇక్కడున్న అన్ని పార్టీల, అన్ని ప్రాంతాల ప్రజలను ఎలా మరచిపోతాము? ఒకసారిగా ఈ తెలంగాణా సమస్య తలెత్తడం చాలా బాధాకరం. మమ్మల్ని రకరకాల పేర్లతో, ఆంధ్రోళ్లు, ﾠ౹౹• వలసవాదులు అలా అనడం బాధ కలిగించింది. సమైక్యంగా అభివృద్ధి చెందిన తరువాత, మీ దారి మీరు చూసుకోండని అనడం నిజంగా బాధాకరం. ఎన్నో అవమానాలు, బాధలు, కష్టాలు కడుపులో పెట్టుకొని ముందుకుపోతున్నాం అధ్యక్షా. ఒక్క పంటపై ఆధారపడ్డ ప్రాంతం మాది. మా పల్లెల్లో ప్రజలుండరు, పరిశ్రమలుండవు, సాంకేతిక పరిజ్ఞానం ఉండదు, పచ్చదనం ఉండదు. పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం వలస వెళ్లడం మినహా మరో గత్యంతరం లేదు.

అధ్యక్షా, ఆచార్య ఎన్.జి. రంగా గారు, 1953లో రాష్ట్రానికి రెండవ రాజధానిగా విజయవాడ, గుంటూరును ఉంచాలని కోరారు. హైదరాబాదును రాజధానిని చేసినందు వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది కాబట్టి మా ప్రాంతం ఏమాత్రం అభివృద్ధి చెందలేదు. ఆంధ్ర రాష్ట్రం మద్రాసు నుండి విడిపోవడం, కుర్నూలులో రాజధాని ఏర్పాటు కావడం, తరువాత తెలుగుజాతి ఐక్యత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిని హైదరాబాదుకు త్యాగం చేశాం. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం, రాజధానిని కోరుకుంటే అదీ మూడు నాళ్ల ముచ్చటయ్యింది. నీటిపారుదల, పారిశ్రామిక, విద్య, వైద్య రంగాలలో వెనుకబడిన ప్రాంతం మాది. శ్రీకృష్ణ కమిటీ రిపోర్ట్‌లో కూడా రాష్ట్రం మొత్తం మీద రాయలసీమ వెనుకబడిన ప్రాంతం అని స్పష్టంగా పేర్కొనబడింది.

రాష్ట్రం సమైక్యంగా ఉంటేనే సమగ్రాభివృద్ధి సాధ్యం అవుతుంది. నీటి పంపకాలలో కూడా సమస్యలుండవు. నేను వైద్య శాఖా మంత్రిగా ఉన్నప్పుడు ఏనాడు ప్రాంతాల గురించి ఆలోచించకుండా తెలంగాణా ప్రాంతంలో ఎన్నో కాలేజీలకు, ఆసుపత్రులకు నిధులు కేటాయించాను. అదిలాబాద్‌లో రిమ్స్ మంజూరయ్యింది, బీబీనగర్ నిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాము, నిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణానికి, గాంధీ హాస్పిటల్‌లో మార్చురీకి ఎయిర్ కండిషనర్స్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్‌కి ఎంఆర్ఐ, సిటిఎస్ స్కాన్ లాంటి లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌కు, వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌లోని పీడియాట్రిక్ వార్డుకు బెడ్స్ పెంపు, సిబ్బంది మంజూరుకు చర్యలు తీసుకోవడం జరిగింది. నీలోఫర్ ఆసుపత్రిలో బెడ్స్ పెంపు, కొత్త బ్లాక్ నిర్మాణానికి, పేట్లబురుజులో మెటర్నిటీ హాస్పిటల్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. ఇలా ఎన్నో కార్యక్రమాలు ప్రాంతాలకు అతీతంగా చేపట్టాము. "రాజీవ్ ఆరోగ్య శ్రీ" కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో పర్యటించాము. రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రాంతాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గానికి, అడిగిన శాసనసభ్యులందరికీ నా పీరియెడ్‌లో, ఖమ్మం జిల్లాకు,

• Expunged as ordered by the Chair

నక్సెల్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధుల కింద దాదాపు వెయ్యి కోట్ల రూపాయల నిధులను రోడ్ల నిర్మాణం కోసం విడుదలయ్యేలా కృషి చేశాను. ఖమ్మం జిల్లా తెలంగాణా ప్రాంతంలో లేదా? తెలంగాణాలోని అదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలను వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా గుర్తించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరడం జరిగింది. సిఆర్ఎఫ్, ఇంటర్ స్టేట్ కనెక్టివిటీ, ఎకనామిక్ ఇంపార్టెన్స్ క్రింద వచ్చే నిధలను తెలంగాణాకు కేటాయించడంలో విశేష కృషి చేసాను. ఇరవై రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించాలని ప్రభుత్వం కోరితే, తెలంగాణాకి సంబంధించి హైదరాబాద్, శ్రీశైలం, అదిలాబాద్, అసిఫాబాద్, కోదాడ, సంగారెడ్డి, చేవెళ్ల, లక్సెట్టిపేట్, నిర్మల్ లాంటి రోడ్లను ప్రతిపాదించడం జరిగింది.

అధ్యక్షా, గనుల ప్రకారం చూస్తే, ఆంధ్రప్రదేశ్ రత్నగర్భగా పేరొందింది. మనకున్న సహజవనరులతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింప చేశాం. తెలంగాణాలో బొగ్గు, కోస్తా ఆంధ్రాలో గ్యాస్, కడపలో బెరైటీస్, ఒంగోలులో గెలాక్సీ గ్రానైట్, కర్నూలులో నాపరాయి, గుంటూరు, నల్గొండ జిల్లాలలో సున్నపురాయి, అనంతపురం ఇనుప ఖనిజం, ఇలా వివిధ ఖనిజాలతో రాష్ట్రం పేరుప్రఖ్యాతలు పొందింది. ఎన్నో గనుల ఆధారిత పరిశ్రమలు ఏర్పడ్డాయి. రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చేసుకున్నాం. గతంలో అత్యంత నాణ్యమైన ఇనుప ఖనిజమున్న బళ్లారిని కోల్పోయాం అధ్యక్షా. రాష్ట్రాన్ని విభజిస్తే రెండు ప్రాంతాల ప్రజలు నీరు, సహజవనరుల కోసం పోరాడవలసి వస్తుంది. అభివృద్ధి పనులకు ఖనిజవనరుల కొరత ఏర్పడుతుంది. రాష్ట్ర రాజధానికి పలు జిల్లాల నుండి హైవేలను అభివృద్ధి చేయడంతో, జిల్లాల నుండి నాలుగు నుండి ఆరు గంటల లోపు ఇక్కడికి చేరుకుంటున్నాము. ఎయిర్‌పోర్టులు అభివృద్ధి అయ్యాయి, ప్రజల మధ్య రాకపోకలు పెరిగాయి. అభివృద్ధి ఫలాలను అందుకుంటున్నారు. ఒక ప్రాంతం అని కాకుండా అన్ని ప్రాంతాలలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలు "భిన్నత్వంలో ఏకత్వం" లాగ కలిసిపోయే నేటి దశలో విభజన అవసరమా?

అధ్యక్షా, ఉద్యోగుల పరంగ చూస్తే, ఆనాడు 1,85,000 మంది ఉంటే, ఈనాడు 10,00,000 మంది ఉన్నారు. ఉద్యోగుల సంఖ్య పెరిగినట్లు కాదా? సెంటిమెంట్ విషయానికి వస్తే, నా గ్రాండ్ సన్ సిద్దార్థ చిన్నవాడు, తెలంగాణా విభజన గురించి మేము మాట్లాడుకుంటుంటే, హైదరాబాద్‌ను కూడా ఇచ్చేస్తారా నాయనమ్మా! అని వాడు అడిగినప్పుడు, వాడి కళ్లల్లో ఉన్న ఆవేదన, వాడి మొహంలోని ఫీలింగ్స్ చూసినప్పుడు చాలా బాధ అనిపించింది. సీమాంధ్ర ప్రజల మనోభావాలను తప్పకుండా తెలుసుకోవాలి. రాయలసీమలో జీవనదులు, ప్రాజెక్టులు లేవు. వెయ్యి అడుగుల లోతులో కూడా చుక్క నీరు లభించడం లేదు. తలసరి ఆదాయంలో కూడా వెనుకబడి ఉంది. ఈ రాష్ట్రం సమైక్యంగా ఉంటే దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటుంది. బావితరాలకు మేలు జరుగుతుంది. అభివృద్ధి క్రమం ఇలాగే కొనసాగుతుంది. మనపై పేద ప్రజలు పెట్టుకున్న నమ్మకం నిజం అవుతుంది. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలంగాణాలో కొన్ని వేల కోట్ల రూపాయలతో సాగునీటి ప్రాజెక్టులను చేపట్టాం.

చిత్తూరు జిల్లా బాధలు తెలిసిన మన ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి త్రాగునీటి కోసం రూ.6000 కోట్లు కేటాయిస్తే దానిని చాలా వివాదాస్పదం చేశారు. ఆ విధంగా అనుకుంటే ప్రాణహిత చేవెళ్లకు రూ.38,000 కోట్లు కేటాయించారు. అప్పుడు మేము నోరు మెదపలేదు. అదే విధంగా హైదరాబాద్‌లో మొదటి ఫేజులో గోదావరికి రూ.3800 కోట్లు, సెకండ్ ఫేజులో రూ.1600 కోట్లు కేటాయించడం జరిగింది. మొత్తం రూ.5400 కోట్లు ఈ హైదరాబాద్ పట్టణానికే కేటాయించడం జరిగింది. ఇదంతా మన రాష్ట్రం అనుకుని మేము ఎప్పుడూ నోరు మెదపలేదు. మేము ఈనాడు వట్టి చేతులతో వెళుతున్నాము.

(శ్రీ గంగుల కమలాకర్ మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

MR.DEPUTY SPEAKER: I will give you  mike. Please sit down.

శ్రీమతి గల్లా అరుణ కుమారిః ఇన్నేళ్ల ఈ ఆంధ్రప్రదేశ్ నుండి మేము ఏమి తీసుకువెళుతున్నామని ప్రశ్నిస్తున్నాను. వట్టి చేతులతో పంపిస్తున్నారు. ఈరోజున మనం ఎక్కడున్నాం? మన చుట్టూ ముళ్ల కంచెలు నిర్మించుకుంటున్నాం. స్వతంత్ర భారతంలో మన రాష్ట్రానికున్న ఔన్నత్యాన్ని సమైక్య భావం సింగారించుకున్న మన తెలుగుతల్లి ప్రాభవాన్ని, సమగ్ర స్వరూపాన్ని చెరగనీయకూడదనేది నా ఉద్దేశం. శంకరంబాడి సుందరాచార్యులు మా రాయలసీమ లోని చిత్తూరు జిల్లాలో పుట్టిన వ్యక్తి. "మా తెలుగు తల్లికి మల్లెపూ దండ" అని "కడుపులో బంగారు కనుచూపులో కరుణ" అని రాశారు. కానీ ఈరోజు ఏమి చేస్తున్నాం. తల్లినే నిలువునా చీల్చాలనుకుంటున్నాం. ఒక ఆస్థిని పంచుకోవచ్చు. ధనరాసులను పంచుకోవచ్చు. బిడ్డలను పంచుకోవచ్చు. కానీ తల్లిని పంచుకున్న లక్షణాలు ఎక్కడైనా ఉన్నాయా? ఈ రోజు కడుపులో బంగారు కాదు, కడుపులో కత్తులు దించుతున్నాము. కనులలో కరుణ కాదు ఆమె కన్నుల్లో రక్తపు కన్నీరు చిందుతున్నది. స్వతంత్ర భారతావనిలో మన రాష్ట్రానికున్న ఔన్నత్యాన్ని సమైక్య భావం సింగారించుకున్న తెలుగు తల్లి ప్రాభవాన్ని, సమగ్ర స్వరూపాన్ని చెరగనీయకూడదని ఇక్కడున్న సోదరులందరినీ నేను అడుగుతున్నాను. "ఒకే మాట, ఒకే బాట" వట్టి మాటేనా? శాస్త్ర పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కి గ్రహాంతరవాసానికి సిద్ధమవుతున్న ఈరోజుల్లో మనమెక్కడున్నాం? ఇదేనా మన ప్రగతి, ఇదేనా మన పురోగతి? మన భావితరాలకు గర్వ కారణమేముందని మనం చెబుతాం? ఇది మీరందరూ తెలుసుకోవలసిన విషయం. నేను నిజంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఆ వ్యతిరేకతను మీకు పంపించడం జరుగుతుంది. నేను చేతులు జోడించి మీకందరకూ చేస్తున్న విన్నపం ఒక్కటే. మనమందరం ఒక్కటిగా కలిసి మెలసి వున్నాం. అభివృద్ధి పనులన్నింటిలోనూ కలిసి వున్నాం. నిజంగా తెలంగాణా సోదరులు గానీ ఇక్కడున్న సీమాంధ్ర సోదరులు గానీ అందరం ఒకే భావంతో ఉన్నాం. అందరం ఒకటిగా కలిసి మెలసి వుండాలని చేతులు జోడించి నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను. "జై సమైక్యాంధ్ర".

(ఈ సందర్భంలో టిఆర్ఎస్ సభ్యులు శ్రీ గంగుల కమలాకర్ మరియు చెన్నమనేని రమేష్ మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

శ్రీ గంగుల కమలాకర్ (కరీంనగర్): అధ్యక్షా, గౌరవ మంత్రి గారు కలిసి వుందామని చాలా చక్కగా చెప్పారు. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ గురించి చెప్పారు. కరీంనగర్ జిల్లాలో 160 గ్రానైట్ క్వారీలుంటే 118 క్వారీలు సీమాంధ్ర ప్రాంతానికి చెందిన వారివే ఉన్నాయి. నో ప్రాబ్లమ్. మేము అక్కున చేర్చుకున్నాం. కానీ కరీంనగర్ నుంచి గ్రానైట్ లారీలన్నీ కాకినాడ పోర్టుకు వెళతాయి. ఒకరోజు కరీంనగర్ నుంచి వచ్చిన గ్రానైట్ లారీలన్నీ ఆపేసారు. ఆంధ్ర లారీలను మాత్రం అనుమతించారు. ఆరోజు మంత్రి గారికి ఆ లారీలు ఆపేసిన వాస్తవం తెలియదా? గౌరవ శాసన సభ్యులు హరీష్ రావు గారూ, నేను ధర్నా చేస్తే ఆరోజు వాళ్ల దృష్టికి వచ్చింది గానీ తెలంగాణ గ్రానైట్ లారీలను ఆపి కాకినాడకు రాకుండా చేసినప్పుడు మంత్రి గారు ఎందుకు స్పందించ లేదు? తెలంగాణా వాళ్లకో న్యాయం, ఆంధ్రా వాళ్లకో న్యాయం చేశారు కాబట్టి ఇంకెట్లా కలిసివుంటామని అడుగుతున్నాను.

(శ్రీ చెన్నమనేని రమేష్ మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని కోరసాగారు)

MR.DEPUTY SPEAKER: Leave it Ramesh garu, please sit down. You cannot pull the matter like this.

శ్రీ చెన్నమనేని రమేష్ (వేములవాడ): అధ్యక్షా, గౌరవ మంత్రి గారంటే నాకు గౌరవం కానీ ఒక్క విషయం వారి దృష్టికి తీసుకు వస్తున్నాను. కొత్తగా ఏర్పడిన నా వేములవాడ నియోజక వర్గంలో మేడిపల్లి అనే మండలం ఉంది. ఆ మండలానికి, నా నియోజక వర్గ హెడ్‌క్వార్టర్స్‌కు ఇప్పటి వరకూ రోడ్డు లేదు. ముఖ్యమంత్రి గారిని మూడు సార్లు, జిల్లా అధికారులను 4 సార్లు అడిగినప్పటికీ ఇప్పటి వరకూ కూడా మేడిపల్లి మండలానికి, వేములవాడకు రోడ్డు నిర్మాణం జరగలేదు. నిజంగా ఈ శాసన సభలో 294 నియోజక వర్గాలలో ఒక మండల హెడ్‌క్వార్టర్స్ నుంచి ఒక నియోజక వర్గ హెడ్‌క్వార్టర్స్‌కు రోడ్డు లేనటు వంటి మండలంగా మాది మిగిలిపోయింది. అది అభివృద్ధి కాలేదు, మారుమూల ప్రాంతం. నక్సల్ ఏరియాకు వచ్చే ఐఏపి ఫండ్స్ మాకు రానీయలేదు. అంతా కూడా గౌరవ శ్రీధర్‌బాబు గారి నియోజక వర్గానికి వెళ్లాయి గానీ మా నియోజక వర్గానికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఇంత వివక్ష జరిగిందని చెప్పదలచుకున్నాను.

శ్రీ పి.మహేందర్ రెడ్డి(తాండూరు): అధ్యక్షా, తెలంగాణా బిల్లు మీద మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. రంగారెడ్డి జిల్లాతోబాటు తెలంగాణా జిల్లాల్లో కూడా తెలంగాణ కావాలని కోరుకుంటున్న పరిస్థితి ఉంది. అయితే ఆనాడు చెన్నారెడ్డి గారి హయాంలోనే ఆనాడే ప్రజలందరూ తెలంగాణాకు అనుకూలంగా తీర్పిచ్చారు. టిపిఎస్ తెలంగాణ పార్టీ పెట్టి ఆనాడు ప్రజలందరూ తెలంగాణ కావాలని తీర్పిచ్చారు. ఆరోజు నుంచి ఈరోజు వరకూ తెలంగాణాలో విద్యార్థులతో పాటు చాలా మంది ముందుకు వచ్చి ప్రాణ త్యాగాలు చేసిన సంఘటనలు ఎన్నో వున్నాయి. ఇప్పటికైనా అర్థం చేసుకోమని ఆంధ్రా నాయకులందరికీ విజ్ఞప్తి

చేస్తున్నాను. తెలంగాణా రావడానికి వారి సహకారం ఉండాలని కోరుతున్నాను. అయితే సభలో మంత్రులు సునీతా లక్ష్మారెడ్డి గారు, అరుణ గారూ మాట్లాడారు. ఒక్కటే కేబినెట్‌లో ఉంటూ వారిద్దరు మాట్లాడిన తీరు సభ్యులందరూ విన్నారు. అయితే సునీతా లక్ష్మారెడ్డి గారిని నేను అడిగేదేమంటే, ముఖ్యమంత్రి గారు ఏదైతే అశోక్‌బాబు గారిని ప్రోత్సహించి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి సమైక్య ఉద్యమం చేస్తున్న విషయం సునీతా లక్ష్మారెడ్డి గారికి తెలియదా? "తెలంగాణలో ఇన్ని హాస్పిటల్స్ వచ్చాయి, తెలంగాణాలో ఇన్ని స్కూల్స్ వచ్చాయి, తెలంగాణాలోనే అన్నీ ఉన్నాయి, మా మనవరాలు నేను పోవాలా అని అడుగుతున్నది" అని గౌరవ మంత్రి అరుణ గారు చెప్పారు. నేను మంత్రి గారిని అడుగుతున్నాను. ఇవేళ నిజంగా తెలంగాణాలో ఉన్నటు వంటి ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో ఉన్నటు వంటి భూములన్నీ దోచుకుతిన్నారు. రంగారెడ్డి జిల్లాలో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారని చెబుతున్నారు గానీ పేదరికం ఉన్న జిల్లా రంగారెడ్డి జిల్లా. నిజంగా ఎంతో మంది బలైపోయారు. ఆంధ్రా నుంచి వచ్చిన నాయకులు గానీ, సినిమా పరిశ్రమ గానివ్వండి, రకరకాలుగా రంగారెడ్డి జిల్లాలో ఉన్న భూములన్నీ ఔఔ • ఇవేళ మాట్లాడుతున్నారు. ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అర్థం చేసుకుని తెలంగాణా ప్రాంతం అభివృద్ధి విషయంలో చాలా వెనుకబడిపోయింది కాబట్టి తెలంగాణాలోని పది జిల్లాల్లో కూడా ఉద్యోగస్తులకు గానీ అందరికీ అన్యాయం జరుగుతున్నది కాబట్టి 60 ఏళ్ల పోరాటంలో తెలంగాణాకు విడిపోవడానికి మంచి అవకాశం వచ్చింది కాబట్టి విడిపోవడానికి అందరూ సహకరించాలని ఇప్పుడున్న ఆంధ్ర నాయకులందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. తెలంగాణాకు అడ్డుపడొద్దు, తెలంగాణా ఇచ్చేంత వరకూ సహకరించాలని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

మ.1.40/JNV/ RSS

శ్రీ పి. వెంకటేష్ (రాజానగరం) : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2013కు ఏవిధమైన నిర్థిష్ట కారణాలు చూపకుండా, దేశంలో ఏ రాష్ట్ర విభజనకు అనుసరించని విధానాల ద్వారా ఏర్పాటు చేయాలనుకుంటున్న ఈ బిల్లును రాజానగరం నియోజక వర్గ ప్రజల ఆకాంక్షల దృష్ట్యా, తెలంగాణా ప్రజలపై నాకున్న ప్రేమ, అభిమానం దృష్ట్యా నేను ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఎందుకంటే.. ఈ బిల్లు ద్వారా విభజన అంటూ జరిగితే, ఈ రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాల తెలుగు ప్రజలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతాం. చాలా సందర్భాల్లో చూస్తున్నాను, సభ్యులు మాట్లాడుతూ, వారి వారి ప్రాంతంలో ఉన్న రోడ్ల పరిస్థితి గురించి, మంచినీటి సమస్య గురించి, వైద్య పరిస్థితుల గురించి మాట్లాడుతున్నారు. అయితే తెలంగాణా ప్రాంతమైనా, రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలైనా, 294 నియోజకవర్గంలోని 90 శాతం గ్రామాలు, ప్రజలు ఒకేరకమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. మరి 2004కు ముందు ఇటువంటి సమస్యలు ఈ రాష్ట్రంలో రాకుండా అప్పటి ప్రభుత్వం చంద్రబాబునాయుడి గారి నాయకత్వంలో వెనుకబడిన ప్రాంతాలకు ఎక్కువ నిధులను కేటాయిస్తూ, ఏ ప్రాంత ప్రజల్లోనూ అసంతృప్తి రాకుండా చేసిన ఘనత చంద్రబాబు నాయుడు గారిది అధ్యక్షా.

• Expunged as ordered by the Chair

(ఈ దశలో కొంతమంది తెలుగుదేశం పార్టీ సభ్యులు బల్లలు చరిచి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు)

2004 తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏదో విధంగా ఈ ఉద్యమాలను రెచ్చగొట్టాలని, ఈ ఉద్యమ స్ఫూర్తిని బాగా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేసుకుంటూ పోవడం వల్ల ఈ రోజు ఈ విభజను బిల్లు శాసన సభకు వచ్చింది.

(ఈ దశలో కొంతమంది సభ్యులు మీవల్లే అని అన్నారు)

అవును అధ్యక్షా, మా నాయకుడిది రెండు కళ్ల సిద్ధాంతం, రెండు ప్రాంతాలను కోరుకుంటున్నాం, నేను కూడా అదే కోరుకుంటున్నాను. రెండు ప్రాంతాలు కలిసుండాలి, సుఖసంతోషాలతో ఉండాలి, అభివృద్ధి చెందాలి, రెండు ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల సుఖ సంతోషాలతో కలిసుండాలని కోరుకుంటున్నాను.

MR.DEPUTY SPEAKER: Please conclude.

శ్రీ పి. వెంకటేష్ : అయితే, ఈ బిల్లు ఇక్కడికి పంపించిన విధానంలో, ఈ ఉద్యమాలు సాగినంతసేపు కూడా తెలంగాణా వెనుకబడి ఉంది కాబట్టి, తెలంగాణా వెనుబాటుతనంలో ఉండే విధంగా పరిపాలించారు కాబట్టి, వెనుబాటుతనం కలిగిన మా తెలంగాణా ప్రాంతాన్ని ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పడం జరిగింది. 2008లో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం యొక్క తీర్మానాన్ని అందజేసినప్పుడు కూడా ఈ రెండు ప్రాంతాలకి న్యాయం చేయాలని అందజేయడం జరిగింది. కానీ 2009లో ప్రకటన వచ్చిన తరువాత సీమాంధ్రలో ఉన్న అన్ని ప్రాంతాల ప్రజాప్రతినిధులం, శాసన కర్తలం, ఈ సభలో ఉన్న వారు కూడా ఈ సభలో రాజీనామాలు చేస్తే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రకటనను విరమించుకోవడం జరిగింది. తరువాత కేంద్ర ప్రభుత్వం శ్రీ కృష్ణ కమిటీని వేస్తే, ఆ కమిటీ ఈ తెలంగాణా ప్రాంతంలో కన్నా, మిగిలిన ప్రాంతంలోనే వెనకబాటుతనం ఎక్కువగా ఉందని నిర్ధారించడం జరిగింది. దాని వల్ల అంటే ఈ వెనుకబాటుతనం వల్లే తెలంగాణా రాష్ట్రం కోరుకున్న సభ్యులంతా కూడా దీన్ని గమనించి ఈ వెనుకబాటుతనం తెలంగాణాలోనే కాదు, అన్ని ప్రాంతాల్లో కూడా వెనుకబాటుతనం ఉంది కాబట్టి మనం గౌరవమైన శాసన సభలో ఉన్నాం, ఇక్కడి తెలుగుప్రజల మనోభావాలకు అనుగుణంగా వారిని ఏ రకంగా తీర్చి దిద్దాలి, అభివృద్ధి పరచాలి అని ఆలోచించాల్సి అవసరం ఉంది కానీ, విడిపోవటం వల్లే మనందరి భవిష్యత్తు మారిపోతుందని అనుకోవడం చాలా పొరపాటని నేను భావిస్తున్నాను.

రెండవదిగా, ఉద్యోగాల విషయం తీసుకుంటే, తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏర్పడతాయని చెప్పడం జరిగింది. నిజమే 1.50 లక్షల ఉద్యోగాలు ఏర్పడవచ్చు, ఉద్యోగాలంటే ప్రైవేటు ఉద్యోగాలు అవసరమే, అలాగే ఉపాధి కల్పించే మార్గాలు కూడా ప్రతి ఒక్కరికీ అవసరమే. మరి తెలంగాణా రాష్ట్రం ఏర్పడడం వల్ల ఒకవేళ 13 జిల్లాలోని ఆరు కోట్ల మంది

తెలుగు ప్రజలు వెనక్కి వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడితే, ఇక్కడ ఉన్న తెలంగాణా ప్రజలు సుమారు 20 లక్షల మంది తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయే అవకాశం ఉంది. అదేవిధంగా సుమారు 17 లక్షల మంది సీమాంధ్ర ప్రజలు కూడా ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మరి వీళ్లందరికి విడిపోవడం వల్ల ఎలా న్యాయం జరుగుతుంది అధ్యక్షా. మరి ఈ రోజున కంపెనీలు పెట్టకుంటే, ప్రైవేటు ఉద్యోగస్తులను మనం పరిగణనలోనికి తీసుకోకుంటే మనం వారికి ఏ విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

( BELL )

నన్ను చెప్పనివ్వండి, బిల్లుమీదే మాట్లాడుతున్నాను అధ్యక్షా. మరి ఈ రోజు ప్రాంతాన్ని మీరు అభివృద్ధి చేశారా, మేము అభివృద్ధి చేశామా అని మాట్లాడుతున్నారు. ఎవరు అభివృద్ధి చేశారనే విషయం ఇక్కడ ఆలోచించాల్సిన అవసరంలేదు. మనందరికీ తెలుసు ఈ రోజు రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రాజధానిని, హాస్పిటల్స్, హైకోర్టులను ఏర్పాటు చేసుకుంటే అభివృద్ధి చెందదు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడిదార్లను ఆకర్షించే విధంగా ఆ ప్రాంతం ఉండాలి. పెట్టుబడిదార్లను ఆకర్షించే ప్రాంతంగా ఉండాలి అంటే, ఆ ప్రాంత వైశాల్యం, విస్తీర్ణం, ఆ ప్రాంతంలో వనరుల లభ్యత, మానవ వనరుల లభ్యత ఎంత ఉంది, చదువుకున్న వారు ఎంతమంది, అన్‌స్కిల్డ్‌వాళ్లు ఎంతమంది అన్‌స్కిల్డ్ కూలీలు ఎంతమంది అనేటువంటి విషయాలను చూడాల్సిన అవసరం ఉంది. ఆ ప్రాంతానికి నౌకాశ్రయంగా గానీ, విమానాశ్రయంగా గానీ రోడ్డు రవాణా కానీ, నీటి లభ్యత గానీ పెట్టుబడిదారులు పరిశీలిస్తారనే విషయాన్ని, అలాగే జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారులు కూడా పరిశీలిస్తారన్న విషయాన్ని మనందరం గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. అంతేగాని రాష్ట్రం విడిపోవాలంటే ఒక హైకోర్టును కట్టుకోండి రెండు సంవత్సరాల్లో పూర్తవుతుంది, సెక్రెటేరియట్‌ను కట్టుకోండి ఒక సంవత్సరంలో అయిపోతుంది, ఒక హాస్పిటల్‌ను కట్టుకోండి ఆరు నెలల్లో పూర్తవుతుంది అంటే అది భావ్యం కాదు అధ్యక్షా. రెండు చిన్న రాష్ట్రాలుగా ఏర్పడితే, వీటిని ఈ రాష్ట్రం కోల్పోతే పెట్టుబడులు పెట్టడానికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడిదారులు రాకపోతే భవిష్యత్తులో మన పిల్లలకు ఉద్యోగాలు ఎక్కడినుంచి వస్తాయి, ఉపాధి ఎక్కడినుంచి వస్తుందిని ఈ విభజనను కోరుకుంటున్న సభ్యులను అడుగుతున్నాను అధ్యక్షా. సరిహద్దు రాష్ట్రాలు కూడా ఏ విధంగా ఉన్నాయని పెట్టుబడిదారులు గమనిస్తారు. విభజన జరిగితే ఈ మూడు ప్రాంతాలు కూడా నష్టపోతాయని సభ్యులకు నేను తెలియజేస్తున్నాను. ఎందుకు కలిశాం, ఎవరు కలిశారు, ఎవరు ఆహ్వానించారు అనే విషయాలను అభివృద్ధి చెందిన వ్యక్తులుగా పక్కనే పెడితే, ఈ విభజన పేరుతో ఈ రాష్ట్రంలో ఉద్యోగాలు లేకుండా ఎందుకు 40 లక్షల మంది తెలుగు ప్రజలు ప్రైవేటు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఎందుకు నష్టం కలిగించాలని ఈ సందర్భంగా మిమ్మలి అడుగుతున్నాను.

ఇరిగేషన్ గురించి సభ్యులు మాట్లాడుతూ, విభజన జరిగితే సీమాంధ్ర ఎడారిగా మారిపోతుందని అంటున్నారు, నీటిని దోచుకున్నారు అనే అర్థంతోటి. నీటిని దోచుకోవడం వల్ల

ఎడారయ్యే పరిస్థితి రాలేదు. కలిసున్నప్పుడే బ్రిజేష్ ట్రైబ్యునల్ కమిటీ ద్వారా ఈ రాష్ట్రానికి అన్యాయం జరిగితే, విడిపోతే పరిస్థితి ఏమిటి? దాని వల్ల రెండు రాష్ట్రాల్లో ఉన్న రైతాంగానికి నష్టం జరుగుతుందనే విషయాన్ని సభ్యులందరికీ గుర్తు చేస్తున్నాను. దోపిడీ కాదు అధ్యక్షా, ఒక పోలవరం ప్రాజెక్టు కట్టుకోవాలన్నా, ఇతర విషయాల్లో ఏదైనా కావాలన్నా మనం కలిసి పోరాడితేనే రాష్ట్రానికి న్యాయం జరుతుంది. చాలా మంది మాట్లాడుతూ గోదావరి మా ప్రాంతం నుండి వెళుతుందని, వెళుతుంది, నీరు పల్లమెరుగు, నిజం దేవుడెరుగు అంటారు ఈ ప్రాంతంలో ఉన్న నదీ పరీవాహక ప్రాంతం యొక్క వ్యత్యాసాన్ని కూడా మనం గమనించాలి. చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంత్యంత ఎత్తైన ఎత్తిపోతల పథకాన్ని ఈ ప్రాంతంలో పెట్టిన ఘనత ఆయనకు ఉంది.

MR.DEPUTY SPEAKER: Please conclude.

శ్రీ పి. వెంకటేష్ ః తెలంగాణా ప్రాంతంలో కానీ, సీమాంధ్ర ప్రాంతంలో కానీ రైతాంగానికి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పని చేస్తున్నప్పుడు ఏ విధంగా ఈ నీటిని దోచుకుంటున్నారని అంటున్నారో నాకైతే అర్థం కాని పరిస్థితి. అధ్యక్షా నేను బిల్లుపైనే మాట్లాడుతున్నాను, ఈ బిల్లు రావడం వల్ల, విభజన జరగడం వల్ల అన్ని ప్రాంతాలకు ఎంత నష్టం జరుగుతుందో అనే విషయం నేను తెలియజేస్తున్నాను.

మ.1.50 RSS/MAR

ఈరోజున అన్యాయం జరిగింది, అన్యాయం జరిగింది అంటున్నాం, ఈ రాష్ట్రం ఒక పేద మంత్రి వర్గంతో గానీ ఒక పేద ముఖ్యమంత్రి ద్వారా గానీ ఈ 60 సంవత్సరాలు పరిపాలించబడలేదు. ప్రతీ మంత్రివర్గంలోనూ అన్ని ప్రాంతాలకు చెందిన అన్ని శాఖలకు చెందిన మంత్రులు ఉన్నారు. అంటే అందరూ మంత్రులు బాధ్యత వహించాలి కదా!

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః వెంటకేష్ గారూ.. ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ పి.వెంకటేష్ ః ఈరోజున అదే మంత్రులు, అదే చట్టసభలోని ప్రజాప్రతినిధులు మాకు అన్యాయం జరిగిందనంటే ఎంత వరకు సమంజసం. దానికి ఆనాడు ఈ శాసనసభలో ఉన్న శాసనకర్తలు, మంత్రి వర్గంలో ఉన్న వాళ్లు బాధ్యత వహించాలి. మనందరం ఒక్క సీమాంధ్ర ప్రాంత ప్రజలు ౽౽• చేశారంటే చాలా బాధాకరంగా ఉంటుంది, మా ప్రాంత ప్రజలందరూ కూడా చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఎందుకంటే ఈ మంత్రివర్గం ఒక ముఖ్యమంత్రి కొంత మంది మంత్రుల సమూహమే కదా! రాష్ట్ర పరిపాలన అనేది. ఆ సమూహంలో నుండి పుట్టిన సమస్యలను మనం అదే విధంగా పరిష్కరించుకోవాలే తప్ప దానిని ౽౽ అంటే ఎంత బాధాకరం.

• Expunged as ordered by the Chair

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ పి.వెంకటేష్ : ఈ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిన వ్యక్తులను అవసరమైతే రాజకీయాల నుండి బహిష్కరించి, క్రొత్తతరహా క్రొత్త యువతరంతో ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ప్రతి ప్రాంతానికి అభివృద్ధి జరిగేలా మనందరం కృషి చేయాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ పి.వెంకటేష్ : ఒక సామెత ఉంది, కష్టకాలంలో కలిసుందాం అనేవాడు – పంట కాలంలో ప్రక్కకు పో అన్నాడంట అంటే పంటలు వచ్చే సమయంలో ప్రక్కకు పొమ్మనో కష్టకాలంలో కలిసుందామనో ఈ విధంగా మాట్లాడితే దానికి ఏ విధంగా చేయాలి. ఈ రోజున సీమాంధ్రులందరూ కూడా ౙౙ [•] అంటున్నారు. ఏదో ఒక కుటుంబం, ఒక వ్యక్తికి సంబంధించిన వారు ప్రభుత్వాల ద్వారా ౙౙ సందర్భాలు ఉన్నాయి. ఒక్క కుటుంబం లక్ష కోట్లను ౙౙ చేసిందని, ఒక్క కుటుంబం గనులకు సంబంధించిన ౙౙ చేసిందనే సందర్భంలో సీమాంధ్రులందరూ ౙౙ అంటే ఎట్లా? ౙౙ చేసిన వాళ్లను శిక్షించాల్సిన బాధ్యత ఈ చట్టసభ మీద ఉంది. అంతేగానీ సీమాంధ్రులందరూ ౙౙ కాదు. ఎక్కడ ౙౙ అధ్యక్షా? ఈరోజున చాలా మంది అంటున్నారు. విభజనను కోరుకునే వ్యక్తులు..

(సభ్యులు శ్రీ టి.హరీష్‌రావు నుండి అంతరాయం)

MR.DEPUTY SPEAKER: He is speaking for the first time. Please sit down.

శ్రీ పి.వెంకటేష్ : అధ్యక్షా ఒక కుటుంబం ఆ కుటుంబానికి చెందిన స్నేహితులు వాళ్లు ౙౙ చేసుకుంటే మొత్తం సీమాంధ్రవాళ్లను ౙౙ ఎంత వరకు న్యాయం? ...(మైక్ కట్ అయ్యింది)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : సత్యవతి గారూ..

(ఈ దశలో టిడిపి పార్టీ సభ్యులు తమ సభ్యుడు శ్రీ పి.వెంకటేష్ గారికి అవకాశం ఇవ్వాల్సిందిగా అభ్యర్థించసాగారు)

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

[•] Expunged as ordered by the Chair

శ్రీ పి.వెంకటేష్ : అధ్యక్షా ఒక కుటుంబం ఈ రాష్ట్రాన్ని ** ఉందని ఆ కుటుంబాన్నే మనం ** చూపించాలి తప్ప సీమాంధ్ర ప్రాంత ప్రజలందరినీ ** చూపించకూడదు. ఎక్కడ ఏ వ్యక్తికైతే ప్రతిభ ఉంటుందో ఏ వ్యక్తి అయితే ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తాడో ఏ వ్యక్తి అయితే కృషి చేస్తాడో ఆ వ్యక్తులకే విజయావకాశాలు ఉంటాయి. మిగిలిన సీమాంధ్రులు అందరూ ప్రతీ ప్రాంతంలోనూ ప్రతీ జిల్లాలోనూ ఉన్నారు. అయితే వాళ్లు వాళ్ల ప్రతిభతోటో వాళ్ల కృషితోటో ఉన్నారే తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులను ఎక్కడా వారు ** • చేయలేదు. మరి ఎవరిని ** చేశారంటున్నారు వీళ్లు? జూబ్లీహిల్స్ బంజారాహిల్స్‌లో ఇళ్లు కట్టుకున్నారంటే అది తప్పా? ఒక వ్యక్తికి ఎమ్మెల్యే కావాలనే కోరిక ఉంటుంది. అతను ఎమ్మెల్యే కావడానికి కొన్ని కోట్లు ఖర్చు పెడతాడు. ఒక వ్యక్తికి ఇల్లు కట్టుకోవాలనే కోరిక ఉంటుంది. ఆ కోరికతో ఆ వ్యక్తి ఇల్లు కట్టుకొని ఉండొచ్చు. అంతేగానీ పెద్ద ఇల్లు కట్టుకున్న వాడు ** చిన్న ఇల్లు కట్టుకున్న వాడు ** కాదని అనడానికి వీల్లేదు. ఇదే కొలమానమైతే ఈరోజున విభజనను కోరుకుంటున్న ఎమ్మెల్యేలు వాళ్ల గ్రామాల్లో కట్టుకున్న పెద్ద పెద్ద ఇళ్లు ఆ గ్రామాలను ** కట్టుకున్నవా అని అడుగుతున్నాను. ఆ గ్రామ ప్రజలను వాళ్లు పెద్దవాళ్లు అయ్యారా అని అడుగుతున్నాను. వారి ప్రతభాపాటవాలు వారి కృషి వల్ల వాళ్లు పెద్దవాళ్లు కాలేదా అని అడుగుతున్నాను.

మనందరం హైదరాబాద్ రాష్ట్రంలో 8 జిల్లాలతో కూడిన తెలంగాణాతో కలిసాము. అదే హైదరాబాద్ రాష్ట్రంతో సీమ, కోస్తా జిల్లాలను కూడా కలిపారు. మరి ఈరోజున ఈ హైదరాబాద్ రాష్ట్రం మాదే ఈ తెలంగాణా ప్రాంతం మాదే సీమాంధ్రులు వెళ్లిపోండి అంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? హైదరాబాద్ రాష్ట్రంలో మేము కలిసాం మీరు కలిసారు. మీరు మేము కలిసుందామని మేము కోరుకుంటే తప్పేంటి? దాంట్లో తప్పేముంది?మీకు నిజంగా హైదరాబాద్ రాష్ట్రంతో కలిసుండాలని లేకపోతే, మీరు హైదరాబాద్ రాష్ట్రంలో ఉండండి మేము వెళ్లిపోతామని సెపరేట్ చేసుకునే పరిస్థితి ఉండాలి తప్ప, సీమాంధ్రులు వెళ్లిపోండి, హైదరాబాద్ రాష్ట్రంతో మేము కలిసుంటామనడం ఎంత వరకు న్యాయం? పోనీ హైదరాబాద్ రాష్ట్రన్ని విడిచి సీమాంధ్ర వాళ్లను వెళ్లమంటున్నారు, అసలు విభజన పేరుతో ఏర్పడిన పార్టీకి ఈ హైదరాబాద్ రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క సీటైనా దక్కిందా? అంటే హైదరాబాద్ రాష్ట్రం సీమాంధ్రులను కోరుకుంటుందనే కదా దాని అర్థం.

(ఈ దశలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన సభ్యులు అభ్యంతరాలను వ్యక్తం చేయసాగారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : సత్యవతి గారూ..

• Expunged as ordered by the Chair

(ఈ దశలో టిడిపి పార్టీకి చెందిన కొందరు సభ్యులు తమ సభ్యుడు శ్రీ పి.వెంకటేష్‌కి అవకాశం ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానాలను విడచి గౌరవ సభాపతి పోడియం వద్దకు వచ్చి అంతరాయం కలిగించసాగారు)

శ్రీమతి కె.సత్యవతి(భద్రాచలం) : అధ్యక్షా, ఈ రోజు మా తెలంగాణా జిల్లాలోని ఖమ్మం జిల్లా భద్రాచలం నియోజకవర్గం ప్రజల మనోభావాలను తెలియజేయడానికి అవకాశమిచ్చిన మీకు ముందుగా ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. అదే సందర్భంలో మాది భద్రాచలం నియోజకవర్గం 10 జిల్లాలతో కూడిన తెలంగాణా రాష్ట్రంలోనే ఉందని ముందుగా ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చిన శ్రీమతి సోనియాగాంధీ గారికి అలాగే ప్రధానమంత్రి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను.

ప్రధానంగా నేను సభకు విన్నవించేదేమంటే, ఇవాళ్ల భద్రాచలం నియోజకవర్గం మీద ఢిల్లీ నుండి గల్లీ వరకు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. దక్షణ భారతదేశంలోనే ఈరోజున భద్రాచలం రాముల వారికి ఒక గొప్ప చరిత్ర ఉంది. అదే సందర్భంలో భద్రాచలం రాముల వారికి ఆనాటి నైజాం నవాబుల నుండి ఈనాటి తానీషా తీసుకువచ్చే తలంబ్రాల వరకు భారతదేశంలోనే గొప్ప చరిత్ర ఉన్న ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం. దానితోబాటుగా భద్రాచలం ప్రాంతం చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ ఈ మూడు రాష్ట్రాలకు బోర్డర్‌లో ఉంది. దానితోపాటు ప్రత్యేక మారుమూల ఏజన్సీ గిరిజన ప్రాంతం ఇది. 80 శాతం మంది గిరిజనులు అక్కడ నివసిస్తున్నారు. అదే సందర్భంలో ఇప్పటికే మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వైద్యం అనేక రకాల మౌలిక సదుపాయాలను కల్పించినప్పటికీ ఇంకా అనేక రకాలుగా గిరిజనులు వెనుకబడే ఉన్నారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

దానితో పాటు అనేక రకాల అటవి ఉత్పత్తులు, బొగ్గు నిక్షేపాలు, ఇనుప ఖనిజం ఇన్ని ఉన్నప్పటికీ భద్రాచలం నియోజక వర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా 80 శాతం గిరిజనులు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. వారు అభివృద్ధి చెందాలంటే ప్రత్యేకంగా 10 జిల్లాలతో కూడిన తెలంగాణా రాష్ట్రంలోనే భద్రాచలం నియోజకవర్గాన్ని ఉంచాలి. దానితో పాటుగా ఉద్యోగపరంగా చూసినా, ఉపాధి పరంగా చూసినా ఏ రకంగా చూసినా మారుమూల ప్రాంతమైన భద్రచలం అభివృద్ధి విషయంలో వెనుకబడి ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మ.2.00 KV/RSS

దీనితోబాటుగా మా గిరిజన శాఖా మంత్రి గారు సోనియా గాంధీ గారిచ్చిన నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పడం ఏ విధంగా తప్పు అని అడుగుతున్నాను. నేను ఈ సభాముఖంగా తెలియజేసేది ఏమిటంటే గిరిజనుల ఇండ్ల మీద గిరిజన మంత్రుల మీద దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాను. అదే విధంగా పది జిల్లాలతో కూడిన తెలంగాణ అంటే

రాములవారితోబాటు మూడు ప్రాంతాల అభివృద్ధి కూడా దీనికి తోడ్పడి ఉన్నందున నిజంగా అభివృద్ధి జరగాలంటే తెలంగాణ రాష్ట్రంలోనే భద్రాచలం నియోజకవర్గం ఉండాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ, సోనియాగాంధీ గారికి, ప్రధానమంత్రి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

MR.DEPUTY SPEAKER: Yes, Satyavati garu, please complete it.

శ్రీ పి.వెంకటేశ్: అధ్యక్షా, ఎన్‌డీఏ ప్రభుత్వంలో యూపీ నుంచి ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఏర్పడటానికి ఆరోజున అక్కడున్న పరిస్థితులను కూడా ఒకసారి ఆలోచించాలి. రెండు రాష్ట్రాలను ఇప్పటికే ఏర్పాటుచేసినప్పుడు 57 సంవత్సరాల ఆకాంక్ష ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఎందుకు ఏర్పాటుచేయరని అడుగుతున్నారు. 57 సంవత్సరాల నాటి పరిస్థితులు ఈ రోజు ఉన్నాయా? ఆరోజున ఒక ఉత్తరం వెళ్లాలంటే వారం రోజులు పట్టేది. ఒక ట్రంక్ కాల్ చేయాలంటే పదిహేను రోజులు పట్టేది. ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి రావడం వల్ల నిమిషాల మీద ఎటువంటి వార్తనైనా పంపించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులలో ప్రపంచం మనకు దగ్గరవుతున్నప్పుడు మనం విడిపోవడానికి సంబంధించి ఈ బిల్లు ఈ సభకు రావడం చాలా బాధాకరం. మన ప్రాంతాలను ఇంకా ఎలా అభివృద్ధి చేసుకోవాలి, ఎలా విస్తరించుకోవాలి, రాష్ట్ర ప్రజలకు ఏ విధంగా న్యాయం చేయాలని ఆలోచించాల్సిన పరిస్థితులలో మనం విడిపోతే బాగుంటుందని అంటున్నారు.

తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రతి ఒక్క సభ్యుడూ విడిపోయి కలిసుందామని చెబుతున్నారు. విడిపోయి కలిసుందామని అనుకోవడం మూలంగానే హైదరాబాదు అధికారాలను గవర్నర్ చేతిలో పెట్టుకుంటాం, ఇంకొక అధికారాలు ఇంకొక చోట పెట్టుకుంటామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. రెండు పిల్లులు కొట్టుకుంటే కోతి పరిపాలించినట్లుగా ఈ బిల్లును పొందుపర్చారు. మన విధానాలు సరిగా లేనందువల్లనే ఈ పరిస్థితులు వచ్చాయని భావిస్తున్నాను.

అదే విధంగా ఎన్‌డీఏ హయాంలో ఏర్పడిన మూడు రాష్ట్రాలను పరిశీలిస్తే కచ్చితంగా ఆయా ప్రాంతాలు అటవీప్రాంతాలు, మైదాన ప్రాంతాలుగా ఉన్న ప్రాంతాలు. అటవీ ప్రాంతాలను సెపరేట్ చేయకపోతే జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులొచ్చి ఆ రాష్ట్రం అభివృద్ధి చెందదనే ఉద్దేశంతో మూడు కొత్త రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. ఈరోజు ఈ రాష్ట్రంలో చూస్తే మైదాన ప్రాంతంతో, ఓడరేవుతో అన్ని రకాలుగా ఈ రాష్ట్రంలో ఈ దేశంలో ఏ రాష్ట్రానికి లేని వసతులు, మౌలిక సదుపాయాలు ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మనం ఇదే విధంగా కలిసి ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యులుగా భారతదేశాన్ని పరిపాలించే స్థాయికి మనం ఎదగవచ్చనే విషయాన్ని సభ్యులందరూ గమనించాలని కోరుతున్నాను.

కొంత మంది ప్రజలు మాట్లాడుతూ మా ప్రాంత ప్రజలకు టెలివిజన్‌లు లేవు, పేపర్లు లేవు, వ్యాపారాలు లేవని చెప్పారు. ఏ ప్రాంత ప్రజలైనా టెలివిజన్ ఛానళ్లుపెట్టుకోవాలన్నా, పేపర్లు

పెట్టుకోవాలన్నా వారి విజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది తప్ప ఏ పేపరు వాళ్లు కానీ, ఏ టెలివిజన్ ఛానళ్లు కానీ ఎక్కడా ఈ ఈ* పరిస్థితులు మాత్రం లేవు.

ప్రతిభ కలిగిన వ్యక్తులు అన్ని ప్రాంతాలలో ఉన్నారు. ఈ రోజున సుప్రీంకోర్టులో కేసు వాదించుకోవాలంటే తెలంగాణ అడ్వకేటా లేదంటే సీమాంధ్ర అడ్వకేటా అని ఆలోచించకుండా ఢిల్లీలో గొప్ప అడ్వకేట్ ఎవరనేది చూసుకొని మనం నిర్ణయించుకుంటున్నాం. అదే విధంగా ఎవరి ప్రతిభాపాటవాలు, ఎవరి శక్తులను బట్టి ఈ ప్రపంచంలో వ్యక్తుల దగ్గరికి వెడతారు తప్ప వారు ఏ ప్రాంతానికి సంబంధించిన వారనేది చూడరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఈ ప్రాంతాన్ని నమ్ముకొని ఆంధ్రప్రదేశ్‌లోని 22 జిల్లాలకు సంబంధించిన డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఆడిటర్లు, సినిమా ఎగ్జిక్యూటివ్‌లు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, చిన్న వ్యాపారులు ఉన్నారు. ఇక్కడ జనాభా తగ్గిపోయి, వసతులు తగ్గిపోయి, సౌకర్యాలు, అవకాశాలు తగ్గిపోతే వారి కుటుంబాలను ఏ విధంగా పోషించుకుంటారని అడుగుతున్నాను. కేవలం 1,50,000 ప్రభుత్వోద్యోగాలతో ఈ రాష్ట్రమంతా నడిచిపోతున్నదా? మిగిలిన ఉద్యోగులు వారి ఉపాధిని కోల్పోతే వారి పరిస్థితి ఏమిటి?

హైదరాబాదు నగరాన్ని మూడు ప్రాంతాల ప్రజలు కలిసి తెలుగువారిగా అభివృద్ధి చేసుకున్నాం. ఈ రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేసుకోవడానికి 55 సంవత్సరాలు పట్టింది. (ఈ దశలో మైక్ కట్ చేయబడింది)

MR.DEPUTY SPEAKER: Yes, Vinay Bhaskar Garu.

శ్రీ డి. వినయ్ భాస్కర్ (వరంగల్ ఈస్ట్): అధ్యక్షా, 2013 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును నేను వ్యక్తిగతంగా సమర్థిస్తున్నాను, స్వాగతిస్తున్నాను. గత ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు చేస్తున్న పోరాట ఫలితంగా ఈ బిల్లు వచ్చిందని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు. 1969లో పోలీసు తూటాలకు గాయపడి మరణించిన అమరవీరులకు, నేటి తెలంగాణ ఉద్యమంలో 1100 మంది ఆత్మబలిదానం చేసుకున్న అమరవీరులందరికీ నా జోహార్లు తెలియజేస్తున్నాను.

ముందుగా ఈ బిల్లు గురించి మాట్లాడటానికి అవకాశం కల్పించిన మీకు, తెలంగాణ తల్లికి, నాపైన నమ్మకముంచి 2010 సంవత్సరంలో నా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన టి.ఆర్.ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు గారికి, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ గారికి నా పాదాభివందనాలు తెలియజేసుకుంటున్నాను. అంతే కాకుండా నన్ను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నా నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

---

* Expunged as ordered by the Chair

చాలా మంది సభ్యులు మాట్లాడుతూ చిన్న రాష్ట్రాల ద్వారా అభివృద్ధి జరగదని చెప్పారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి జరుగుతుందని అర్థశాస్త్రవేత్తలు తొమ్మిది అంశాలపైన ఈ దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాల పరిస్థితులను విశ్లేషించి వారిచ్చిన అభిప్రాయాలను చూస్తే అర్థమవుతున్నది. చిన్న రాష్ట్రాలైన గోవా, కేరళ, పంజాబ్ హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ఈ దేశంలో తెలంగాణ అంటే చిన్న రాష్ట్రం అంటున్నారు. తెలంగాణకంటే కూడా చిన్న రాష్ట్రాలు పదిహేను ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ విస్తీర్ణాన్ని పోలిస్తే 133 దేశాలు తెలంగాణకన్నా విస్తీర్ణంలో చిన్నవిగా ఉన్నాయి. అంతే కాకుండా భాషాప్రయుక్త రాష్ట్రాలతోనే రాష్ట్రాలు ఏర్పడాలని అంటున్నారు. ఈ దేశంలో అయిదు హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలున్నాయి. ఆ అయిదు హిందీ భాషను మాట్లాడే రాష్ట్రాలు ఒకే రాష్ట్రంగా కలిసున్నాయా అని ప్రశ్నిస్తున్నాను. అంటువంటి పరిస్థితులలో ఈ దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయి, కలిసుంటే తప్పేమిటని నేను సీమాంధ్ర నాయకులను ప్రశ్నిస్తున్నాను.

మ. 2.10 mms/rss.

అధ్యక్షా, దేశంలో రెండు తెలుగు భాషను మాట్లాడే రాష్ట్రాలుంటే తప్పేమిటనే విషయాన్ని తెలంగాణ ప్రజలు అడుగుతున్నారు. ఆనాడు ఏ ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం విలీనమైనదో తెలియజేయవల్సిందిగా మీ ద్వారా నా సహచర శాసనసభ్యులను అడుగుతున్నాను. ఆనాడు మంది పెద్ద మనుషులతో, వారిచ్చిన రక్షణ వల్ల జరిగిన ఒప్పందం వల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం విలీనమైన సందర్భంలో ఒప్పందాలు ఉల్లంఘనకు గురికావడం వల్ల, రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో ప్రభుత్వం విడుదల చేసిన జి.వో.లు ఉదాహరణకు జి.వో.యం.యస్. నంబర్ 36 నుంచి జి.వో.యం.యస్. నంబర్ 610 వరకు కూడా అమలుకానందునే తెలంగాణ ప్రజలందరూ ఆత్మగౌరవంతో బతికేందుకు గానీ, తెలంగాణలోని ఉద్యోగాలు తెలంగాణ వారికే దక్కాలని, మా నిధులు, మా నీళ్లు మాకు దక్కాలనే ఉద్దేశంతో గత అరవై సంవత్సరాలుగా తెలంగాణ ప్రాంతం పోరాటాన్ని కొనసాగిస్తోంది.

కొంత మంది స్వార్థంతో, కొంత మంది రాజకీయ పునరావాసం కొరకు తెలంగాణ ఉద్యమాన్ని నడిపిస్తున్నారనే విధంగా మాట్లాడుతున్నారు. కానీ తెలంగాణ ఉద్యమం గత అరవై సంవత్సరాలుగా రక రకాలుగా అనేక మలుపులు తిరిగి ఈ స్థాయికి చేరడం జరిగింది. తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్టుగా సీమాంధ్ర నాయకులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితి ఆ నాయకులకు తెలియడం లేదు. గతంలో తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించినటువంటి తెలుగుదేశం పార్టీ నేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు గానీ, ఆ తరువాత పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల ముఖ్యమంత్రులు గానీ తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామని

చెబుతున్నారు. ఈరోజున ఆయా పార్టీ ప్రభుత్వాలు తెలంగాణ ప్రాంతానికి చేసిన అభివృద్ధి గురించి నేను సభ ద్వారా తెలంగాణ ప్రజానీకానికి తెలియజేయాలని అనుకుంటున్నాను.

నల్లగొండ జిల్లా విషయానికొస్తే ఫ్లోరైడ్ విషయంలో చాలా అభివృద్ధి జరిగింది. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి ఫలితంగా ఈరోజు పరుగెత్తవల్సిన పదహేనేళ్ల యువకులు పడక మీద పడుకుని జబ్బుల బారిన పడుతున్నారు. తాగడానికి మంచి నీరు లేనందున ఫ్లోరైడ్‌తో కూడిన విషపూరితమైన నీరు తాగడం వల్ల కాలు, చెయ్యి వంకరపోవడంతో నడవలేని దయనీయ స్థితిలో జిల్లా ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఆ దిశగా సమైక్య రాష్ట్రంలో నల్లగొండ జిల్లాను పాలకులు అభివృద్ధిచేశారనే విధంగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా విషయానికొస్తే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు చేసిన నిరుద్యోగులకు ఉపాధి లభించక కూలీలుగా మారడం జరుగుతోంది. తుదకు కూలీ పనులు కూడా జిల్లాలో దొరకడం కష్టంగా మారడంతో దేశ నలుమూలలకు పాలమూరు జిల్లా ప్రజలు వలసపోతున్న పరిస్థితిని చూస్తే సమైక్య రాష్ట్రంలో పాలమూరు జిల్లాను పాలకులు ఏ విధంగా అభివృద్ధి చేశారనే విషయాన్ని మనం గమనించవచ్చు.

రంగారెడ్డి మరియు మెదక్ జిల్లాల విషయానికొస్తే, "సెజ్" ల పేరుతో, ఇండస్ట్రియలైజేషన్ పేరుతో రెండు జిల్లాలను అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు ఈ సమైక్య రాష్ట్రంలో మా తెలంగాణ రైతాంగం భూములను అప్పనంగా తీసుకోవడం జరిగింది. తుదకు రైతు అమ్ముకున్న సొంత భూమిలోనే కూలీగా మారిన పరిస్థితి కూడా ఈ రెండు జిల్లాల్లో ఉంది. అందుకే రెండు జిల్లాల్లో ఉన్నటువంటి మా తెలంగాణ ప్రాంత సోదర సోదరీమణులందరూ ఆత్మగౌరవంతో బతికేందుకే తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకుంటున్నారు.

అధ్యక్షా, కరీంనగర్ జిల్లా అభివృద్ధి విషయానికొస్తే, ప్రపంచంలోనే కరీంనగర్ జిల్లా నేత కార్మికులకు ఒక గుర్తింపు వచ్చింది. అగ్గిపెట్టెలో చీరలను తయారుచేసిన మా తెలంగాణ ప్రాంత నేత కార్మికుల దుస్థితి ఈనాడు దయనీయంగా మారింది. ముఖ్యంగా జిల్లాలోని సిరిసిల్ల విషయాన్ని ఉదాహరణగా తీసుకుంటే నేత కార్మికులు పూట గడవక ఆత్మహత్యలు చేసుకుంటున్న దయనీయ పరిస్థితి అక్కడ కనబడుతోంది. నేత కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. సమైక్య రాష్ట్రంలో ఉన్న తెలంగాణలోని కరీంనగర్ జిల్లాను పాలకులు ఆ విధంగా అభివృద్ధి చేశారని చెప్పక తప్పదు. అందుకే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్షతో ఉన్నారు.

ఆదిలాబాద్ జిల్లా విషయానికొస్తే అంటురోగాలతో జిల్లాను పాలకులు అభివృద్ధి చేశారు. జిల్లాలో వందల, వేల మంది గిరిజనులు, ఆదివాసీలు అంటురోగాల బారినపడి సరైన వైద్యం లభించక మరణించడం జరిగింది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత అభివృద్ధి అంటే ఇదేనా?

ఇక మీదట అంటురోగాలు మాకు వద్దనే భావనతో, అంటురోగాలు లేనటువంటి తెలంగాణ రాష్ట్రంలో ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ఈరోజు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారు.

నిజామాబాద్ జిల్లా పరిస్థితి చూస్తే, జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి లభించనందున బొంబాయ్ నగరానికి, దుబాయ్ దేశానికి వలసలు పోతున్నారు. సమైక్య రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా పరిస్థితి ఆ విధంగా ఉంది. అక్కడ కూడా వలస వెళ్లిన వారికి ఉపాధి లభించక ఏజెంట్లతో, బ్రోకర్లతో దగా పడి అక్కడే ఆత్మహత్యలు చేసుకుంటే, చివరకు ఆత్మహత్యలకు పాల్పడిన శవాలు కూడా ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు బాధపడుతున్న సంఘటనలు జిల్లాలో అనేకంగా ఉన్నాయి. అందుకే నిజామాబాద్ జిల్లా ప్రజలందరూ ఆత్మగౌరవంతో బతకాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితేనే చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో జిల్లా ప్రజలందరూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్నారనే విషయాన్ని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

ఖమ్మం జిల్లా విషయానికొస్తే, ఆ జిల్లాలో నీటి దోపిడి జరిగింది. గనుల దోపిడి ఆ జిల్లాలో జరుగుతోంది. ఉద్యమ ఫలితంగా ఆ జిల్లాలో దోపిడిని అరికట్టడం జరిగింది.

హైదరాబాద్ నగరాన్ని మేం అభివృద్ధి చేశామని పాలకులు ఎవరికి వారే చెబుతున్నారు. హైటెక్ సిటీని ఏర్పాటు చేశామని ప్రగల్బాలు పలుకుతున్నారు. ఆనాటి ఆల్విన్ కంపెనీ, డి.బి.ఆర్. మిల్స్ వంటి సంస్థలు ఎక్కడికి పోయినాయని నేను పాలకులను ప్రశ్నిస్తున్నాను? రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీకి చెందినటువంటి వేల మంది ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? అదే విధంగా దక్కన్ ఫ్యాక్టరీ ఎటు పోయింది? దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మా తెలంగాణవాదుల ఉద్యోగ పరిస్థితి ఏమిటి? ఆనాడు నిజాం పరిపాలనలో తెలంగాణ ప్రాంతంలో ఉన్న పరిశ్రమలన్నీ ఈ సమైక్యరాష్ట్రంలో కాలగర్భంలో కలిసిపోయిన మాట వాస్తవం కాదా? ఆ పరిశ్రమల్లో పనిచేసిన వేలాది మంది కార్మికులు ఉపాధిని కోల్పోయి వీధినపడిన విషయం వాస్తవం కాదా అని పాలకులను ప్రశ్నిస్తున్నాను.

వరంగల్ జిల్లా విషయానికొస్తే, సమైక్య రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జిల్లాలో జరగలేదు. నిజాం కాలం నాటి ఖాజీపేట్ రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి పెంచాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఈ సమైక్య రాష్ట్రంలో నెరవేరలేదు. సికింద్రాబాద్ డివిజన్‌కు 120 కిలో మీటర్ల దూరంలో ఖాజీపేట్ రైల్వే జంక్షన్ ఉంది. ఖాజీపేట్ రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి పెంచలేకపోయారు ఈ పాలకులు. అదే ఆంధ్ర ప్రాంతంలోని విజయవాడ మరియు గుంటూరు రైల్వే జంక్షన్లను మాత్రం డివిజన్ స్థాయికి పెంచగలిగారు. ఏ విధంగా రెండు రైల్వే డివిజన్ల ఏర్పాటు జరిగిందనే విషయాన్ని వరంగల్ జిల్లా ప్రజానీకం ప్రశ్నిస్తోంది.

వరంగల్ నందు ఆజాంజాహి మిల్స్ ఉండేది. ప్రత్యక్షంగా పది వేల మందికి, పరోక్షంగా ఇరవై ఐదు వేల మందికి  ఉపాధి కల్పించే ఆజాంజాహి మిల్స్ మటుమాయమైంది.  ఈ చంద్రబాబు నాయుడు గారి పాలనలో ఆజాంజాహి మిల్స్ మటుమాయమైంది. ఆజాంజాహి మిల్స్‌కు సంబంధించిన భూములు మాత్రం కాంగ్రెస్ పాలనలో మాయమైనాయి.  సమైక్య రాష్ట్రంలో వరంగల్ జిల్లా అభివృద్ధి ఆ విధంగా జరిగింది. అందుకే తెలంగాణ రాష్ట్రం కావాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏం చేసిందని కొంత మంది ప్రశ్నిస్తున్నారు.  ఈ సందర్భంగా కొన్ని నిజాలను చెప్పదలచాను. టి.ఆర్.యస్. పార్టీ ఆవిర్భవించక ముందు 1994వ సంవత్సరం నాటి ఎన్నికల్లో హన్మకొండ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందిన మా సోదరుడు స్వర్గీయ దాస్యం ప్రణయ భాస్కర్ గారు తెలంగాణ ప్రాంతంలోని వరంగల్ జిల్లాలో జరుగుతున్న భూటకపు ఎన్‌కౌంటర్ల గురించి శాసనసభలో ప్రస్తావించినప్పుడు ఆనాడు మీ స్థానంలో కూర్చునటువంటి ఆనాటి సభాపతి శ్రీ ఎనుమల రామకృష్ణుడు గారు "తెలంగాణ"  అనే పదాన్ని శాసనసభలో వాడొద్దని చెప్పడం జరిగింది. ఆ తరువాత టి.ఆర్.యస్. పార్టీ ఆవిర్భవించిన తరువాత ఇదే సభలో ఆనాడు నిషేధించిన "తెలంగాణ" పదాన్ని ఈనాడు సభలో  నిత్యం  అన్ని పార్టీలు పదే పదే ఉచ్చరిస్తున్నాయి.  తెలంగాణ అంశాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకెళ్లిన ఘనత  టి.ఆర్.యస్. నేత శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారికే దక్కిందనే విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కొంత మంది ఈఈ• తెలంగాణ ఉద్యమాన్ని కించపర్చే విధంగా మాట్లాడుతున్నారు. తెలుగు దేశం పార్టీలో తెలంగాణకు సంబంధించిన కొంత మంది నాయకులు ఒక ఫోరాన్ని ఏర్పాటు చేసుకున్నారు.  తెలుగుదేశం పార్టీ ఫోరం పేరుతో ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఫోరం అధ్యక్షుడు ఇంటి పేరు తెలియదు గానీ, అధ్యక్షుడి పేరు మాత్రం "డీలర్ దయాకర్ రావు" అని జిల్లాలో అంటారు.  మా పార్టీ అధ్యక్షుడిని, మా పార్టీ ఉప నేత మీద బురదజల్లే ప్రయత్నాన్ని ఆ ఫోరం అధ్యక్షుడు చేస్తున్నాడు. ఆ ఫోరం అధ్యక్షుడు  ప్రాణ త్యాగానికి సిద్ధపడిన శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారిని విమర్శిస్తున్నారు. కానీ ఆ ఫోరం అధ్యక్షుడే ఒక ద్రోహిగా ముద్రపడ్డాడు. మా జిల్లాలో ఆయనను ఇంటి పేరుతో ఉచ్చరించరు.  కానీ "డీలర్ దయాకర్ రావు" అని అంటారు.

(ఆ సందర్భంలో వరంగల్ జిల్లాకు చెందిన తెలుగు దేశం పార్టీ సభ్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ మరియు శ్రీ డి.అనసూయ (సీతక్క) వారి స్థానాల్లో నిల్చొని ప్రసంగాన్ని అడ్డుకోబోయారు)

తెలంగాణ ఉద్యమం రాకముందు  ఆయన "డీలర్ దయాకర్ రావు" గా ఉండేవారు ఈనాటి ఉద్యమ ఫలితంగానే ఆయన "డాలర్ దయాకర్ రావు" అయ్యాడు. ఈరోజు వారు మా పార్టీని విమర్శిస్తారు.   ఉద్యమ నేపథ్యంలో అసువులు బాసిన  తెలంగాణ బిడ్డ శ్రీకాంతాచారి

---

• Expunged as ordered by the Chair

మరణానంతరం ఆ కుటుంబాన్ని ఆదుకున్నది మా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ. శ్రీకాంతాచారి చావుబతుకులతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఆసుపత్రిలో వెన్నంటే ఉండి మెరుగైన వైద్యం అందించేందుకు తపన పడింది మా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ. జిల్లాలో తెలంగాణ ఉద్యమం సందర్భంగా 98 ఆత్మ బలిదానాలైతే, తెలంగాణ ద్రోహులు మరియు తెలుగుదేశం పార్టీ ఫోరం అధ్యక్షుడైన శ్రీ దయాకర్ రావు గారు సభలో ప్రస్తావించింది కేవలం 58. దయాకర్ రావు గారి పేరుతో డెత్ డిక్లరేషన్ వ్రాసి ఆత్మ బలిదానాలకు పాల్పడిన తెలంగాణ బిడ్డలు కూడా ఆ ఆత్మ బలిదానాల్లో ఉన్నారనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

(తెలుగు దేశం పార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Please conclude Vinaya Bhasker Garu.

శ్రీ దాస్యం వినయ భాస్కర్: టి.ఆర్.యస్. పార్టీ ఈరోజున ఉద్యమాన్ని నడిపింది రాజకీయ పునరావాసం కోసం కాదనే విషయాన్ని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. తెలంగాణ ఉద్యమం గత అరవై యేళ్లుగా నడుస్తోంది.

మ.2.20 KU / KKR.

అధ్యక్షా ఈ రోజు కావల్సిన రాజకీయ పునరావాసం కోసం మాట్లాడం కాదు, గత అరవై సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమం రోజుకు ఒక్కొక్క దశలో ఒక్కోరీతిలో నడిచింది. ఒకప్పుడు విద్యార్థులు ఉద్యమం జోరుగా నడిస్తే, ఒక దశలో మా మేధావులైన శ్రీ జయశంకర్ గారు, వి.జనార్ధన్‌రావు గారి నేతృత్వంలో ఉద్యమం నడిచింది. మరో దశలో తెలంగాణా డాక్టర్లు , న్యాయవాదులు ఉద్యమాన్ని నడిపించారు. తెలంగాణాలోని కార్మిక, కర్షకులు, ప్రజాసంఘాలతో ఉద్యమాలు నడిచాయి అధ్యక్షా. ఈనాటి తెలంగాణా ఉద్యమం తెలంగాణ ఆత్మగౌరవం కోసం నడిచింది. మా సోదరులు కేటిఆర్ గారు ట్యాంకు బండపై మట్టి విగ్రహాలు గురించి మాట్లాడితే తప్పుపట్టిన వారు వినాయక ఉత్సవాలలో కాలుష్య రహితంగా ఉండేందుకు మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని చెప్పారు అది తప్పుకాదా అధ్యక్షా. అందుకే ఈ సమైక్య రాష్ట్రంలో టిఆర్ఎస్ వారికి ఏమి జరుగుతుంది అని మాట్లాడుతున్నారు. ఈ రోజు ప్రజాస్వామ్య బద్ధంగా శాంతి యుతంగా మా నిరసన కార్యక్రమం చేపట్టిన సందర్భంలో మా టి.ఆర్.ఎస్. పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ గారికి పోలీసులు వేసిన ముళ్లకంచెలుతో గాయాలు అయ్యి 93కుట్లుతో ఆపరేషనే జరిగింది. అంతేకాదు ఎంతోమంది టి.ఆర్.ఎస్ కర్యకర్తలు బలిదానాలకు గురిఅయ్యారు.

మా సోదరులు పయ్యావుల కేశవ్ గారు రాణి రుద్రమదేవిని గురించి ప్రస్థావించడం జరిగింది. మా జిల్లాలో కాకతీయుల ఉత్సవాలు గురించి మీరేమన్నా పట్టించుకున్నారా అధ్యక్షా, పట్టించుకోలేదు. 800 సంవత్సరాలున్న కాకతీయుల కాలం నాటి చరిత్రను విస్మరించిన ఘనత సీమాంధ్ర పాలకులకు ఉంది. కాకతీయ ఉత్సవాలకు గాను రూ.300కోట్లు కేటాయించాల్సిందిగా

ప్రభుత్వాన్ని కోరగా కేవలం రు.30కోట్లు కేటాయించిన దుర్భర పరిస్థితి నెలకొని ఉంది. కాకతీయ ఉత్సవాల సందర్భంగా భారత రాష్ట్రపతి గారి చేతులమీదుగా ప్రారంభోత్సవం లేదా ఉత్సవాల ముగింపు కార్యక్రమం చేయాలని మేము కోరుకుంటే చివరకు ఆ పని కూడా చేయలేదు. కాకతీయ ఉత్సవాలు కేవలం వరంగల్ పట్టణానికే పరిమితం చేశారు.

(బెల్ )

MR.DEPUTY SPEAKER : Please conclude.

శ్రీ డి. వినయ భాస్కర్ : కాకతీయ ఉత్సవాల సందర్భంగా రాణి రుద్రమదేవి గారి పేరుతో తపాలాబిళ్లను విడుదల చేయమని కోరగా ఆ కోరిక కూడా నెరవేరలేదు. ప్రభుత్వ మరియు సీమాంధ్ర పాలకుల చర్యలకు వ్యతిరేకంగా మా తెలంగాణ ప్రజలు రాణిరుద్రమ దేవి పోస్టల్ స్టాంపును విడుదల చేసుకోవడం జరిగింది. శ్రీ కాళోజీ నారాయణరావు గారి విగ్రహాన్ని ట్యాంకుబండ్ పైన ప్రతిష్టించాల్సిందిగా కోరినప్పటికీ ఈ నాటి వరకు ప్రతిష్టించలేదు. ఈ రోజు సీమాంధ్ర ప్రభుత్వంలో మా కాళోజీ గారికి 300 గజాల స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరినా కూడా కేటాయించ లేదు. ఇటువంటి వివక్షత, ఊఊ* జరుగుతోందంటే సీమాంధ్ర పాలకులకు మా తెలంగాణ పట్ల ఉన్న ప్రేమ ఏందో తెలుస్తుంది అధ్యక్షా.

(ఈ దశలో గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

ఆత్మగౌరవంతో బ్రతకాలనే ఉద్దేశ్యంతోనే తెలంగాణ ప్రజలంతా తెలంగాణ కోసం పోరాడుతున్నారు. ఈ ఉద్యమాల్ని గౌరవిస్తూ కేంద్రప్రభుత్వం స్పందించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఈ తెలంగాణా ప్రజలు ఎటువంటి ఆంక్షలు లేని తెలంగాణరాష్ట్ర ఏర్పాటును కోరుకుంటున్నారు. ఆంక్షలు లేని తెలంగాణ రాష్ట్రం వచ్చేటంతవరకు కె.సి.ఆర్ గారి నాయకత్వంలో కచ్చితంగా ఉద్యమిస్తాం, తెలంగాణ ప్రజల పక్షాన నిలబడతాము అని తెలియపర్చుకుంటున్నాను. నాకు మాట్లాడే అవకాశం కల్పించిన తమరికి మా నియోజకవర్గ ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

MR.SPEAKER: Please speak on the Bill.

శ్రీ టి. బాలరాజు (పోలవరం) : ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు రావడం చాల దురదృష్టకరం, బాధాకరం. నిజంగా ఇటువంటి బిల్లు ఈ సభకు వస్తుందని నేను కలలోకూడా ఊహించుకో లేదు. ఈ రోజు మెజారిటీ ప్రజానీకం ఈ రాష్ట్రం సమైక్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా వైఎస్ఆర్. కాంగ్రెస్ పార్టీ సమైక్యాంధ్రప్రదేశ్‌కు కట్టుబడి ఉంది అధ్యక్షా. దివంగత నేత శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు బ్రతికి ఉండి ఉంటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు. నిజంగా ఆయన పరిపాలన ఒక స్వర్ణయుగం అధ్యక్షా. అన్నీ ప్రాంతాల్ని సమానంగా వారు చూశారు. అన్నీ ప్రాంతాలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు, అతీతంగా వారి పథకాలు ఉండేవి. అందుచేత వారి పరిపాలనను ఒక స్వర్ణయుగపు పరిపాలనగా భావిస్తారు. ఆనాడు ఏ వాదం గాని,

* Expunged as ordered by the Chair

ఉద్యమం గానీ ఉండేది కాదు. దీనిని బట్టి అర్థం చేసుకుంటే ఒక అసమర్థమైన నాయకత్వం వల్లనే ఈ నాడు ఈ పరిస్థితి ఏర్పడింది. ఆయన దమ్మున్న నాయకులు కాబట్టే ఈ రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి పరచారు. అందుకే ఈ రోజు నా నియోజకవర్గ ప్రజల తరఫున, పశ్చిమ గోదావరి జిల్లా ప్రజల తరఫున వారి మనోభావాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ స్ఫూర్తికి, సమైక్య స్ఫూర్తికి వ్యతిరేకంగా ఈ ముసాయిదా బిల్లు వచ్చినందుకు నేను వ్యక్తి గతంగాను వైఎస్ఆర్ పార్టీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఈ రాష్ట్రం విడిపోతే ఇరు ప్రాంతాలకు నష్టం వాటిల్లుతుంది. అదే విధంగా ఈ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసీ వర్గాలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుంది. దానికంటే ముఖ్యంగా గిరిజనులకు తీవ్రంగా అన్యాయం జరుగబోతుంది. శ్రీకాకుళం నుండి అదిలాబాద్ జిల్లా వరకు ఈ రాష్ట్రంలో గిరిజనులు ఉన్నారు. వీరియొక్క భాష , సంస్కృతి, సాంప్రదాయాలు వేరుగా ఉంటాయి అధ్యక్షా. వీరికి ప్రత్యేక హక్కులు చట్టాలు ఉన్నాయి. ఈ గిరిజన ప్రాంతాల్లో 5 మరియు 6 వ షెడ్యూల్స్ అమలులో ఉన్నాయి. ఒక ప్రాంతం గవర్నర్ కస్టడీలో గవర్నర్ చేతుల్లో ఉంటుంది. రాష్ట్రం విడిపోవాలన్నా కలిసి ఉండాలన్నా ఈ ప్రాంతంలో గ్రామ సభలు జరగాల్సి ఉంటుంది. ఈ రాష్ట్రంలో ఉన్న గిరిజన మంత్రి అధ్యక్షతన ట్రైబల్ సబ్ ప్లాన్ కూడా అమలు జరగాలి. ఇటువంటివి ఏమి జరుగకుండా ఈ రాష్ట్రాన్ని విడగొడతాము అంటే అందుకు ఎవరూ ఒప్పుకోరు. రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర విభజన జరుగుతుంది. అందుకే నేను తీవ్రంగా ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఎటువంటి అసెంబ్లీ తీర్మానం లేకుండా, సభా గౌరవం పాటించకుండా మాకు మరియు మా ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా రాష్ట్ర విభజన ప్రక్రియ జరుగుతుంది కాబట్టి మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఈ బిల్లులో 01 నుండి 108 వరకు ఉన్న క్లాజులను తొలగించాల్సిందిగా మేము కోరుతున్నాం. అదే విధంగా మా అభిప్రాయలను రాత పూర్వకంగా అందజేస్తున్నాం. వీటన్నింటినీ రికార్డ్ చేసి భారత రాష్ట్రపతి గారికి పంపించాల్సిందిగా కోరుకుంటూ అ అవకాశం ఇచ్చినందుకు తమకు ధన్యవాదాలు తెలియపరుచుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : రేవంత్ రెడ్డి గారూ..

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి : అధ్యక్షా 2013వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవ స్థీకరించుటకు దాని అనుసంఘీకమైన విషయాలను నిభందించుటకై ఇచ్చిన బిల్లు భారత ప్రజారాజ్యపు 64వ సంవత్సరం పార్లమెంట్ ఈ క్రింది శాసనం, అంటే తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి శాసన సభకు పంపించిన బిల్లుకు సంబంధించి హక్కు దార్లమైన మేము అందరం ఈ బిల్లును నూటికి నూరు శాతం సమర్థిస్తున్నాం. ఈ బిల్లును ఆమోదిస్తున్నాం. ఈ సందర్భంగా వరుస సంఖ్య 72 కొడంగల్ నియోజకవర్గ ప్రజల తరఫున చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుంటున్న సందర్భంలో ఈ సభలో ఆ ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు నాకు ఒక అవకాశం దొరికింది. అయితే నా నియోజక వర్గానికి కానీ, నాకు గానీ ఒక ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నాయి. ఆనాడు భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల కర్ణాటక రాష్ట్ర పరిధిలోని గుల్బర్గా నియోజకవర్గంలో ఉండిన కొడంగల్ నియెజకవర్గం మహబూబ్ నగర్ జిల్లాకు 1956వ సంవత్సరంలో బదలాయించబడింది అధ్యక్షా.

అయితే ఈ భాషా ప్రయుక్త రాష్ట్రాల వలన ఎప్పుడైతే మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మా నియోజకవర్గాన్ని చేర్చారో అప్పటి వరకు నా నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ మున్సిపాలిటీగా ఉండి ఆ సందర్భంలో గ్రామ పంచాయితీగా మారిపోయింది అధ్యక్షా.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : (మైకు లేకుండా ) నా పేరు ప్రస్తావనకు తెచ్చిన విషయంపై నాకు మాట్లాడే అవకాశం కల్పించండి సార్ అంటూ తను లేచి నిలుచున్నారు.

MR.SPEAKER: Let him complete. If you go into that, your own Member will lose the time. Anything personal, anything objectionable, I will correct it.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : నేను ఒక డీలర్‌ను అని, నాకు ఆస్తులు లేవు అని తిట్టడం జరిగింది సార్. ఒకటి సార్, నేను అసెంబ్లీలో ఛాలెంజ్ చేస్తున్నాను కేసిఆర్ గారి ఆస్తి , నా ఆస్తి ...

(టిఆర్ఎస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

మిస్టర్ స్పీకర్ : మీరు డిస్ట్రబ్ చేయవద్దు. మీరుకూర్చోండి.

(టిఆర్ఎస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : మీరు వినాలి సార్. నా ఆస్తిని సీలింగ్‌లో సరండర్ చేశాను. నేను డీలర్‌ను కాదు, డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశాను. మా తండ్రి గారు1964వ సంవత్సరంలో సమితి ప్రెసిడెంట్‌గా పోటీ చేశారు. మా నాన్న రాజకీయ నాయకులు, ఆస్తిపరుడు, మా నాన్న ఎల్.ఎం.బి. ఛైర్మన్, డీసీసీబి ఛైర్మన్ మా నాన్న భూస్వామి, మా భూములను ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ద్వారా ప్రభుత్వానికి అప్పగించాం.

మ. 2.30 jnv/ku.

కె.సి.ఆర్ మాదిరిగా మేము ఈ రోజు శవాలను పెట్టుకొని తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డంగా పెట్టుకొని ఆస్థులను కూడబెట్టుకున్నవారం కాదు. సెంటిమెంట్ పేరు చెప్పుకొని ఏనాడు మేం బ్రతుకలేదు. తెలంగాణా ఉద్యమం చేస్తూ చందాలు పుచ్చుకొని బ్రతుక లేదు. నేను ఛాలెంజ్ చేస్తున్నాను. కేసిఆర్ కంటే నేను కోటీశ్వరుడినే. కేసిఆర్ ఆస్తి ఎంత, వారి కుటుంబం ఆస్తి ఎంత ఛాలెంజ్ చేస్తున్నా ....

(పోడియం వద్దకు చేరి టిఆర్ఎస్ పార్టీ సభ్యులచే అంతరాయం )

MR.SPEAKER: That will not go into the record. Do you want to set the record straight? Please go back to your seats.

The House is adjourned to meet again tomorrow at 9.00 a.m.

(The House then adjourned at 2,36 p.m. to meet again tomorrow at 9.00 a.m. ie., the 25th of January, 2014)